RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in




27 అక్టోబర్ 2024 ఆదివారం | హైదరాబాద్ | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:20 | సంచిక:126

# యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు కోసం మరో ముందడుగు

**యూనివర్సిటీ క్యాంపస్ నిర్మాణానికి రూ.200 కోట్లను కేటాయించింది మేఘా కంపెనీ**

**నవంబర్ 8వ తేదీ నుంచి యూనివర్సిటీ భవన నిర్మాణ పనులు**

**సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు**



హైదరాబాద్ అక్టోబర్ 26 యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు కోసం మరో ముందడుగు పడింది. స్కిల్స్ యూనివర్సిటీ భవన నిర్మాణానికి మేగా ఇంజనీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ ముందుకొచ్చింది. యూనివర్సిటీ క్యాంపస్ నిర్మాణానికి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ నిధుల నుంచి రూ.200 కోట్లను మేఘా కంపెనీ కేటాయించింది. యూనివర్సిటీ క్యాంపస్‌లో అవసరమైన భవనాలన్నింటినీ నిర్మించే బాధ్యతలను మేఘా కంపెనీ స్వీకరించింది. ప్రపంచ స్థాయి అధునాతన నమూనాలతో అన్ని మౌలిక వసతులతో స్కిల్స్ యూనివర్సిటీ నిర్మాణం చేపట్టేందుకు మేఘా కంపెనీ ముందుకొచ్చింది.సచివాలయంలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డితో మేఘా కంపెనీ ఎండీ కృష్ణారెడ్డి కంపెనీ ప్రతినిధుల బృందం చర్చలు జరిపారు. సీఎంతో పాటు చర్చల్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు. ప్రభుత్వం తలపెట్టిన స్కిల్స్ యూనివర్సిటీ నిర్మాణంలో భాగస్వామ్యం పంచుకునేందుకు మేఘా కంపెనీ నిర్వాహకులు చర్చలు జరిపారు. ప్రపంచస్థాయి ప్రమాణాలతో స్కిల్స్ యూనివర్సిటీ క్యాంపస్ నిర్మాణం చేపడుతామని మేఘా కంపెనీ ప్రకటించింది. యూనివర్సిటీ భవనాల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం (ఎంవోయూ) మేఘా కంపెనీ చేసుకుంది.ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ వీఎల్వీఎస్‌ఎస్ సుబ్బారావు సమక్షంలో ఎంవోయూపై సంతకాలు చేశారు. హైదరాబాద్ శివార్లలో కందుకూరు మండలం మీర్ ఖాన్ పేట సమీపంలో 57 ఎకరాల విస్తీర్ణంలో యూనివర్సిటీ నిర్మాణానికి సీఎం రేవంత్ రెడ్డి భూమి పూజ చేశారు. అధునాతన బోధన సదుపాయాలతో పాటు విద్యార్థులకు అన్ని వసతులుండేలా క్యాంపస్ నిర్మాణం చేపట్టాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. సీఎస్‌ఆర్ నిధులతో ఈ క్యాంపస్ నిర్మాణానికి మేఘా కంపెనీ ముందుకు వచ్చినందుకు సీఎం రేవంత్‌రెడ్డి అభినందనలు తెలిపారు. అకాడమిక్ బిల్డింగ్, వర్క్ షాపులు, తరగతి గదులతో పాటు హాస్టల్ బిల్డింగ్ నిర్మిస్తామని మేఘా కంపెనీ ఎండీ కృష్ణారెడ్డి తెలిపారు. ఇప్పటికే ఆర్కిటెక్ట్‌లతో నిపుణులతో తయారు చేయించిన డిజైన్‌లపై చర్చించారు. వారం రోజుల్లోగా భవన డిజైన్లకు తుది రూపు ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. నవంబర్ 8వ తేదీ నుంచి యూనివర్సిటీ భవన నిర్మాణ పనులు ప్రారంభించడానికి ఏర్పాట్లు చేసుకోవాలని సీఎం రేవంత్‌రడ్డి ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వం తరఫున అవసరమైన సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు.

# ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం ప్రత్యేక యాప్

**రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



హైదరాబాద్ అక్టోబర్ 26 ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం ప్రత్యేక యాప్‌ను రూపొందించామని రాష్ట్ర రెవెన్యూ, గృహ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం తెలిపారు. లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉంటుందని చెప్పారు. అర్హులందరికీ ఇళ్లు కట్టిస్తామని చెప్పారు. ఈ మేరకు లబ్ధిదారుల ఎంపిక కోసం రూపొందించిన యాప్‌ను సచివాలయంలో పరిశీలించారు. యాప్‌లో చేయాల్సిన మార్పులకు సంబంధించి పలు సూచనలు చేశారు. ఆయన సూచనల మేరకు మార్పులు చేసి తరువాతి వారంలో యాప్‌ను అధికారులు అందుబాటులోకి తీసుకురానున్నారు.అనంతరం మంత్రి మాట్లాడుతూ.. "ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు త్వరలోనే ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభిస్తాం. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయి. గ్రామీణ ప్రాంతాల ప్రజలను దృష్టిలో పెట్టుకొని యాప్ తెలుగు వర్షన్‌లో ఉండాలని సూచించా. లబ్ధిదారుల ఎంపిక నుంచి ఇళ్ల కేటాయింపు వరకు టెక్నాలజీని వీలైనంత ఎక్కువగా ఉపయోగించుకోవాలి. అర్హులైన వారందరికి ఇళ్లు కట్టించి ఇవ్వడమే కాంగ్రెస్ సర్కార్ ధ్యేయం" అని మంత్రి తెలిపారు.

# ప్రజాస్వామ్యం, న్యాయం, రాజ్యాంగం నిర్దేశించిన విలువల కోసం పోరాడుతున్నాను: ప్రియాంక



వయనాడ్, అక్టోబర్ 26ప్రజాస్వామ్యం, న్యాయం, రాజ్యాంగం నిర్దేశించిన విలువల కోసం పోరాడుతున్నానని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ తెలిపారు. ప్రజాప్రతినిధిగా పోటీ చేసే ఈ ప్రయాణం తనకు కొత్త కావొచ్చని, ప్రజల తరఫున పోరాటం కొత్తేమీ కాదని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ తరఫున వయనాడ్ లోక్ సభ ఉపఎన్నిక బరిలో ఉన్న ప్రియాంక అక్కడి ప్రజలకు ఒక బహిరంగ లేఖ రాశారు.నన్ను ఎంపీగా ఎన్నుకోండి'

"నవంబర్ 13న జరిగే ఉప ఎన్నికలో నన్ను ఎంపీగా ఎన్నుకోండి. మీతో బంధాన్ని మరింత బలోపేతం చేయడానికి అది ఉపయోగపడుతుంది. అలాగే వయనాడ్ ప్రజల కోసం నేను చేయగలిగినదంతా చేస్తాను. ప్రజాప్రతినిధిగా నా తొలి ప్రయాణంలో వయనాడ్ ప్రజలు నా మార్గదర్శకులు, గురువులు. ప్రజాస్వామ్యం, న్యాయం, రాజ్యాంగంలో పొందుపరిచిన విలువల కోసం పోరాడుతాను.

'వాటిని కళ్లారా చూశాను'

కొన్ని నెలల క్రితం తాను, తన సోదరుడు రాహుల్ గాంధీతో కలిసి మండక్కై, చూరల్‌మలా వెళ్లిన విషయాన్ని గుర్తుచేశారు ప్రియాంక గాంధీ. కొండచరియలు విరిగిపటం వల్ల ప్రజలు ఎదుర్కొన్న నష్టాన్ని, సర్వం కోల్పోయిన వారి ఆవేదనను కళ్లారా చూశానని పేర్కొన్నారు. పిల్లలను కోల్పోయిన తల్లులు, కుటుంబాన్ని కోల్పోయి అనాథలుగా మారిన చిన్నారులను ఆ సందర్భంగా చూశానని చెప్పుకొచ్చారు. ఆ చీకటి రోజుల నుంచి బయటపడి నవశక్తితో మీరు ముందుకు కదిలిన తీరు స్ఫూర్తిదాయకయమని కొనియాడారు. వైద్యులు, ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సేవకులు, సామాజిక కార్యకర్తలు, ఉపాధ్యాయులు, నర్సులు, గృహిణులు, ప్రతి ఒక్కరూ బాధితులకు అండగా నిలిచారని పేర్కొన్నారు."వయనాడ్ ప్రజల తరఫున పార్లమెంట్ లో ప్రాతినిధ్యం వహించే అవకాశం రావడం గౌరవంగా భావిస్తున్నా. మీ నుంచి చాలా నేర్చుకున్నా. కష్టకాలంలో ఒకరినొకరు ఎలా గౌరవించుకోవాలో, అండగా నిలవాలో తెలుసుకున్నా. నా సోదరుడు రాహుల్?కి మీరు ఎంతో ప్రేమను, అభిమానాన్ని పంచారు. వయనాడ్ ప్రజల పోరాటాలను రాహుల్ గాంధీ నాకు వివరించారు. ముఖ్యంగా రైతులు, గిరిజన సంఘాలు ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి ఆయన ఆందోళన చెందారు. ఈ సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రజలతో కలిసి పని చేయాలని సూచించారు. మహిళల శ్రేయస్సు కోసం నా శక్తికి మించి కృషి చేస్తానని మాటిస్తున్నా." అని బహిరంగం లేఖలో ప్రియాంక గాంధీ రాసుకొచ్చారు.23మందితో సెకండ్ లిస్ట్ రిలీజ్ మరోవైపు, మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్ పార్టీ 23 అభ్యర్థులతో కూడిన రెండో జాబితాను ప్రకటించింది. జల్నా నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే కైలాశ్ గోరంత్యాల్?కు మళ్లీ అవకాశం దక్కింది. సావోనర్ స్థానం నుంచి పార్టీ నాయకుడు సునీల్ కేదార్ భార్య అనూజను పోటీలోకి దింపింది.ముంబయిలో మూడు స్థానాల్లో కాంగ్రెస్ తమ పార్టీ అభ్యర్థులను ప్రకటించింది. గణేశ్ కుమార్ యాదవ్ సియోన్-కోలివాడ స్థానంలో పోటీకి దింపింది. చార్కోప్ నియోజకవర్గం నుంచి యశ్వంత్ సింగ్ , కండివాలి తూర్పు స్థానం నుంచి కలు బధెలియా బరిలో?కి దిగారు. కాంగ్రెస్ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ (సీఈసీ) సమావేశం అనంతరం ఈ రెండో లిస్ట్ రిలీజ్ అయ్యింది. తొలి జాబితాలో 48 మందితో కలిపి మొత్తం మహారాష్ట్రలో ఇప్పటివరకు 71మంది అభ్యర్థులను కాంగ్రెస్ ప్రకటించింది.మహావికాస్ అఘాడీదే అధికారం' మహారాష్ట్రలో మహావికాస్ అఘాడీ కూటమి ఐక్యంగా పోటీ చేస్తోందని, తమ మధ్య ఎలాంటి విభేదాలు లేవని ఏఐసీసీ ఇన్ ఛార్జ్ రమేశ్ చెన్నితాల తెలిపారు. మహారాష్ట్ర ప్రజల కలలను సాకారం చేసేందుకు కలిసి పోరాడుతామని, ఎంవీఏ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందన్న నమ్మకం ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న అవినీతి ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆరోపించారు.



ప్రజాబలం

27 అక్టోబర్ 2024 ఆదివారం

# ఇల్లందకుంట పోలీస్ స్టేషన్ ని సందర్శించిన ఏసిపి





ఇల్లందకుంట ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 26 హుజురాబాద్ ఏసీపి ఇల్లందకుంట పోలీస్ స్టేషన్ ను సందర్శించి, స్టేషన్ లోని రికార్డులను పరిశీలించి కేసులను త్వరితగతిన పరిష్కరించి, ప్రజలకు న్యాయం చేయాలనీ, 100 డయల్ కు త్వరితగతిన స్పందించాలని, పిర్యాదు దారులతో మర్యాదగా ప్రవార్తించాలని, దొంగతనాలు జరగకుండా చూడాలని సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట రూరల్ సీఐ కోరే కిషోర్, ఇల్లందకుంట ఎస్సై రాజా కుమార్, ఏ ఎస్ ఐ రవి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# స్వదేశీ ఉద్యమమా? మేక్ ఇన్ ఇండియానా?

ఆర్థిక అభివృద్ధిలో 10 సంవత్సరాల పాలనాకాలం అంటే పెట్టుబడులు పెట్టే కాలానికీ, ఫలాలు అందుకునే కాలానికీ మధ్యగల కాలం. పదేళ్లు అంటే చాలా ఎక్కువే. ఈ పథకాన్ని ప్రారంభించిన పాలకులు పదేళ్లుగా వారే అధికారంలో ఉండటం గమనార్హం. కానీ అభివృద్ధి మంత్రంగా స్వదేశీ ఉద్యమంగా చేపట్టిన మేకిన్ ఇండియా పథకం దేశంలో వివిధ రంగాల అభివృద్ధి స్థాయిని పెంచలేకపోయింది. ఈ పథకం పురోగమనానికి అనేక రంగాల అల్పాభివృద్ధి అవరోధాలే కారణమని అంటున్నారు. ముఖ్యంగా వ్యవసాయ రంగంలో అల్పాభివృద్ధి, యువతకు సాంకేతిక రంగంలో పరిజ్ఞానం లేకపోవడం, విద్యుత్ రవాణా రంగాల్లో ఆశించిన స్థాయిలో అభివృద్ధి లేకపోవడం ఒకవైపు మేకిన్ ఇండియా పురోగమనానికి అవరోధాలుగా ఉన్నాయి. దేశంలో కావలసిన అవస్థాపన వసతులు ఉంటే తప్ప పెట్టుబడిదారులకు ముందుగా పెట్టుబడులు పెట్టలేరు. మేక్ ఇన్ ఇండియా పథకం ఉద్యోగతను కల్పించే బదులుగా నిరుద్యోగితను పెంపొందించింది. పారిశ్రామికీకరణకు బదులుగా పారిశ్రామిక పతనానికి దారితీసింది.

ఆనాడు మహాత్మా గాంధీ బ్రిటిష్ పారిశ్రామికవేత్తల ఉత్పత్తులకు వ్యతిరేకంగా స్వదేశీ ఉత్పత్తిని ప్రోత్సహించేందుకు చేపట్టిన స్వదేశీ ఉద్యమం నేడు మన ప్రధానమంత్రి చేపట్టిన మేక్ ఇన్ ఇండియా రెండూ ఒక్కటేనా? గాంధీజీ ప్రకారం పెట్టుబడి దారీ వ్యవస్థ నిరుద్యోగాన్ని నిర్మూలించలేదు. పరిపాలనా విధానా లు, చట్టాల ద్వారా అందరికీ క్షేమం అందించేదే రాజ్యం. అటు రాచరిక వ్యవస్థకు ఇటు కమ్యూనిస్టు వ్యవస్థకు మధ్య మార్గమే ఇప్పటి ప్రజాస్వామ్య రాజకీయ వ్యవస్థ. ఇది ఆయా దేశాల జాతీయ వాదానికి సంబంధించిన వాదన. దేశ జాతీయవాదం ప్రజల కోసం ఉండాలి గాని పెట్టుబడిదారుల లాభాల కోసం కాకూడదని గాంధీజీ అభిప్రాయ పడ్డారు. మనదేశంలో 1920 శతాబ్దంలో ఏర్పడిన జాతీయవాదం దేశ స్వాతంత్రం కోసం అన్ని కులాలను మతాలను కలుపుకొని వలస పాలనకు వ్యతిరేకంగా ఆవిర్భవించింది. మాకు బ్రిటిష్ ప్రజలతో ఎటువంటి వ్యతిరేకత లేదు. బ్రిటిష్ పెట్టుబడిదారులతోనే వారి పెట్టుబడుల వలన మా దేశంలో ఆర్థిక వ్యవస్థలో నిరుద్యోగం పేదరికం ఏర్పడుతుందని మహాత్మా గాంధీ అన్నారు.

ఇంగ్లాండులో పారిశ్రామిక విప్లవంతో పెట్టుబడుల్లో, ఉత్పత్తిలో పెరుగుతున్నాయి గానీ ఆదాయ అసమానతలు తగ్గలేదు. 1890లో గాంధీ లండన్ విశ్వవిద్యాలయంలో లా డిగ్రీ చదివేటప్పుడు ఈ విషయాన్ని స్వయంగా గమనించి వివరించారు. వలస పాలకు లు మనదేశంలో వసూలు చేసిందల్లా సముద్రాల్ని దాటించి పారిశ్రామిక విప్లవం ఇంగ్లాండ్‌లో జరిగేటట్టుగా చూసుకున్నారు. మనదేశంలో ఆదాయాలు తగ్గి నిరుద్యోగం పెరిగింది. పెట్టుబడిదారీ విధానం చిన్న చిన్న ఉత్పత్తిదారులను నిర్వీర్యం చేసి నిరుద్యోగం పెరిగేటట్లు చేస్తుందని గాంధీజీ అభిప్రాయం. ఈ క్రమంలోనే 1920లో బ్రిటిష్ పెట్టుబడిదారులను వ్యతిరేకించిన భారతీయ పెట్టుబడిదారులు తర్వాత బ్రిటిష్ పెట్టుబడిదారులతోనే లాలూచీ పడ్డారు. అందుకే స్వదేశీ విదేశీ ఫైనాన్స్ పెట్టుబడిదారుల చారిత్రక నేపథ్యం తెలుసుకోకుండా, వారి స్వలాభాపేక్షతో కూడిన జాతీయవాదాన్ని అర్థం చేసుకోకుండా మన ఆర్థిక వ్యవస్థను పెట్టుబడిదారులకు అప్పగించడం ఎంతవరకు సమంజసమో..? ప్రస్తుత పాలకులు ఆలోచించాలి. తాము ప్రభుత్వాన్ని నడిపిస్తున్నది ప్రజల కోసమా? పెట్టుబడిదారుల కోసమా? అనే ప్రశ్న వేసుకోవాలి. రోజురోజుకు ప్రస్తుత పాలకులు గాంధీజీ ఆర్థిక విధానాలకు ఎంత దూరం అవుతున్నారో గమనించాలి.

2014 సెప్టెంబర్ 25న ప్రారంభించిన మేకిన్ ఇండియా పథకం ద్వారా ఉత్పత్తి రంగంలో పెట్టుబడులను పెంచి తద్వారా దేశంలో పరిశ్రమల సామర్థ్యాన్ని పెంచాలని మౌలిక వసతులను కల్పించాలని ఉద్యోగతను పెంచాలని, అందుకోసం 25 ప్రధాన రంగాలను ఎంపిక చేసి వాటిలో పెద్ద సంఖ్యలో పెట్టుబడులను పెట్టేందుకు స్వదేశీ, విదేశీ పెట్టుబడిదారులను ఆహ్వానించి దేశంలో పారిశ్రామికీకరణ స్వదేశీయతతో కూడుకున్నదిగా అభివృద్ధి చేయాలని మన ప్రధానమంత్రి బాధ్యతలను చేపట్టిన తొలి రోజుల్లోనే కోరుకున్నారు. పది వసంతాలు పూర్తయినాయి. 2014 నుంచి 2023 వరకు ఎఫ్‌డీఐలలో 900 బిలియన్ డాలర్లు వచ్చాయి. ఆటో మొబైల్ రంగంలో పురోగతి ఫార్మాసూటికల్ రంగంలో గ్లోబల్ హబ్‌గా మారడం ఎలక్ట్రానిక్ పరిశ్రమ పురోగతి రక్షణ రంగంలో కూడా స్వావలంబన దిశగా అడుగులు వేయడం జరిగింది. అయినప్పటికీ దేశంలో పారిశ్రామికీకరణకు అవసరమైన మౌలిక వసతులు విద్యుత్, నీటి సౌకర్యాలు లేవని పెట్టుబడుల ప్రవాహం అక్కడికక్కడ అంతంత మాత్రంగానే సాగింది. దేశంలో పారిశ్రామిక రంగం తిరోగమనంలో పడింది అంటే డి ఇండస్ట్రియలైజేషన్ జరుగుతుందని చెప్పాలి. ఆనాడు గాంధీజీ స్వదేశీ ఉద్యమాన్ని చేపట్టి దేశంలో స్వదేశీ పరమైన పారిశ్రామికీకరణ జరగాలని విదేశీ వస్త్రాలను బహిష్కరించాలని, స్వదేశంలో ఉపాధిని పెంపొందించాలని కోరుకోవడం మన పాలకులు మరిచినట్టు ఉన్నారు. కానీ పెట్టుబడిదారుల కనుసన్నల్లో ఉన్న మేకిన్ ఇండియా పథకం ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగడం లేదు. స్వదేశీ, విదేశీ పెట్టుబడిదారులపై ఆధారపడిన మేకిన్ ఇండియా పథకం తిరోగమనంలోకి పోయింది. ఫలితంగా పారిశ్రామిక ఉత్పత్తుల వాటా మన స్థూల జాతీయోత్పత్తిలో పెరుగుదల లేకుండా పోయింది. దేశంలో పరిశ్రమలు నిర్వీర్యమై పారిశ్రామిక రంగం పతనమైంది.

మేక్ ఇన్ ఇండియా పథకం ఉద్యోగతను కల్పించే బదులుగా నిరుద్యోగితను పెంపొందించింది. పారిశ్రామికీకరణకు బదులుగా పారిశ్రామిక పతనానికి దారితీసింది. విదేశీ స్వదేశీ పెట్టుబడిదారులను నమ్ముకుని కార్పొరేట్ రంగానికి బలోపేతం చేసి చిన్న తరహా మధ్య తరహా పరిశ్రమలను నిర్వీర్యం చేయడం వలన ఉద్యోగిత, డిమాండ్, పెట్టుబడులలో ఆర్థిక వ్యవస్థలో తగ్గిపోయి ప్రజల కొనుగోలు శక్తి నిర్వీర్యమైంది. ఫలితంగా 2024లో ఆకలి సూచికలో 127 దేశాలలో మన దేశం 105వదిగా మిగిలింది. కొనుగోలు శక్తి లేక ప్రజలు దేశంలో ఉన్నారని తెలుస్తుంది. 2022లో ప్రచురించిన వరల్డ్ ఇన్ క్వాలిటీ రిపోర్ట్ ప్రకారం మన దేశంలో సంపన్నులు ఒక శాతం దగ్గర 40 శాతం పైగా సంపద ఉన్నది. బిలినియర్ల రాజ్యంగా భారత్ మారుతున్నదని ఈ నివేదిక తెలియజేస్తున్నది. మేక్ ఇన్ ఇండియా స్వదేశీ ఉత్పత్తుల ఉద్యమంగా ప్రారంభించి 10 సంవత్సరాలైనా ఉద్యోగిత కానీ ఆదాయాలు కానీ పెరగక దేశ ప్రజలకు నిరాశ మిగిలింది..

# ముఖ్యమంత్రి,మంత్రులపై కౌశిక్ వ్యాఖ్యలు అర్థరహితం.

## కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్న..ప్రణవ్

- హుజురాబాద్ లో నీ అరాచకాలు సాగవు.
- ఆరోపణలు తప్ప అభివృద్ధిపై ద్యాస లేదు.
- ఎం.ఎల్.సీ గా ఉన్న సమయంలో ప్రజలకు నీవు చేసింది శూన్యం.
- కౌశిక్ తీరుపై తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేసిన ప్రణవ్.
- దళితులకు అన్యాయం చేసింది నీవు కాదా?
- మార్కెట్ కమిటీల చైర్మెన్ నియమించడంలో వివక్ష చూపెట్టవ్..
- నిరుద్యోగుల ఉసురుపోసుకొన్నది బీఆర్ఎస్.
- వొడితల ప్రణవ్ బాబు



హుజురాబాద్ ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 26 హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి వ్యవహారతీరుపై హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంఛార్జి వొడితల ప్రణవ్ తీవ్ర ఆగ్రహన్ని వ్యక్తం చేశారు.కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి,మంత్రుల మీద అసత్యపు ఆరోపణలు చేస్తున్నారని,పార్టీ మారిన ఎమ్మెల్యేల పట్ల మాట్లాడే కౌశిక్ రెడ్డి నిజంగా మొగోడు అయితే హుజురాబాద్ నియోజకవర్గంలో తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి మళ్లీ గెలిచి చూపించాలని అన్నారు.గత పదేళ్లలో బిఆర్ఎస్ ప్రభుత్వం అనేక స్కాంలు చేస్తే,10 నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అనేక స్కీములు ప్రవేశపెట్టమని అన్నారు. పదేపదే ప్రెస్ మీట్ పెట్టి కాంగ్రెస్ నాయకులపై మాట్లాడితే పెద్ద లీడర్ అవుతానని అనుకోవడం కౌశిక్ రెడ్డి భ్రమ అని కెసిఆర్,కేటీఆర్ మెప్పు పొందడానికి ఇలా మాట్లాడుతున్నాడని ఎద్దేవా చేశారు.గతంలో తాను చెప్పినట్టుగా కౌశిక్ రెడ్డి ఒక బ్లాక్మెయిల్ స్టార్ అని సూసైడ్ పేరు చెప్పి హుజురాబాద్ లో గెలిచాడని అన్నారు.హుజురాబాద్ మార్కెట్ విషయంలో ఇక్కడి ప్రజలకు తీవ్ర అన్యాయాన్ని చేశాడని,దళితుల పట్ల వివక్ష చూపెట్టాడని కేవలం ఓట్ల కోసం మాత్రమే వారిని వాడుకున్నాడని,ఎమ్మెల్సీ గా ఉన్న సమయంలో మార్కెట్ కమిటీ చైర్మన్ వేయకుండా,పూర్తి స్థాయిలో దళిత బంధు ఇవ్వకుండా అన్యాయం చేశాడని అన్నాడు.ఎమ్మెల్సీగా,ప్రభుత్వ విప్ గా రెండు సంవత్సరాలు ఉండి ఇక్కడ ప్రజలకు అభివృద్ధి కూడా చేయలేదని ఎమ్మెల్సీగా ఉన్న సమయంలో తాను హుజురాబాద్ ప్రజలకు ఏం చేశాడో చెప్పాలని అన్నాడు.అధికారంలోకి వచ్చిన పది నెలలలోపే తాము 10 కోట్ల నిధులను అభివృద్ధి చేసి చూపెట్టమని హుజురాబాద్,జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రులకు 30 లక్షలు కేటాయించామని అలాగే ఏళ్లుగా ఎదురుచూస్తున్నటువంటి హుజురాబాద్ గ్రౌండ్ ట్రాకర్,ధమ్మక్కపేట గ్రామస్తుల నీటి సమస్యను పరిష్కారం చేస్తున్నామని త్వరలోనే వాటన్నిటికీ సంబంధించిన ప్రొసీడింగ్స్ ఇస్తామని అన్నారు.నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వకుండా అడ్డుకొని వారి ఉసురుపోసుకున్న పార్టీ బిఆర్ఎస్ అని నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించిన ప్రభుత్వం కాంగ్రెస్ అని అన్నారు.ప్రభుత్వానికి,ప్రజలకు తాను వారధిగా ఉంటూ ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు.ఆరు గారెంటీలు అమలు చేశామని,పదేళ్లు అధికారంలో ఉండి రైతులకు రుణమాఫీ చేయలేదని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 8 నెలల్లోనే రుణమాఫీ చేసిందని సాంకేతిక కారణాల వలన ఆగిన వారికి త్వరలోనే చేస్తామని అన్నారు.

# మెరిట్ జాబితాపై అభ్యంతరాలు ఉంటే తెలియజేయండి

## జిల్లా ఆసుపత్రుల ప్రధాన కార్యాలయం పర్యవేక్షకులు డాక్టర్ ఎం.కోటేశ్వర్

ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి అక్టోబర్ 26 : తెలంగాణ వైద్య విధాన పరిషత్ – జిల్లా ఆసుపత్రుల ప్రధాన అధికారి కార్యాలయం పరిధిలో సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్టులు, సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులను ఒప్పంద పద్ధతిలో భర్తీ చేసే ప్రక్రియలో ప్రాథమిక మెరిట్ జాబితాపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 28 వ తేదీ నుండి 30వ తేదీ లోగా తెలియజేయాలని జిల్లా ఆసుపత్రుల ప్రధాన కార్యాలయం పర్యవేక్షకులు డాక్టర్ ఎం.కోటేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. మెరిట్ జాబితాను జిల్లా అధికారిక వెబ్సైట్ https:// mancherial.telangana.gov.in లో, కార్యాలయ నోటీసు బోర్డులో ఉంచడం జరిగిందని, అభ్యర్థులకు ఏమైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే ఈ నెల 28 నుండి 30వ తేదీ లోగా ఉదయం 10.30 గం॥ల నుండి సాయంత్రం 5 గం॥ల వరకు కార్యాలయ పనివేళలలో జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని ఎఫ్-24లో గల జిల్లా ఆసుపత్రుల ప్రధాన కార్యాలయం పర్యవేక్షకులకు వ్రాత పూర్వకంగా సమర్పించవచ్చని తెలిపారు.

# ఒకే రాష్ట్రం ఒకే పోలీస్ విధానం అమలు చేయాలి

**తెలంగాణ బెటాలియన్ పోలీసులు, వారి కుటుంబాలు నిరసనలు**

**'పాలు తాగే పిల్లాడున్నాడు.. వదిలేయండి ప్లీజ్'..**

**బెటాలియన్ పోలీసుల నిరసనల్లో తల్లి ఆవేదన**




దిగొచ్చిన సర్కార్.. హైదరాబాద్: డిమాండ్ల సాధనే ధ్యేయంగా తెలంగాణ బెటాలియన్ పోలీసులు, వారి కుటుంబాలు చేపట్టిన నిరసనలు హైదరాబాద్‌లో శనివారం కూడా కొనసాగాయి. పరిస్థితి తీవ్ర ఉద్రిక్తంగా మారడంతో బెటాలియన్ పోలీసుల కుటుంబీకులను పోలీసులు అరెస్ట్ చేసి ఠాణాలకు తరలిస్తున్నారు. ఈక్రమంలోనే ఓ మహిళను అదుపులోకి తీసుకొని వ్యాన్ ఎక్కించారు. దీంతో ఆమె 'నాకు పాలు తాగే చిన్న బాబు ఉన్నాడు.. వదిలేయండి ప్లీజ్' అని వేడుకున్నారు. అక్కడున్న మీడియా సిబ్బంది కూడా ఆమెను వదిలేయాలని కోరారు. అయినా పోలీసులు వినకుండా ఆమెను వ్యాన్లో తీసుకెళ్లారు. ఒకే రాష్ట్రం ఒకే పోలీస్ విధానం అమలు చేయాలనే డిమాండ్‌తో జిల్లాల్లో పోలీస్ బెటాలియన్ భార్యలు ఆందోళనకు దిగారు. అనంతరం వారు సచివాలయ ముట్టడి ప్రయత్నించడం అరెస్టులకి దారితీసింది. ఒకే పోలీస్ విధానాన్ని అమలుచేసి తమ భర్తలకు ఒకే దగ్గర డ్యూటీ చేసే అవకాశం కల్పించాలని వారి భార్యలు డిమాండ్ చేస్తున్నారు. ఈ డిమాండ్ అమలయ్యే వరకు మెస్ తీసివేసి ఒకే దగ్గర 3 నుంచి 5 పోస్టింగ్లు ఇవ్వాలని నినాదాలు చేశారు.ఒకే నోటిఫికేషన్, పరీక్ష ఉన్నప్పుడు అందరికి ఉద్యోగం కూడా ఒకేలా ఉండాలని, కానీ తమ భర్తలను కుటుంబాలకు దూరంగా ఎందుకుంచుతున్నారని ప్రశ్నించారు. "సమయం సందర్భం ఉండదు. ఎప్పుడంటే అంటే అప్పుడు పిలుస్తారుసమయం లేకుండా వెళ్లిపోతారు. డ్యూటీ ఎంత ముఖ్యమో మమ్మల్ని కూడా అంతే చూసుకోవాలి కదా. మా అబ్బాయికి జర్వం వచ్చినా రెండు నెలల వరకు ఇంటికి రాలేదు. ఇలాగైతే కుటుంబంతో కలిసి ఉండేది ఎప్పుడు. గడ్డి తీయిస్తారు, మట్టి, ఇటుకలు మోపిస్తారు ఇవన్నీ చేయడానికి మా భర్తలు పోలీసులా లేక కూలీలా" అని ఓ పోలీస్ బెటాలియన్ భార్య ఆవేదన వ్యక్తం చేసింది. పెద్ద సంఖ్యలో వచ్చిన బెటాలియన్ కానిస్టేబుళ్ల కుటుంబ సభ్యులను పోలీసులు ఎక్కడికక్కడ అరెస్ట్ చేసి ఠాణాలకు తరలించారు.

# జైల్లో లారెన్స్ బిష్ణోయ్ ఇంటర్వ్యూ.. ఇద్దరు డిఎస్పీలు సస్పెండ్




ముంబై అక్టోబర్ 26గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ వ్యవహారంలో ఇద్దరు డిఎస్పీలు సస్పెండ్ అయ్యారు. 2023లో లారెన్స్ బిష్ణోయ్ పంజాబ్‌లో జైలు శిక్ష అనుభవిస్తున్న సమయంలో ఓ టీవీ ఛానెల్‌కు ఇంటర్వ్యూ నిర్వహించేందుకు అనుమతి ఇవ్వడంపై ఆ రాష్ట్ర హోంశాఖ చర్యలు చేపట్టింది. దీనిపూ విచారణ జరిపిన తర్వాత ఇద్దరు డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డిఎస్పీలు) సహా ఏడుగురు పోలీసు అధికారులను సస్పెండ్ చేశారు.కాగా, లారెన్స్ బిష్ణోయ్ జైలు నుంచే తను అనుకున్న పనులు చేయించుకుంటున్నారు. అందులో భాగంగా ఇటీవల రాజకీయ నాయకుడు, హీరో సల్మాన్ ఖాన్ స్నేహితుడు సిద్దిఖీ బాబాను హత్య చేశారు. ఆయనను హత్య చేసింది తామే అంటూ బిష్ణోయ్ గ్యాంగ్ ప్రకటించడంతో దేశవ్యాప్తంగా చర్చనీయాంశం అయ్యిది. ఈ ఘటనపై ముంబై పోలీసులు విచారణ చేస్తున్నారు.

# హక్కుల కోసం అమరుడైన జతీంద్రనాథ్

భారత స్వాతంత్ర్య పోరాటంలో ఎందరో త్యాగధనులు లక్ష్య సాధన కోసం ఆత్మార్పణం గావించారు. ఆలాంటి త్యాగ మూర్తులలో అగ్ర భాగాన నిలుస్తాడు జతీంద్ర నాథ్ దాస్. 1929లో 25 ఏళ్ల చిన్న వయస్సులో రాజకీయ ఖైదీల హక్కుల కోసం 63 రోజుల నిరాహార దీక్ష కొనసాగించి ప్రాణ త్యాగం చేసి అమరుడు అయినాడు జతీంద్ర. జతీంద్రనాథ్ దాస్ (27 అక్టోబర్ 1904 %-% 13 సెప్టెంబర్ 1929) స్ఫూర్తిదాయక స్వాతంత్ర్య సమర యోధుడు, మానవ హక్కుల కార్యకర్త, విప్లవ వీరుడు. కలకత్తాలో 1904 అక్టోబర్ 36న జన్మించాడు. చిన్నవయసు లోనే బెంగాల్లోని అనుశీలన్ సమితి అనే విప్లవ సంస్థ (20వ శతాబ్దపు భారతీయ విప్లవ సంస్థ)లో చేరాడు. భగత్ సింగ్, హిందుస్థాన్ రిపబ్లికన్ సోషలిస్ట్ అసోసియేషన్ సభ్యులతో కలిసి పనిచేశాడు. 17 ఏళ్ల వయసులో గాంధీజీ ప్రారంభించిన సహాయ నిరాకరణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నాడు. మహాత్మా గాంధీ నడిపిన సహాయ నిరాకరణో ద్యమంలో కూడా పాల్గొన్నాడు. కలకత్తాలోని విద్యాసాగర్ కాలేజిలో బి.ఎ.చదివే సమయంలో 1925 నవంబరులో రాజకీయ కార్యకలాపాల కారణంగా అరెస్ట్ అయ్యి జైలులో ఉన్నాడు. అక్కడ రాజకీయ ఖైదీలపట్ల చూపుతున్న దురుసు ప్రవర్తనకు నిరసనగా నిరాహారదీక్ష చేపట్టాడు. 20రోజుల నిరాహార దీక్ష తరువాత జైలు సూపరింటెండెంట్ క్షమాపణ కోరడంతో దీక్ష విరమించాడు. దేశంలోని అన్ని ప్రాంతాలనుండి విప్లవ కారులు బాంబుల తయారీకి ఆయన్ను సంప్రదించేవారు. సచీంద్రనాథ్ సన్యాల్ వద్ద బాంబులను తయారు చేయడం నేర్చు కున్నాడు.. భగత్ సింగ్, మరికొందరు విప్లవ వీరులకు బాంబులను తయారు చేశాడు. ఆయన విప్లవ కార్యకలాపాల కారణంగా ఆయనను 1929 జూన్ 14న అరెస్ట్ చేసి లాహెూర్ జైలులో పెట్టారు. లాహెూర్ జైలులో భారతీయ ఖైదీల పరిస్థితి చాలా దుర్భరంగా ఉండేది. వారు అనేక రోజుల పాటు ఉతకని, మాసిన దుస్తులను ధరించవలసి వచ్చేది. వంటశాలలో బొద్దింకలు, ఎలుకలు తిరుగుతూ ఆహార పదార్థాలను తినడానికి హానికరంగా మార్చేవి. భారతీయ ఖైదీలకు వార్తా పత్రికలను, వ్రాసుకోవడానికి కాగితాలు ఇచ్చేవారు కాదు. కానీ అదే జైలులో బ్రిటిష్ ఖైదీల పరిస్థితి దీనికి భిన్నంగా పక్షపాతంగా ఉండేది. జతీంద్ర నాథ్ పరిస్థితులను గమనించి యూరోపియన్ ఖైదీలకు సమానంగా భారతీయ ఖైదీలకు సదుపాయాలను కల్పించాలని కోరుతూ కొందరు విప్లవ కారులతో కలిసి ఆమరణ నిరాహార దీక్షను చేపట్టాడు. ఆమరణ నిరాహార దీక్ష 1929 జూలై 13 న ప్రారంభమై 63 రోజులపాటు కొనసాగింది. జైలు అధికారులు బలవంతంగా దీక్షను భగ్నం చేయడానికి ప్రయత్నించారు. చివరకు జైలు కమిటీ ఆయనను బేషరతుగా విడుదల చేయాలని సిఫారసు చేసింది. కానీ ప్రభుత్వం దానిని త్రోసి పుచ్చుతూ బెయిల్ మీద విడుదల కావచ్చని సూచించింది. జతీంద్ర నాథ్ దాస్ భగత్ సింగ్, ఇతర స్వాతంత్ర్య సమరయోధులు కూడా లాహెూర్ సెంట్రల్ జైలులో ఈ నిరాహార దీక్ష కొనసాగించారు. జతీంద్ర దాస్ బ్రిటిష్ అధికారులచే దౌర్జన్యాలు, కష్టాలను ఎదుర్కోవలసి వచ్చింది. ఫలితంగా అనారోగ్యం ఆవహించింది. ఊపిరితిత్తులకు హాని కలిగింది. పక్షవాతం శరీర భాగాలకు వ్యాపించడం ప్రారంభించింది. అయినప్పటికీ ఆయన నిరాహార దీక్ష కొనసాగించాడు. అలా ఆయన 1929, సెప్టెంబరు 13వ తేదీన తుది శ్వాస విడిచాడు. విప్లవ వనిత దుర్గావతి దేవి నేతృత్వంలో ఆయన అంతిమ యాత్ర లాహెూర్ నుండి కలకత్తా వరకు రైలులో కొనసాగింది. వేలాది మంది శ్రద్ధాంజలి ఘటించడానికి రైల్వే స్టేషన్లకు తరలి వచ్చారు. హౌరా రైల్వే స్టేషన్‌లో శవపేటికను సుభాష్ చంద్రబోస్ స్వీకరించి శవయాత్రకు నేతృత్వం వహించాడు. కలకత్తాలో రెండు మైళ్ళ పొడుగున ప్రజలు బారులు తీరి ఆయనకు తుది వీడ్కోలు చెప్పారు. జతిన్ దాస్ నిరాహార దీక్ష బ్రిటిష్ పాలకుల అక్రమ నిర్బంధాలపై ప్రతిఘటనలో ఒక కీలక ఘట్టంగా నిలిచింది. సుభాష్ చంద్రబోస్ ఆ త్యాగశీలిని "భారత దేశపు యువ దధీచి"గా లక్ష్యం కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన పురాతన భారతీయ ఋషిగా అభివర్ణించాడు. 2002లో విడుదలైన "ది లెజెండ్ ఆఫ్ భగత్ సింగ్" సినిమాలో జతిన్ దాస్ పాత్రను అమితాబ్ భట్టాచార్జీ పోషించాడు.

# భారత పదాతి దళం దేశానికి కవచం

భారత పదాతి దళం భారత సైన్యంలో అతిపెద్ద భాగం. దేశ రక్షణలో కీలక పాత్ర పోషిస్తుంది. పదాతి దళ దినోత్సవం ప్రతి సంవత్సరం అక్టోబర్ 27న జరుపుకుంటారు. 1947లో కశ్మీర్‌ను పాకిస్తాన్ ఆక్రమించకుండా కాపాడిన రోజును గుర్తు చేసుకుంటారు. 1947లో పాకిస్తాన్ కశ్మీర్‌ను ఆక్రమించడానికి ప్రయత్నించింది. భారత సైన్యం దాడిని విఫలం చేసింది. భారత సైన్యం లో అతిపెద్ద పోరాట విభాగమైన పదాతిదళం దేశానికి అందించిన సేవలు గుర్తించడానికి ప్రతి సంవత్సరం అక్టోబరు 27న పదాతి దళ దినోత్సవాన్ని నిర్వహించడం జరుగుతోంది. భారత సైన్యంలో అతిపెద్ద దళం పదాతి దళం. భూమిపై యుద్ధాలు చేయడం వీరి ప్రధాన బాధ్యత. వీరు దేశ రక్షణలో కీలక పాత్ర పోషిస్తారు. పదాతిదళ దినోత్సవం ముఖ్య ఉద్దేశం దేశానికి సేవ చేస్తూ తమ ప్రాణాలను త్యాగం చేసిన అమరులను గౌరవించి, హృదయపూర్వక నివాళి అర్పించడం. అంతేకాదు, భారత సైనికులు చేసిన త్యాగాలు, సేవల గురించి దేశ ప్రజలకు అవగాహన కల్పించడం.భారత్ పాక్ ల మధ్య జరిగిన నాలుగు యుద్ధాలలో ఇది మొదటిది కశ్మీర్ యుద్ధం. స్వాతంత్ర్యం పొందిన రెండు దేశాల మధ్య జరిగిన యుద్ధ పరిణామాలు నేటికీ ఇరు దేశాల భౌగోళిక, రాజకీయాలను ప్రభావితం చేస్తూనే ఉన్నాయి. కశ్మీర్ విలీనం విషయంలో అప్పటి రాజు హరిసింగ్ తీసుకున్న నిర్ణయం పాక్‌కు షాకిచ్చింది. దీంతో కశ్మీర్‌ను ఆక్రమించుకోడానికి ప్రయత్నిస్తున్న పాక్‌కు.. భారత్ సైన్యం తగిన గుణపాఠం చెప్పిన తరిమి కొట్టింది. భారత సైన్యంలో అతిపెద్ద పోరాట విభాగమైన పదాతిదళం దేశానికి అందజేస్తోన్న సేవలకు గుర్తుగా ఏటా అక్టోబరు 27న పదాతి దళ దినోత్సవాన్ని నిర్వహించుకుంటాం. అక్టోబర్ 27 భారత సైన్యానికి చాలా ముఖ్యమైన రోజు. 1947లో ఇదే రోజున భారత సైనికులు.. పాకిస్థాన్ మద్దతుతో జమ్మూ కశ్మీర్‌ను ఆక్రమించేందుకు వచ్చిన మూకలను పొలిమేరల నుంచి తిప్పికొట్టి తోకముడిచేలా చేశారు. దేశ విభజన తర్వాత కశ్మీర్ సంస్థానం ఎటు వెళ్ళాలో తేల్చుకోలేని పరిస్థితిలో మిగిలింది. కశ్మీర్ తన స్వతంత్ర ప్రతిపత్తిని నిలబెట్టుకోవాలని బలంగా కోరుకున్నప్పటికీ.. నాటి రాజకీయ పరిణామాలు ఎటో ఒకవైపు విలీనం కావాల్సిన పరిస్థితిని కల్పించాయి. 1947 ఆగస్టులో విభజన కారణంగా సాగిన హింస నుంచి కశ్మీర్ కూడా తప్పించుకోలేక పోయింది. పాకిస్థాన్ గిరిజనులు కశ్మీర్‌లోని మొహురా విద్యుత్ కేంద్రంపై దాడి చేయాగా, హరిసింగ్ భారత ప్రభుత్వం సాయం కోరారు. వెంటనే స్పందించిన భారత ప్రభుత్వం రాజుకు అండగా సైన్యాన్ని పంపింది. పాకిస్తాన్ గిరిజనులుగా చెప్పుకునే కబాలీలను భారత సైన్యం తరిమికొట్టింది. ఆ తర్వాత కశ్మీర్‌ను భారత్‌లో కలుపుతున్నట్లు ఒప్పందంపై అక్టోబరు 26న మహారాజు హరిసింగ్ సంతకం చేశారు.భారత ప్రధాని నెహ్రూ ఆదేశాలతో సిక్ రెజిమెంట్ మొదటి బెటాలియన్.. అక్టోబరు 27న శ్రీనగర్ చేరుకుని పాక్ చొరబాటు దారులను తరిమి తరిమి కొట్టింది. పాక్ రేంజర్ల నుంచి కశ్మీర్‌ను కాపాడిన భారత సైన్యం.. ఈ క్రమంలో అనేక మంది సైనికులను కోల్పోయింది. పాకిస్తాన్ ఆక్రమణ దారులను అరికట్టడంలో లెఫ్టినెంట్ కల్నల్ దివాన్ రంజిత్ రాయ్ ముఖ్యమైన పాత్ర పోషించారు. కానీ దురదృష్టవశాత్తు బారాముల్లా ప్రాంతంలో ప్రాణాలు కోల్పోయాడు. ఆయన ధైర్యసాహసాలు, దేశం పట్ల ప్రేమకు గుర్తుగా మరణానంతం మహావీర చక్ర అవార్డు వరించింది. పదాతి దళం యొక్క ముఖ్య విధులు:దేశ సరిహద్దుల రక్షణ: చైనా, పాకిస్తాన్ వంటి దేశాలతో ఉన్న సరిహద్దులను కాపాడటం, ఆపరేషన్లు: ఉగ్రవాద నిరోధక ఆపరేషన్లు, శాంతి స్థాపన ఆపరేషన్లు మొదలైనవి. దేశాంతర సహాయక చర్యలు: ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు సహాయక చర్యలు చేపట్టడం. ప్రత్యేక దళాలు: పారా కమాండోలు, మౌంటెన్ స్ట్రైకర్స్ వంటి ప్రత్యేక దళాలు కూడా పదాతి దళంలోనే ఉంటాయి.పదాతి దళం యొక్క ప్రత్యేకతలు: విస్తృత శిక్షణ: పదాతి సైనికులు అన్ని రకాల పరిస్థితులలో యుద్ధం చేయడానికి శిక్షణ పొందుతారు. ఆధునిక ఆయుధాలు: వీరికి తుపాకులు, గ్రెనేడ్ లాంచర్లు, రాకెట్ లాంచర్లు వంటి ఆధునిక ఆయుధాలు అందుబాటులో ఉంటాయి. ధైర్యం మరియు నిబద్ధత: దేశం కోసం ఏదైనా చేయడానికి సిద్ధంగా ఉండే ధైర్యం మరియు నిబద్ధత వీరి ప్రత్యేకత.నిర్ధారణ: భారత పదాతి దళం దేశం యొక్క గర్వం. వీరు తమ ప్రాణాలను పణంగా పెట్టి దేశాన్ని కాపాడుతున్నారు. వారికి మనం ఎల్లప్పుడూ కృతజ్ఞతలు తెలియజేయాల్సిన అవసరం అనివార్యంగా ఉంది.

# జగమెరిగిన దౌత్యవేత్త కె.ఆర్.నారాయణన్

పాత్రికేయునిగా, అధ్యాపకునిగా, ఉద్యోగిగా, విదేశాల్లో భారత విదేశాంగ శాఖ ప్రతినిధిగా, భారత రాయబారిగా, అత్యుత్తమ దౌత్యవేత్తగా, విదేశాంగశాఖ సెక్రటరీగా, వైస్ ఛాన్సలర్ గా, మూడుసార్లు ఎంపీగా, కేంద్ర మంత్రిగా, ఉప రాష్ట్రపతిగా, రాష్ట్రపతిగా, కే. అర్. నారాయణ్ అందించిన బహుముఖ సేవలు చిరస్మరణీయాలు. కొచెరిల్ రామన్ నారాయణన్ (కె.ఆర్.నారాయణన్) (1920 అక్టోబర్ 27 - 2005 నవంబరు 9) పెరుమథనం, ఉఝవూర్ గ్రామంలో పేద దళిత కుటుంబంలో కొచెరిల్ రామన్ వైద్యర్, పున్నత్తురవీట్టిల్ పాపియమ్మ దంపతులకు జన్మించారు. నారాయణన్ వాస్తవానికి 4 ఫిబ్రవరి 1921 న జన్మించినట్లు చెపుతారు. అయితే ఆయన మేనమామ, పాఠశాలలో యాదృచ్ఛికంగా 27 అక్టోబర్ 1920ను నమోదు చేయించినట్లు చెపుతారు. అదే తేదీని నారాయణన్ తన పుట్టిన తేదీగా ఎంచుకుని, అధికారికంగా ఉండటానికి అనుమతించారు. అలా అధికారిక రికార్డుల ప్రకారం, తేదీ 27 అక్టోబర్ 1920 జన్మదినం అయింది. ఆయన భారతదేశ 10వ రాష్ట్రపతి. నారాయణన్ సెయింట్ జాన్స్ హైస్కూలు కూతట్టుకుళంలో అనంతరం సెయింట్ మేరీ హైస్కూలు, కురవిలంగాడ్ లో చదివి మెట్రిక్యులేషన్ (1936-37) పూర్తి చేసారు. ఇంటర్మీడియట్ విద్యను కొట్టయంలోని సి.ఎం.ఎస్ కళాశాలలో (1938-40) పూర్తి చేసారు. నారాయణన్ బి.ఎ (ఆనర్స్), ఆంగ్ల సాహిత్యంలో ఎం.ఎ డిగ్రీలను ట్రావెన్స్‌కోర్ విశ్వ విద్యాలయం (ప్రస్తుతం కేరళ విశ్వ విద్యాలయం) నుండి పూర్తిచేసారు. విశ్వ విద్యాలయంలో ప్రథమ శ్రేణిలో (ట్రావెన్స్‌కోర్ లో డిగ్రీలో మొదటి శ్రేణిలో ఉత్తీర్ణుడైన మొదటి దళిత విద్యార్థి) ఉత్తీర్ణుడయ్యారు. ఆయన కుటుంబం తీవ్రమైన యిబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో ఢిల్లీ వెళ్ళి ది హిందూ, ది టైమ్స్ ఆఫ్ ఇండియా పత్రికలలో పాత్రికేయుడిగా (1944-45) పని చేసారు. ఎం.మున్షీ ప్రచురిస్తున్న సోషల్ వెల్ఫేర్ వారపత్రికకు లండన్ విలేకరిగా వ్యవహరించారు. పాత్రికేయులుగా కొంతకాలం పనిచేసిన తర్వాత, ఉపకార వేతనం సహాయంతో లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో రాజకీయ శాస్త్రాన్ని అధ్యయనం చేసారు. నెహ్రూ ప్రభుత్వంలో భారత విదేశాంగ శాఖలో ఉద్యోగిగా నారాయణన్ తన వృత్తి జీవితాన్ని ప్రారంభించారు. నారాయణన్ ప్రతిభను గుర్తించిన జవహర్ లాల్ నెహ్రూ ఆయనను రంగూన్ లోని భారత విదేశాంగ శాఖలో భారతదేశ ప్రతినిధిగా నియమిం చారు. ఆయన జపాన్, యునైటెడ్ కింగ్‌డమ్, థాయ్‌లాండ్, టర్కీ, చైనా, అమెరికా సంయుక్త రాష్ట్రాలు దేశాలలో భారత రాయబారిగా పనిచేసారు. అమెరికాలో భారత రాయబారిగా 1980 నుండి 1984 వరకూ నాలుగేళ్ళు పనిచేసారు. ఆయనను దేశంలో అత్యుత్తమ దౌత్యవేత్తగా నెహ్రూ పేర్కొన్నారు.1949లో భారత విదేశాంగ సర్వీసులో (ఐ.ఎఫ్.ఎస్) నెహ్రూ అభ్యర్థన మేరకు చేరారు. దౌత్యవేత్తగా రంగూన్, టోక్యో, కెనడా , హనోయ్ లలో పని చేసారు. థాయ్‌లాండ్ (1967-69), టర్కీ (1973-75), చైనా(1976-78) ల భారత అంబాసిడర్ గా ఉన్నారు. 1954 లో ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్ లో బోధించారు. అతను జవహర్‌లాల్ నెహ్రూ ఫెలోషిప్(1970-72) పొందారు. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖలో సెక్రటరీగా (1976) ఉన్నారు. 1978 లో పదవీ విరమణ చేసిన తరువాత అతను న్యూఢిల్లీ లోని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వ విద్యాలయానికి వైస్-ఛాన్సలర్ గా 1979 జనవరి 3 నుండి 1980 అక్టోబరు 14 వరకు పనిచేసారు. ఈ అనుభవం తన ప్రజా జీవితానికి పునాదిగా ఆయన అభివర్ణించాడు. తరువాత పదవీ విరమణ నుండి తిరిగి వచ్చి ఇందిరా గాంధీ ప్రభుత్వ కాలంలో 1980 నుండి 84 వరకు అమెరికా సంయుక్త రాష్ట్రాలలో భారత అంబాసిడర్ గా తన సేవలనందించారు. ఇందిరా గాంధీ అభ్యర్థన మేరకు రాజకీయాల లోనికి ప్రవేశించారు. 1984, 1989, 1991 లలో వరుసగా మూడు సార్లు పాలక్కాడ్ (కేరళ) లోని ఒట్టపాళం నియోజక వర్గం నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా గెలుపొంది లోక్‌సభకు ఎన్నికయ్యారు. రాజీవ్ గాంధీ కేబినెట్ లో రాష్ట్ర వ్యవహారాల మంత్రిగా ఉన్నారు. 1985 లో ప్లానింగ్, 1985-86 మధ్య విదేశీ వ్యవహారాలు, 1986-89 మధ్య సైన్సు అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ పదవులను స్వీకరించారు.

1992 ఆగస్టు 21 న నారాయణన్ భారత ఉప రాష్ట్రపతిగా ఎన్నుకో బడ్డారు. అప్పటి రాష్ట్రపతి శంకర్ దయాళ్ శర్మ. ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా నారాయణన్ పేరును మొదటి సారిగా జనతాదళ్ పార్లమెంటరీ పార్టీ నాయకులు, పూర్వపు భారత దేశ ప్రధానమంత్రి వి.పి.సింగ్ ప్రతిపాదించారు. జనతాదళ్ , పార్లమెంటులోని వామపక్ష పార్టీలు ఉమ్మడిగా ఆయనను అభ్యర్థిగా ప్రకటించాయి. తరువాత పి.వి. నరసింహారావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నుండి మద్దతు పొందింది. అలా ఆయన ఏకగ్రీవ ఎన్నికకు మార్గం సుగమమైంది. కె.ఆర్. నారాయణన్ 1997 జూలై 17 న భారత రాష్ట్రపతిగా ఎన్ని కయ్యారు. రాష్ట్రపతి ఎన్నికలలో ఆయనకు 95% ఎలక్టోరల్ కాలేజి ఓట్లు వచ్చాయి. కేంద్రంలో మైనారిటీ ప్రభుత్వం ఉన్న సమయంలో జరిగిన ఏకైక అధ్యక్షుని ఎన్నిక ఇది. ఆయనకు టి. ఎన్. శేషన్ ఏకైక ప్రత్యర్థి అభ్యర్థి. శివసేన తప్ప మిగతా ప్రధాన రాజకీయ పక్షాలన్నీ నారాయణన్‌కు ఆ అధ్యక్ష ఎన్నికలలో మద్దతు నిచ్చాయి.1998 సార్వత్రిక ఎన్నికలలో నారాయణన్ రాష్ట్రపతి భవన్ సముదాయం లోని ఒక పాఠశాలలో నిర్వహింప బడుతున్న పోలింగు బూత్‌లో సామాన్య ఓటర్లతో కలసి వరుసలో నిలబడి ఓటు వేసి పదవిలో ఉండి ఓటు వేసిన మొదటి రాష్ట్రపతిగా గుర్తింప బడ్డారు.అధ్యక్షునిగా నారాయణన్ తన వివేచనా శక్తులను ఉపయోగించి ఆయన తీసుకున్న వివిధ నిర్ణయాలు, ఆలోచనను దేశానికి వివరించే ముఖ్యమైన ఆచరణను ప్రవేశపెట్టారు. ఇది అధ్యక్షుడి పనితీరులో పారదర్శకతకు దారి తీసింది. నారాయణన్ అధ్యక్షునిగా ఉన్న సమయంలో వివిధ రాజకీయ పార్టీలలో ఎవరికీ సభలో విశ్వాసం పొందవలసిన స్థితి లేదని వారితో సంప్రదింపుల ద్వారా నిర్ణయించు కున్న తరువాత లోక్ సభను రెండు సార్లు రద్దు చేయ బడింది.అధ్యక్షులుగా నారాయణన్ ఒక రాష్ట్రంలో రాజ్యాంగంలోని 356 అధికరణ క్రింద రాష్ట్రపతి పాలనను విధించేందుకు కేంద్ర మంత్రివర్గం చేసిన సిఫారసును పునః పరిశీలించమని రెండు సార్లు కోరారు. గుజ్రాల్ ప్రభుత్వం (1997 అక్టోబరు 22) ఉత్తర ప్రదేశ్ లోని కళ్యాణ్‌సింగ్ ప్రభుత్వాన్ని రద్దు చేయాలన్నప్పుడు, అటల్ బిహారీ వాజపేయి ప్రభుత్వం (1998 సెప్టెంబరు 25) న బీహార్ లోని రబ్రీదేవి ప్రభుత్వాన్ని రద్దు చేయాలన్నప్పుడు ఆ విధంగా పునః పరిశీలను కోరారు. భారత రాష్ట్రపతిగా పదవీ విరమణ చేసిన తరువాత కె.ఆర్. నారాయణన్ తన భార్య ఉషతో పాటు తన శేష జీవితాన్ని సెంట్రల్ ఢిల్లీ బంగ్లా (34 పృథ్వీ రోడ్) లో గడిపారు. ముంబై (21 జనవరి 2004) లో వరల్డ్ సోషల్ ఫోరమ్ "ప్రత్యామ్నాయ ప్రపంచీ కరణ ఉద్యమానికి" తన మద్దతును అందించారు. ఆయన సిద్ధ, ఆయుర్వేదం కోసం నవజ్యోతిశ్రీ కరుణాకర గురు పరిశోధనా కేంద్రాన్ని స్థాపించడానికి ఉఝూవూరు నుండి పోథెన్‌కోడ్ లోని సంతిగిరి ఆశ్రమానికి వెళ్ళారు. కె.ఆర్.నారాయణన్ 2005 నవంబరు 9 న తన 85వ యేట న్యూఢిల్లీ లో మరణించారు. ఆయనకు హిందూ ధర్మ శాస్త్రం ప్రకారం దహన కార్యక్రమాలను సైనిక లాంఛనాలతో చేసారు. ఇది రాజ్‌ఘాట్ కు సమీపంలోని "కర్మ భూమి" లో జరిగింది.

## బాలినేని... వాట్ నెక్స్ట్

ఒంగోలు, అక్టోబరు 26, సైలెంట్ రాజకీయాలకు స్పెషల్ ఆ జిల్లా. ఎప్పుడు ఈ జిల్లా రాజకీయ ముఖచిత్రం ఎలా మారుతుందో కూడా ఎవరికి అర్థం కాని పరిస్థితిగా చెప్పుకోవచ్చు. అందుకు ప్రధాన కారణం ఇక్కడి నాయకుల రాజకీయ ఎత్తుగడలే. ఇటీవల ఈ జిల్లాకు చెందిన మాజీ మంత్రి.. సైలెంట్ పాలిటిక్స్ తో షేక్ చేశారు.ఏపీలోని ప్రకాశం జిల్లా పాలిటిక్స్ అంతా డిఫరెంట్. ఇక్కడి నేతల్లో కొందరి వ్యవహార శైలి చాలా సైలెంట్ గా ఉంటుంది. కానీ వారిచ్చే షాకులు మాత్రం చాలా వైలెంట్ గా ఉంటాయని చెప్పవచ్చు. ఇటీవల ఈ జిల్లాకు చెందిన మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి జనసేన పార్టీలోకి చేరడం కూడా సేమ్ టు సేమ్ ఇలాంటిదే.వైసీపీ లో నేనే రాజు.. నేనే మంత్రిలా హవా కొనసాగించిన బాలినేని, ఎన్నికల ఫలితాల అనంతరం వెళుతున్నా.. వెళుతున్నా అంటూ జనసేన లోకి జంప్ అయ్యారు. వైసీపీలో జిల్లా కింగ్ మేకర్ లా ఉన్న బాలినేని, జనసేనలో చేరికను స్థానిక జనసేన నాయకులు ఆహ్వానిస్తే, ఇక్కడి టీడీపీ నేతలు మాత్రం విభేదించారు. దీనికి కారణం వైసీపీలో కొనసాగిన సమయంలో బాలినేని తమను ఇబ్బందులకు గురి చేశారన్నది వారి వాదన.ఇలా బాలినేనికి ఎదురుగాలి వీచినా, అనుకున్నది సాధించి చివరికి చెప్పినట్లుగా డిప్యూటీ సీఎం, జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్నారు. అంతవరకు ఓకే గానీ, బాలినేని గారూ.. వాట్ నెక్స్ట్ అంటున్నారు ఆయన క్యాడర్. ఇలాంటి క్రమంలో తాజాగా పవన్ మరీ పిలిపించుకొని బాలినేని తో భేటీ అయ్యారు. ఈ భేటీ వెనుక కారణం ఏమైనా, మరో ఊహించని షాక్ ఇచ్చేందుకు బాలినేని రెడీ అయ్యారన్నది టాక్.అసలే స్థానిక టీడీపీ నేతలు వద్దువద్దంటున్నా.. జనసేనలోకి చేరిన బాలినేనికి నామినేటెడ్ పదవి వరించే అవకాశం ఉందని పొలిటికల్ టాక్. ఇటీవల కూటమి ప్రభుత్వం నామినేటెడ్ పదవులను భర్తీ చేయనుంది. అందులో కొన్ని జనసేన కు కేటాయిస్తారు. వాటిలో మాజీ మంత్రి బాలినేనికి తప్పక వరిస్తుందని, లేకుంటే పార్టీలో కీలకపదవి దక్కే అవకాశాలు ఉన్నాయని చర్చ సాగుతోంది. అందుకే పవన్ మరీ పిలిపించుకొని, అసలు విషయాన్ని బాలినేనికి చెప్పినట్లు స్థానిక సోషల్ మీడియా కోడై కూస్తోంది.జనసేన లో చేరిన సమయం నుండి సైలెంట్ గా ఉన్న బాలినేని ఎప్పుడు, ఏ షాకిస్తారోనన్నది ప్రకాశం జిల్లాలో హాట్ టాపిక్ గా మారింది. నామినేటెడ్ పదవి వరిస్తే మాత్రం, ఇక జిల్లాలో బాలినేనికి ఎదురులేదన్నది ఆయన అభిమానుల అభిప్రాయం. మరి బాలినేని గారూ.. వాట్ నెక్స్ట్!

## బుడమేరు వరద పరిహారం అందక బాధితుల

విజయవాడ, అక్టోబరు 26, విజయవాడలో బుడమేరు వరద పరిహారం అందక బాధితుల ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఇప్పటికీ వేలాదిమందికి పరిహారం అందకపోవడంతో నిత్యం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. మరోవైపు అందరికి పరిహారం చెల్లించేసినట్టు కొందరు ఐఏఎస్ అధికారులు సిఎంఓను మభ్యపెట్టడమే సమస్యకు కారణంగా కనిపిస్తోంది.అధికారుల నిర్లక్ష్యం బుడమేరు వరద బాధితుల పాలిట శాపంగా మారింది. ఆగస్టు 30, 31 తేదీల్లో కురిసిన ఆకస్మిక వర్షాలతో విజయవాడ నగరంలోని 32 డివిజన్లు వరద ముంపుకు గురయ్యాయి. సెప్టెంబర్ 1వ తేదీ తెల్లవారు జామున బుడమేరు కట్టలకు గండి పడటంతో నగరాన్ని వరద ముంచెత్తింది. వరదను అంచనా వేయడం నుంచి బాధితులకు పరిహారం అందించడం వరకు ఎన్టీఆర్ జిల్లా అధికారుల నిర్లక్ష్యం కొనసాగుతూనే ఉంది. వరదలు వచ్చి రెండు నెలలు గడుస్తున్నా సర్వం కోల్పోయిన బాధితులు ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ తిరుగుతూనే ఉన్నారు.వరద ముంపుకు గురైన బాధితులకు ఉదారంగా సాయం చేయాలని ఏపీ సీఎం ఆదేశించినా దానిని అమలు చేయడంలో జిల్లా యంత్రాంగం విఫలమైంది. ముఖ్యమంత్రి వద్ద మంచి మార్కులు కొట్టేసే క్రమంలో కొందరు అధికారుల నిర్వాకంతో వరద నష్టం లెక్కింపులోనే గందరగోళం జరిగింది. వరద ముంపు పూర్తిగా తగ్గకుండానే ఎన్యూమరేషన్ చేపట్టడంతో పెద్ద సంఖ్యలో బాధితుల పేర్లు జాబితాల్లో చేరలేదు.ఆ తర్వాత బాధితుల పేర్లను చేర్చడంలో సచివాలయాల నుంచి తాసీల్దార్ల వరకు ఉదాసీనంగా వ్యవహరించారు. మొదటి, రెండో అంతస్తుల్లో ఉన్న వారికి కూడా పరిహారం చెల్లించాలని ముఖ్యమంత్రి ఆదేశించినా ఇప్పటి వరకు వారికి పరిహారం దక్కలేదు. పదేపదే ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగి ప్రజలు విసిగిపోయారు.విజయవాడ నగరాన్ని ముంచెత్తిన వరదలో బాధితులకు గతంలో ఎప్పుడు లేని విధంగా ముఖ్యమంత్రి పరిహారం ప్రకటించారు. బాధితుల్లో చాలామంది సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగలడంతో వారిని ఆదుకునేలా పరిహారం ప్రకటించారు. అయితే బాధితులను గుర్తించడంలో మాత్రం రెవిన్యూ యంత్రాంగం దారుణంగా విఫలమైంది. వరద నష్టాన్ని అంచనా వేయడంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి రప్పించిన 1700 బృందాలు హడావుడిగా, మొక్కుబడిగా సర్వే చేయడంతోనే ఈ సమస్య తలెత్తింది. సచివాలయాల స్థాయిలోనే సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడం, వారికి జాబితాలు అందుబాటులో లేకపోవడం వంటి కారణాలతో ఇప్పటికీ పరిహారం దక్కలేదు.విజయవాడ నగరంలోని రెండు ఎమ్మార్వో కార్యాలయాల పరిధిలో వేల సంఖ్యలో బాధితులకు ఇప్పటికీ పరిహారం దక్కలేదు. దీనిపై గత కొన్ని రోజులుగా సీపీఎం ఆందోళన నిర్వహిస్తోంది. బాధితులకు సరైన సమాచారం ఇవ్వకపోవడం, పరిహారం చెల్లింపులో అధికారుల నిర్లక్ష్యాన్ని తప్పు పడుతూ ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. వరద నష్టంపై సమగ్ర సర్వే చేపట్టాలని డిమాండ్ చేస్తోంది.

# పంచరామాలకు 350 బస్సులు

విజయవాడ, అక్టోబరు 26,కార్తికమాసం నవంబర్ 2 నుంచి ప్రారంభం కాబోతోంది. ఈ మాసంలో పరమ శివుడికి భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తారు. కార్తిక సోమవారం నాడు శైవక్షేత్రాలను దర్శిస్తే పుణ్యం లభిస్తుందని నమ్ముతారు. ఈ నేపథ్యంలో భక్తుల రద్దీ దృష్టి దృష్ట్యా ఆర్టీసీ బస్సులు నడిపేందుకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు.కార్తిక మాసంలో ఎక్కువ మంది భక్తులు పంచారామాలు, త్రిలింగ దర్శనం కోసం వెళ్తుంటారు. దీంతో వారికి తగ్గట్టు ఏపీఎస్ ఆర్టీసీ ప్యాకేజీలను ఆఫర్ చేస్తోంది. ఈ ప్యాకేజీలతోపాటు.. వనభోజనాలు, ఆలయాల సందర్శన కోసం చాలా మంది ఆర్టీసీ బస్సులను బుక్ చేసుకున్నారు. వీటి కారణంగా గతంలో ఎన్నడూ లేని స్థాయిలో ఆదాయం సమకూరింది. ఈ నేపథ్యంలో.. ఈసారి కూడా గతేడాది కంటే ఎక్కువ సంఖ్యలో బస్సులను సిద్ధం చేస్తున్నారు.ఎన్టీఆర్ జిల్లా నుంచి పంచారామాలు, శైవ క్షేత్రాలకు ఈ ఏడాది 350 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. విజయవాడ నుంచి 150, జగ్గయ్యపేట నుంచి 34, తిరువూరు నుంచి 34, ఇబ్రహీంపట్నం నుంచి 25, విద్యాధరపురం నుంచి 15, ఆటోనగర్ నుంచి 30, గవర్నర్‌పేట 1 నుంచి 22, గవర్నర్‌పేట 2 డిపో నుంచి 40.. ఇలా మొత్తం ఒక్క ఎన్టీఆర్ జిల్లా నుంచే 350 ప్రత్యేక బస్సులను శైవ క్షేత్రాలకు నడిపేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.ఈసారి డిమాండ్ ఎక్కువగా ఉండొచ్చని గతం కంటే సర్వీసులను పెంచినట్టు ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. పంచారామాల ప్యాకేజీ కింద ఒకేరోజు భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, అమరావతి, సామర్లకోటలో క్షేత్రాలను దర్శించుకునే వీలు కల్పించారు. డిమాండ్‌ను బట్టి అరుణాచలం, సముద్ర స్నానాలకు కూడా బస్సులను తిప్పనున్నట్టు ఆర్టీసీ ఆఫీసర్లు చెబుతున్నారు.మరోవైపు ఉమ్మడి కర్నూలు జిల్లాలోని మహానంది, యాగంటి, శ్రీశైలం ఆలయాలకు ఒకటిన్నర రోజులో వెళ్లి వచ్చేలా.. త్రిలింగ దర్శని ప్యాకేజీని ప్రకటించారు. వీటితోపాటు శ్రీశైలం, కొండవీడు, అన్నవరం, కర్ణాటకలోని దేవనహళ్లి తదితర ఆలయాలకు వేరుగా బస్సులు నడుపుతున్నారు. ఈ ప్యాకేజీలకు సంబంధించి ఆన్‌లైన్, ఆఫ్ లైన్‌లో వివరాలను అందుబాటులో ఉంచారుగత ఏడాది కార్తిక మాసంలో స్పెషల్ బస్సులు కిక్కిరిసిపోయాయి. రూ.86.44 లక్షల ఆదాయం వచ్చింది. 87 శాతం ఓఆర్ నమోదైంది. కిలోమీటరుకు రూ.58.72 జమ అయింది. కొవిడ్‌కు ముందు 2019లో వచ్చిన ఆదాయం కంటే ఇది ఎక్కువ. ఈ నేపథ్యంలో ఈ సంవత్సరం ఇంకా ఎక్కువ రద్దీ ఉంటుందని ఆర్టీసీ అధికారులు అంచనా వేస్తున్నారు. అందుకు తగ్గట్టు ఏర్పాట్లు చేస్తున్నారు.

# పల్నాడులో డయేరియా మరణాలు...

గుంటూరు, అక్టోబరు 26, ఏపీలో డయేరియా మరణాలు వీడటం లేదు. అతిసారం సమస్యతో పల్నాడు జిల్లాకు చెందిన ఇద్దరు గురువారం మృతి చెందారు. ఇటీవల విజయనగరం జిల్లా గుర్లలో సైతం డయేరియాతో పలువురు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన మరువక ముందే దాచేపల్లి పట్టణంలోని అంజనీపురం కాలనీలో కలుషిత తాగునీరు, అపరిశుభ్రత వాతావరణంతో డయేరియా వ్యాప్తి చెందింది.అంజనీపురం కాలనీలోగత నాలుగు రోజులుగా పలువురు వాంతులు, విరోచనాలతో ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో వారి పరిస్థితి విషమించి బుధవారం రాత్రి తమ్మిశెట్టి వెంకటేష్ (20), గురువారం తెల్లవారుజామున బండారు చిన వీరయ్య (65) మృతి చెందారు. మరో నలుగురి పరిస్థితి విషమంగా ఉండటంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.డయేరియాతో ఇద్దరు ప్రాణాలు కోల్పోవడంతో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, కలెక్టరు అరుణ్‌బాబు, ఎస్పీ శ్రీనివాసరావు, జిల్లా వైద్యాధికారి రవికుమార్ దాచేపల్లి వచ్చారు. బాధితులను పరామర్శించి, మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. పారిశుద్ధ్యం మెరుగుపచాలని అధికారులను ఆదేశించారు. అంజనీపురం కాలనీలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి సేవలు అందిస్తున్నారు.విజయనగరం జిల్లా గుర్ల మండలంలో కొద్ది రోజుల క్రితం డయేరియాతో 14 మంది ప్రాణాలు కోల్పోయారు. పల్నాడు జిల్లా దాచేపల్లి మండలంలో బుధవారం వ్యాధి ప్రబలి ఇద్దరు చనిపోగా, 14 మంది ఆస్పత్రుల పాలయ్యారు.గత జూలై నెలలోనే పల్నాడు జిల్లా దాచేపల్లి, పిడుగురాళ్ల, కారంపూడి మండలాల్లో డయేరియా కేసులు నమోదై పలువురు మరణించారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో కలుషిత నీటి సరఫరాకు అడ్డుకట్ట వేయకపోవడంతో దాచేపల్లి మండలంలో మరోసారి వ్యాధి విజృంభించింది.దాచేపల్లి పంచాయతీ అంజనాపురంలో బుధవారం బండారు చిన్న వీరయ్య(58), తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు అలియాస్ వెంకటేష్ (21) బుధవారం రాత్రి మృతి చెందారు. చిన్న వీరయ్య మంగళవారం నుంచే వాంతులు, విరేచనాలతో బాధపడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న వెంకటేశ్వర్లు బుధవారం మధ్యాహ్నం డయేరియా బారిన పడ్డారు. కుటుంబ సభ్యులు స్థానికంగా చికిత్స చేయించి, మెరుగైన వైద్యం కోసం నరసరావుపేట తరలిస్తుండగా దారిలోనే ప్రాణాలు విడిచాడు.అంజనాపురంలో తాగు నీరు కలుషితం కావడం వల్లే డయేరియా వ్యాప్తి చెందినట్లు గుర్తించారు. అంజనాపురం కాలనీ ప్రజలకు తాగు నీరు అందించే బోరు సమీపంలో సెప్టిక్ ట్యాంక్ నీళ్లు, మురికి కాలువల్లోని నీరు చేరటం వల్లే కలుషితమైనట్లు అధికారులు చెబుతున్నారు. గ్రామంలో పారిశుధ్యం నిర్వహణ కూడా అధ్వానంగా ఉంది. మురికి కాలువల్లో చెత్త పేరుకుపోయింది.పల్నాడు జిల్లాలో అతిసారంపై సీఎం చంద్రబాబు జిల్లా కలెక్టర్‌తో ఫోన్లో మాట్లాడారు. దాచేపల్లిలో పరిస్థితి, ప్రభుత్వపరంగా తీసుకున్న చర్యలను కలెక్టర్ సీఎంకు వివరించారు. ఆ ప్రాంతంలో సాధారణ స్థితి వచ్చేంతవరకు నిత్యం పర్యవేక్షించాలని సీఎం సూచించారు. బాధితులకు మెరుగైన చికిత్స అందించాలని సీఎం ఆదేశించారు.జూలై నెలలోనే జిల్లాలో అతిసారం వ్యాధి వ్యాప్తి చెందిందని, అప్పుడే చంద్రబాబు ప్రభుత్వం సరైన చర్యలు తీసుకొని ఉంటే ఇప్పుడు వ్యాపించి ఉండేది కాదని స్థానికులు ఆరోపించారు. జులైలో దాచేపల్లి మండలం కేసానుపల్లిలో డయేరియాకు వంగూరి నాగమ్మ అనే మహిళ మృతి చెందగా, మరో 30 మంది ఆస్పత్రి పాలయ్యారు.పిడుగురాళ్ల, కారంపూడి మండలాల్లోనూ పదుల సంఖ్యలో డయేరియా బారినపడ్డారని అప్పట్లో మంత్రి నారాయణ సమస్య పరిష్కరిస్తామని చెప్పినా చేయలేదని ఆరోపించారు.

డయేరియా విస్తరించిన నేపథ్యంలో బోర్లను మూసివేసి ట్యాంకర్లతో నీటిని సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది

# సత్తిబాబు దూరం అవుతున్నారా..



విశాఖపట్టణం, అక్టోబరు 26, ఉత్తరాంధ్ర జిల్లాల్లో సీనియర్ నేత బొత్స సత్యనారాయణ. సామాజికపరంగా, ఆర్థికంగా ఆయన బలమైన నేత. ఉత్తరాంధ్రలో ఆయన మోస్ట్ సీనియర్ మాత్రమే కాదు.. ఎన్నో ఉన్నత పదవులు అనుభవించిన బొత్స సత్యనారాయణ వైసీపీ హైకమాండ్ పట్ల అసంతృప్తిగా ఉన్నారా? జగన్ తీసుకుంటున్న నిర్ణయాలు ఆయనకు రుచించడం లేదా? అన్న ప్రశ్నకు నిన్నటి జగన్ విజయనగరం జిల్లా పర్యటన స్పష?టం చేస్తుంది. ఎందుకంటే తన సొంత జిల్లాకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ వస్తే బొత్స సత్యనారాయణ మాత్రం హాజరు కాలేదు. ఎక్కడా ఆయన టూర్ లో కనిపించలేదు. గొర్ల గ్రామంలో పర్యటించిన జగన్ డయేరియా బాధితులను పరామర్శించారు. మృతి చెందిన కుటుంబ సభ్యులను ఓదార్చారు. అయితే తన సొంత జిల్లాలో పర్యటిస్తున్నప్పుడు కనీసం సమాచారం బొత్స సత్యనారాయణకు లేదంటున్నారు. అందుకే ఆయన ఈ కార్యక్రమానికి దూరంగా ఉన్నారని చెబుతున్నారు. సత్తిబాబు లేకుండా తొలిసారి జగన్ విజయనగరం జిల్లాలో పర్యటించినట్లయింది. ఆయన గైర్హాజరీ కారణాలపై పార్టీలో పెద్దయెత్తున చర్చ జరుగుతుంది. బొత్స ఎందుకు రాలేదు? ఆయనలో ఉన్న అసంతృప్తి ఏంటి? జగన్ కు ఆయనకు దూరం పెరిగిందా? మొన్ననే కదా? ఎమ్మెల్సీ సీటు ఇచ్చి మరీ బొత్స సత్యనారాయణను శాసనమండలిలో చీఫ్ గా చేశారు. అలాంటి సత్తి బాబు ఎందుకు డుమ్మా కొట్టారన్న దానిపై పార్టీలో నేతలు మల్లగుల్లాలు పడుతున్నారు.కానీ కొన్ని కారణాల వల్లనే బొత్స సత్యనారాయణ ఈ కార్యక్రమానికి హాజరు కాలేకపోయారని చెబుతున్నారు. ప్రధానంగా ఉత్తరాంధ్రకు విజయసాయి రెడ్డిని ఇన్‌ఛార్జిగా నియమించడంతో సత్తిబాబు అసంతృప్తితో ఉన్నారని సమాచారం. గతంలో విజయసాయిరెడ్డి వల్లనే పార్టీకి ఇక్కడ డ్యామేజీ జరిగిందని, మళ్లీ జగన్ అదే తప్పు చేశారని బొత్స సత్యనారాయణ భావిస్తున్నారు. తనకు సంప్రదించుకుండానే ఉత్తరాంధ్రకు ఇన్‌ఛార్జిని నియమించడం, అదీ విజయసాయిరెడ్డిన నియమించడంతోనే జగన్ విజయనగరం జిల్లా పర్యటనకు దూరంగా ఉన్నారని కొందరు నేరుగా చర్చించుకుంటున్నారు. విజయసాయిరెడ్డి నియామకం నచ్చని బొత్స తన అసంతృప్తిని ఈ విధంగా తెలియజేశారంటున్నారు. జిల్లాలోనే క్లీన్ స్వీప్ చేసి... మొన్నటి ఎన్నికలలో బొత్స సత్యనారాయణతో పాటు జిల్లాలో అన్ని నియోజకవర్గ స్థానాల్లో కూటమి పార్టీలు క్లీన్ స్వీప్ చేశాయి. తొమ్మిదింటికి తొమ్మిదిస్థానాలు గెలుచుకున్నాయి. వైసీపీకి జీరో సీట్లు వచ్చాయి. జగన్ ఏకపక్ష నిర్ణయాల కారణంగానే ఈ పరిస్థితి తలెత్తిందని బొత్స సత్యనారాయణ భావిస్తున్నట్లు తెలిసింది. తనకు తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదని కూడా ఆయన బాధపడుతున్నారని తెలిసింది. ఇప్పటికిప్పుడు ఆయన పార్టీ మారే ఆలోచన చేయకపోయినా తన అసంతృప్తిని మాత్రం అధినేత ఎదుట ఈ విధంగా వెళ్లగక్కారంటున్నారు. మరొకరు తాను వ్యక్తిగత కారణాల వల్ల హాజరు కాలేకపోతున్నానని ముందుగానే పార్టీ హైకమాండ్ కు సమాచారం ఇచ్చారన్న వాదన కూడా వినిపిస్తుంది. మొత్తం మీద జగన్ టూర్ లో సత్తి బాబు లేకపోవడం హాట్ టాపిక్ గా మారింది.

### మహిళపై పిచ్చికుక్క దాడి
### తీవ్ర గాయలతో ఆసుపత్రికి తరలింపు

మేడ్చల్ మేడ్చల్ జిల్లా చర్లపల్లి డి విజన్ పరిధి ఇసి నగర్ కాలనీ లోని మహిళ పై పిచ్చికుక్క దాడి చేసి గాయపర్చడం స్థానికులను భయందోళనకు గురించేసింది. తీవ్ర గాయాలు కావడం తో మహిళ ను ఆసుపత్రికి తరలించారు. ఆరుబయట మొక్కలకు నీరుపోస్తున్న సమయంలో పిచ్చికుక్క దాడిచేసి 16చోట్ల కరవడంతో పరిస్థితి విషమంగా మారింది. . బయటికి వెళ్లాలన్నా జనాలు బయపడుతున్నారు. సంఘటనలు జరిగిన తరువాత కానీ జి హెచ్ ఎమ్ సి అధికారులు స్పందిస్తున్నారని ముందు జాగ్రత్త చర్యలు లేకపోవడంతో ఇలాంటి సంఘటనలు పునరావృతం అవుతున్నాయి. పిచ్చికుక్కల బారినుండి జనాలను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

# శారదా పీఠం..అక్రమాల పుట్ట



విశాఖపట్టణం, అక్టోబరు 26, శారదాపీఠం.. పేరుకే పీఠం కానీ వివాదాల పుట్ట అనే విమర్శలు వస్తున్నాయి. ఎందుకంటే పీఠం చెప్పేదొకటి, తీరా చేసేది ఇంకొకటి. ఒక్కో ప్రభుత్వం వచ్చినప్పుడు ఒక్కో రకంగా ఉంటూ వత్తాసు పలకడం, సర్కారు కేటాయించిన భూములను వాణిజ్యపరంగా వాడుకోవడం పరిపాటిగా వస్తోంది. కాంగ్రెస్ హయాంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి, వైసీపీ హయాంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అడిగిందే తడవుగా, అది ఏదైనా సరే ఇష్టానుసారం ఇచ్చేశారని ఆరోపణలు కోకొల్లలు. 2024 ఎన్నికల్లో టీడీపీ కూటమి గెలిచి అధికారంలోకి వచ్చిన తర్వాత శారదాపీఠానికి వరుస షాక్‌లు ఇస్తోంది. అటు విశాఖపట్నంలో, ఇటు తిరుమలలో కేటాయించిన భూములును రద్దు చేస్తూ సర్కారు కీలక నిర్ణయాలు తీసుకున్నది.వివాదాస్పద పీఠాధిపతి స్వరూపానందేంద్రకు చెందిన శారదాపీఠానికి ఈ మధ్య అన్నీ ఎదురుదెబ్బలే తగులుతున్నాయి. వైసీపీ హయాంలో వైఎస్ జగన్ ఇచ్చిన భూములన్నింటినీ తిరిగి తీసుకునే పనిలో ప్రభుత్వం నిమగ్నమైంది. స్వాధీనం చేసుకున్న ఆ భూములను ప్రజా ప్రయోజనాల కోసం వాడేందుకు ప్రయత్నాలు చేస్తోంది. వైసీపీ ప్రభుత్వంలో భీమిలి మండలం కొత్తవలసలో ఎకరం లక్ష రూపాయిల చొప్పున 15 ఎకరాలు కేటాయించింది. అయితే మార్కెట్‌లో ఎకరం రూ. 15 కోట్ల వరకూ ఉంది. అంటే రూ. 225 కోట్ల విలువైన స్థలాన్ని కేవలం రూ. 15 లక్షలకే ధారాదత్తం చేసింది. పీఠానికి ఆదాయాన్ని పెంచుకోవడం కోసం భూములను వాడుకోవాలన్న దురుద్దేశాన్ని నేటి ప్రభుత్వం గ్రహించింది. వివాదానికి దారి తీసిన ఈ కేటాయింపులను రద్దు చేయాలని ఇటీవల కేబినెట్ భేటీలో నిర్ణయించింది.తిరుమలలోని గోగర్భం డ్యామ్ వద్ద కూడా పీఠానికి 5వేల చదరపు అడుగుల భూములను 30 ఏళ్ల పాటు ప్రభుత్వం లీజుకు ఇచ్చింది. అయితే దీన్ని అడ్డంపెట్టుకుని భారీగా అక్రమ నిర్మాణాలు సాగించింది. ఇదంతా వైఎస్ రాజశేఖర్ రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు 2005 ఫిబ్రవరి జరిగిన కథ. అప్పట్లో దేవస్థానం భూములను ఆక్రమించి మరీ నిర్మాణాలు చేపట్టడం గమనార్హం. వైఎస్ జగన్ సీఎం అయ్యాక మరింత రెచ్చిపోయిన మరిన్ని అక్రమాలకు తెరలేపింది పీఠం. అదనపు నిర్మాణాలకు టీటీడీ నుంచి అనుమతి పొంది మరీ నిర్మాణాలు చేపట్టింది. ఇలా మొత్తంగా 1851.06 చ.మీ. మేర నిబంధనలు అతిక్రమించి నిర్మాణాలు చేపట్టినట్లు టీటీడీ అధికారులు తేల్చారు. నిబంధనలు అతిక్రమించినా సరే శారదాపీఠం నుంచి కేవలం వివరణ మాత్రం తీసుకొని సైలెంట్ అయ్యింది ప్రభుత్వం. దీనికి తోడు హిందూ సనాతన ధర్మాన్ని కాపాడేందుకు పీఠం పనిచేస్తోందని, ఆ నిర్మాణాలను క్రమబద్ధీకరిస్తూ 2023లో టీటీడీ తీర్మానం చేసి మరీ ప్రభుత్వానికి పంపింది. నాటి నుంచి నిన్న మొన్నటి వరకూ అక్రమాలు కొనసాగుతూనే వచ్చాయి. ఈ విషయాలన్నీ గమనించిన ప్రభుత్వం శారదాపీఠం అక్రమాలపై దృష్టి సారించింది.తిరుమలలో విశాఖ శారదా పీఠం నిర్వాహకులు అడుగడుగునా నిబంధనలు ఉల్లంఘించారని, ఈ నిర్మాణాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని టీటీడీనీ ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు అనుమతులు రద్దు చేస్తూ రాష్ట్ర దేవాదాయ శాఖ కార్యదర్శి సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది. నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని టీటీడీ ఈవోను ఆదేశించింది. అంతేకాదు భవిష్యత్‌లో ఈ తరహా భూ కేటాయింపులు, భవనాల నిర్మాణానికి సంబంధించిన అంశాల తీర్మానాల కంటే ముందుగా ప్రభుత్వ పరిశీలనకు పంపాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించింది. అయితే ఈ అక్రమ నిర్మాణాలు ఏమవుతాయి? కూల్చివేతలు ఉంటాయా? లేదా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తుందా? అనేది పెద్ద ప్రశ్నగా మారింది. అటు భిమిలిలో కేటాయించిన భూములను ప్రభుత్వం ఏం చేయబోతోందనే దానిపై కూడా ఎలాంటి స్పష్టత రాలేదు. జనసేన నేత కిరణ్ రాయల్ తిరుమలలోని పీఠం భూములు, నిర్మాణాలను పరిశీలించారు. తిరుమలలో ప్రతి గజం ఆ శ్రీవారిదేనని, స్వామిజీలు, బాబాజీలు దోచుకుంటాం అంటే కుదరదని ఆయన హెచ్చరించారు.

భక్తి పేరిట తిరుమల, వైజాగ్‌లో కోట్ల రూపాయిలు విలువ చేసే భూములను కాజేశారని ఆరోపించారు. ఈ నిర్మాణాలను కూల్చేస్తే రానున్న రోజుల్లో మరొకరు ఇలాంటి కట్టడాలు చేయాలంటే భయం ఉంటుందన్నారు. ప్రస్తుతం ఈ నిర్మాణాల వ్యవహారం కోర్టుల పరిధిలో ఉండటంతో తమకు అనుకూలంగా తీర్పు వస్తుందని కచ్చితంగా కూల్చివేతలు ఉంటాయని కూటమి నేతలు చెబుతున్నారు.

# ఏపీలో సోషల్ మీడియా వార్...

నెల్లూరు, అక్టోబరు 26,ఏపీలో సోషల్ మీడియా వార్ పీక్ లెవల్‌లో కొనసాగుతోంది. అటు టీడీపీ..ఇటు వైసీపీ వరుస పెట్టి..పోటాపోటీ పోస్టర్లు, ట్వీట్లతో బ్లాస్టింగ్ న్యూస్ అంటూ ఉత్కంఠ రేపుతున్నాయి. వైసీపీ టీమ్ చంద్రబాబు, లోకేశ్‌ను టార్గెట్ చేస్తే టీడీపీ సోషల్ మీడియా..జగన్‌ను, ఆయన కోటరీని రౌండప్ చేస్తోంది. దీంతో పోటాపోటీ పోస్టులు, ట్వీట్లతో సోషల్ మీడియా హోరెత్తిపోతోంది.ఎన్నికలు అయిపోయాయి. టీడీపీ పవర్‌లోకి వచ్చి ఐదు నెలలు కావొస్తోంది. మళ్లీ ఎన్నికలు జరగడానికి ఇంకో నాలుగేళ్లు అయితే పడుతుంది. కానీ ఏపీలో మాత్రం రేపే ఎన్నికలు ఉన్నాయన్నట్లుగా టీడీపీ వర్సెస్ వైసీపీ సోషల్ మీడియా వార్ హీటెక్కుతోంది. పవర్‌లో ఉన్న టీడీపీ..అపోజిషన్‌లో ఉన్న వైసీపీ ఎవరూ తగ్గడం లేదు. అధినేత జోలికి వస్తే చాలు ఇచ్చి పడేస్తున్నారు. ఏ చిన్న ఇష్యూ దొరికినా దాన్ని హైలెట్ చేస్తూ సోషల్ మీడియా వేదికగా రచ్చ రచ్చ చేస్తున్నారు రెండు పార్టీల సోషల్ మీడియా కార్యకర్తలు. నేతలు కూడా ఎక్స్, ఫేస్‌బుక్ వేదికగానే తమ రియాక్షన్ ఏంటో తెలియజేస్తున్నారు.ఎన్నికలకు ముందే ఏపీలో సోషల్ మీడియా వార్ ఓ లెవల్‌లో జరిగింది. వివేకా హత్యను ప్రస్తావిస్తూ జగన్‌ను, అవినాశ్‌ను కార్నర్ చేస్తూ వరుస పోస్ట్‌లతో హోరెత్తించింది టీడీపీ సోషల్ మీడియా టీమ్. ఇక పవర్‌లోకి వచ్చాక జగన్‌ను మరింత ఇరకాటంలో పెట్టే ప్రయత్నం చేస్తోంది. లేటెస్ట్‌గా టీడీపీ, వైసీపీ సోషల్ మీడియా టీమ్‌లు పెట్టిన పోస్టర్లు ఉత్కంఠ రేపాయి. అక్టోబర్ 24న మధ్యాహ్నం 12 గంటలకు ఏపీలో ఏం జరగబోతోంది.? అధికార, ప్రతిపక్షాలు ఏం చెప్పబోతున్నాయన్నట్లుగా ఎక్స్ వార్‌తో హీట్ క్రియేట్ చేశారు. ఏదో బిగ్ బ్లాస్టింగ్ న్యూస్ రాబోతుందన్న టెన్షన్ సృష్టించారు. టీడీపీ వాళ్లకు సంబంధించిన కుంభకోణం అంటూ వైసీపీ.. జగన్ ఫ్యామిలీ రచ్చ అంటూ టీడీపీ కౌంటర్ ఇచ్చుకున్నాయి.వైసీపీ హయాంలో తాడేపల్లిలోని జగన్ క్యాంప్ ఆఫీస్‌లో ఎగ్ పఫ్‌లకే మూడున్నర కోట్లు ఖర్చు పెట్టారంటూ టీడీపీ.. మొన్నటివరకు కార్నర్ చేసింది. ఆ తర్వాత తాడేపల్లి క్యాంప్ ఆఫీస్‌లో ఫర్నీచర్‌పై కొన్నాళ్లు వార్ నడిచింది. వరద రాజకీయం, సాయంపై కూడా సోషల్ మీడియా వేదికగానే రచ్చ కొనసాగింది. ఇలా ఇష్యూ ఏదైనా ప్రతీ చిన్నదానికి ట్విట్టర్‌లో పోస్టులతో రాజకీయ మంటలు మండుతూనే ఉన్నాయి. సోషల్ మీడియాలో అధికార, విపక్షాల మధ్య విమర్శలు పీక్ లెవల్‌కు చేరుకున్నాయి. ఒకరిపై ఒకరు పెట్టుకునే పోస్టులకు హద్దులు కూడా ఉండటం లేదు.వాట్సాప్, ఫేస్ బుక్, ఇన్‌స్టా గ్రామ్, ట్విట్టర్ ఇలా సోషల్ మీడియాతోనే ప్రజల మెప్పు పొందే ప్లాన్ చేస్తున్నాయి. రాజకీయ పార్టీలకు అనుబంధ విభాగాలు ఉండటం కామన్. అయితే సోషల్ మీడియా వింగ్ అంటూ ప్రత్యేక విభాగాన్ని పెట్టుకుంటున్నాయి పార్టీలు. ఆ టీమ్‌లతోనే ప్రత్యర్థి పార్టీల ఎత్తులకు పైఎత్తులు వేయడం, విమర్శలను తిప్పికొట్టడంతో పాటు తాము చేసే పనులను సమర్థించుకుంటూ వార్తలను పోస్ట్ చేస్తుంటారు. ప్రతి పార్టీ ఇదే పద్ధతిని ఫాలో అవుతోంది. దీంతో ఏది అసలు, ఏది ఫేక్ వార్తనో తెలియని పరిస్థితి ఉంది. ఏదైనా సోషల్ మీడియా సెంట్రిక్‌గా విమర్శలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది.రాజకీయం అంటేనే సోషల్ మీడియా వార్‌గా మారిపోయింది. అబద్ధపు ప్రచారాలు, ఖండనలు.. ఒకటేంటి.. ఏది అసలో? ఏది నకిలీయో తెలియనంతగా పార్టీలు పోస్టులు పెడుతుంటాయి. రాజకీయం నుంచి సోషల్ మీడియాను వేరుచేసి చూడలేని పరిస్థితి వచ్చేసింది. ఒకరకంగా సోషల్ మీడియానే రాజకీయాన్ని నడిపిస్తోందని చెప్పొచ్చు. ఇందులో పైచేయిగా సాధించడానికి ఏపీలోని టీడీపీ, వైసీపీ హోరాహోరీగా పోస్టులు పెడుతున్నాయి. గత ఎన్నికల్లో టీడీపీ గెలుపులో ఆ పార్టీ సోషల్ మీడియా కీరోల్ ప్లే చేసింది. దాంతో అధికార పక్షాన్ని ఢీకొట్టేందుకు వైసీపీ తన సోషల్ మీడియాను ఇంకా యాక్టివేట్ చేసింది. ఈ రెండు పార్టీలకు అధికారం దక్కాలన్నా.. చేజారాలన్నా సోషల్ మీడియానే ప్రధాన పాత్ర పోషించే పరిస్థితి వచ్చేసింది.

# ముద్ర లోన్ రూ. 20 లక్షలకు పెంపు

హైదరాబాద్, అక్టోబరు 26, వ్యాపారం కోసం పెట్టుబడి లేనివారికి చూయూత ఇవ్వాలన్న లక్ష్యంతో కేంద్రం ముద్ర పథకం ప్రారంభించింది. దీనిద్వారా రుణాలు అందిస్తోంది. ముద్ర రుణాలతో చాలా మంది వ్యాపారాలు విస్తరించుకుంటున్నారు. ఉపాధి పొందుతున్నారు. మరో నలుగురికి ఉపాధి కల్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో కేంద్రం ముద్ర రుణాలు సత్ఫలితాలు ఇస్తున్నట్లు గుర్తించింది. దీంతో రుణాల పరిమితిని క్రమంగా పెంచుతూ వస్తోంది. మొదట ముద్ర రుణ పరిమితి రూ.5 లక్షలు ఉంది. తర్వాత దానిని రూ.10 లక్షలకు పెంచింది. తాజాగా రుణ పరిమితిని మరోమారు రెట్టింపు చేసింది. రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలకు పెంచింది. ఇది రాబోయే వ్యవస్థాపకులకు చాలా ప్రయోజనకరంగా ఉంటుందని ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది.ఇప్పటి వరకు తరుణ్ కేటగిరీ కింద రూ.10 లక్షల వరకు రుణాలు తీసుకుని తిరిగి చెల్లించిన వారికే రుణ పరిమితి రూ.20 లక్షలకు పెంచారు. అంటే ముద్ర లోన్ కింద రూ.20 లక్షల లోన్ తీసుకోవచ్చు. అంతేకాకుండా రూ.20 లక్షల వరకు ఉన్న పీఎంఎవై లోన్ హామీ కవరేజ్.. మైక్రో యూనిట్ల కోసం క్రెడిట్ గ్యారెంటీ ఫండ్ కింద అందించనున్నారు.ప్రధాన మంత్రి ముద్ర యోజన అనేది కార్పొరేట్, వ్యవసాయేతర చిన్న, సూక్ష్మ పరిశ్రమలకు రుణాలు అందిండం కోసం 20215లో ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించారు. ఈ రుణాలను పీఎంఎవై కింద ముద్ర రుణాలుగా వర్గీకరించారు. ఈ రుణాలు మెంబర్ లెండింగ్ ఇనిస్టిట్యూషన్లు అందిస్తారు. బ్యాంకులు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలు, మైక్రో ఫైనాన్స్ ఇనిస్టిట్యూషన్లు అందుబాటులో ఉంటాయి ఇవన్నీ రుణం మంజూరు చేస్తాయి.ఇక పెద్ద పరిశ్రమలు అయిన పౌల్ట్రీ, డైరీ, తేనెటీగల పెంపకం మొదలైన వ్యవసాయ అనుబంధ పరిశ్రమలతోపాటు తయారీ వ్యాపారం వంటివాటికి పీఎంఎవై కింద రుణాలు అందిస్తారు. ప్రజలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ఈ రుణాలు ఉపయోగపడుతున్నాయి.

# గ్రంధి శ్రీనివాస్ ఫ్యాన్ లో ఉక్కపోత

ఏలూరు, అక్టోబరు 26,ఓ మాజీ ఎమ్మెల్యే. తన ఓటమికి కారణమైన వారిపై యాక్షన్ కూడా తీసుకోవడం లేదని రగిలిపోతున్నారట. ఇక గౌరవం దక్కని చోట ఉండేదుకు..తన దారి తాను చూసుకుంటానంటున్నారు ఓ వైసీపీ నేత. అయితే ఆయనకు సైకిల్ రైడ్ నచ్చుతుందా.? గాజు గ్లాస్‌లో టీ తాగాలనుకుంటున్నారా.? లేకపోతే లోటస్ ఫ్లవరే సో బెటర్ అనుకుంటున్నారా అనేది అంతుచిక్కడం లేదు. కానీ కండువా మార్చడం మాత్రం పక్కా అన్నట్లుగా లీకులు ఇస్తున్నారట. పార్టీ పవర్‌లో నుంచి దిగిపోయింది. మరో ఐదేళ్ల తర్వాత పరిస్థితులు ఎలా ఉంటాయో తెలియదు. ఇప్పుడైతే గతంలో దక్కని గుర్తింపు బాధిస్తోంది. అందుకే వైసీపీలో అసంతృప్తులు బయటపడుతున్నాయి. ఐదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు సైలెంట్‌గా ఉన్న నేతలు ఇప్పుడు నిరసన గళం వినిపిస్తున్నారు. పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ..అధినేత తీరుపై గుస్సా అవుతున్నారు. గోదావరి తీరంలో దూకుడు రాజకీయాలకు పెట్టింది పేరైన మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్..పార్టీకి దూరంగా ఉండటం హాట్ టాపిక్‌గా మారింది. ఆయన పార్టీ మారిపోతారంటూ ప్రచారం జరుగుతోంది. అతని అనుచరులు కూడా ఇదే విషయాన్ని చెప్తున్నారు.గోదావరి జిల్లాలకు చెందిన ముఖ్యనేత, భీమవరం మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ కొన్నాళ్లుగా పార్టీపై అసంతృప్తితో ఉన్నారు. ఎన్నికల్లో ఓడిన తర్వాత అసలు బయటకు రాని గ్రంధి పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. అందులో భాగంగా మాజీ సీఎం వైఎస్సార్ జయంతి, వర్ధంతి వేడుకలను కూడా పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. త్వరలో ఆయన వైసీపీని వీడనున్నట్లు ప్రచారం జరుగుతోంది. 2019 ఎన్నికల్లో జనసేనాని పవన్ కల్యాణ్‌ను ఓడించి సంచలనం సృష్టించిన తనకు..మంత్రి పదవి వస్తుందనుకుంటే తగిన గౌరవం, గుర్తింపు దక్కలేదనే అసంతృప్తితో రగిలిపోతున్నారట గ్రంధి.కాపు సామాజికవర్గానికి చెందిన గ్రంధి శ్రీనివాస్‌కు ఆ వర్గంలో మంచి ఫాలోయింగ్ ఉంది. కానీ వైసీపీలో మాత్రం పెద్దగా గుర్తింపు దక్కలేదని ఆవేదనతో ఉన్నారట. పైగా గ్రంధికి పోటీగా పార్టీలో మరో గ్రూపును తయారు చేశారని రగిలిపోతున్నారట. గత ప్రభుత్వంలో మంత్రి పదవిని ఆశించినా ఆయన ఆశ నెరవేర లేదు. విప్ పదవి ఇచ్చి సరిపెట్టింది వైసీపీ అధిష్టానం. తనకు మంత్రివర్గంలో చాన్స్ దక్కకపోడానికి తాడేపల్లి కేంద్రంగా జరిగిన రాజకీయమే కారణమని భావిస్తున్నారట. తొలి విడత మంత్రివర్గంలో చాన్స్ వస్తుందని ఆశిస్తే..రెండో విడతలో ఇస్తామని చెప్పి చివరి నిమిషంలో గ్రంధి శ్రీనివాస్ పేరును తప్పించారని చెబుతున్నారు. అప్పటి నుంచి అసంతృప్తిగా ఉన్న గ్రంధి అధికారంలో ఉండగా ఎప్పుడూ బయటపడలేదు. ఇప్పటికైనా తన నిరసనను అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లకపోతే ప్రయోజనం లేదని భావించి ఇప్పుడు అలకపాన్పు ఎక్కినట్లు తెలుస్తోంది.మరోవైపు భీమవరం నియోజకవర్గంలో తనకు ఎదురే లేదన్నట్లు రాజకీయం చేసిన మాజీ ఎమ్మెల్యే గ్రంధి..పార్టీలో మరో వర్గంతో అంతర్గత పోరు ఎదుర్కోవడం అసంతృప్తికి కారణమైందంటున్నారు. ఇదే నియోజకవర్గానికి చెందిన మోషేన్‌రాజుకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వడంపాటు మండలి చైర్మన్ పోస్టు కట్టబెట్టడం గ్రంధికి రాజకీయంగా ఇబ్బందికరంగా మారిందంటున్నారు. నియోజకవర్గంలో తన హవాకు బ్రేక్ వేసేందుకే మోషేన్‌రాజుకు పెద్ద పదవి ఇచ్చారని మాజీ ఎమ్మెల్యే ఆవేదన చెందుతున్నట్లు సమాచారం.ఈ అసంతృప్తులతో పాటు అసెంబ్లీ ఎన్నికల్లో ఓ ముఖ్య నేత తనకు వ్యతిరేకంగా పనిచేశారని ఆరోపిస్తున్నారు మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్. తన ఓటమికి ప్రయత్నించిన నేతల లిస్టు పార్టీ అధిష్టానం దగ్గరున్నా, వారిపై చర్యలు తీసుకోలేదని ఆయన ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ పార్టీలో కొనసాగతారా? లేదా? అనే చర్చ తెరపైకి వస్తోంది. తన వ్యతిరేకులపై చర్యలు తీసుకోనంతవరకు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు చెబుతున్నారు.ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌తో మాజీ మంత్రులు కారుమూరి నాగేశ్వరరావు, పేర్ని నాని సమావేశం కావడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. త్వరలోనే గ్రంధి టీడీపీలో చేరుతారన్న ప్రచారంతో వైసీపీ అధిష్టానం అలర్ట్ అయింది. గ్రంధి శ్రీనివాస్‌తో కారుమూరి, పేర్నినాని దాదాపు గంట సేపు భేటీ అయ్యారు. అయినా వెనక్కి తగ్గలేదు మాజీ ఎమ్మెల్యే. పార్టీ కోసం ఇంత కష్టపడినప్పటికీ అధిష్టానం విప్ పదవితో సరిపెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారట. తాడేపల్లి ప్యాలెస్‌లో కొంతమంది పెద్దలు తన ఎదుగుదలను అడ్డుకున్నారని ఆవేదన చెందుతున్నట్లు తెలుస్తుంది. అయితే ఇప్పటికే ఇతర పార్టీల నేతలతో ఆయన జరిపినట్లు తెలుస్తుంది. ఒకవేళ గ్రంధి శ్రీనివాస్ వైసీపీని వీడితే ఏ పార్టీలో చేరతారనే దానిపై భీమవరంలో హాట్ టాపిక్‌గా మారింది. మాజీ మంత్రుల రాయబారం ఫలిస్తుందా? లేక గ్రంధి శ్రీనివాస్ వైసీపీకి దూరమవుతారా అనేది చర్చనీయాంశంగా మారింది.

# ఎట్టకేలకు దిగొచ్చిన చైనా

నాలుగేళ్ల ప్రతిష్టంభన ముగిసింది. భారత్ చైనాల మధ్య కీలక ఒప్పందం కుదిరింది. ఎల్ఏసీలో ఇరు సైన్యాల మధ్య ఇకపై ఘర్షణలు ఉండవనే ఆశ మళ్లీ మొగ్గతొడిగింది. భారత్, చైనా రైవల్రీ ఆటలో హాల్ట్ రావడంతో రెండు దేశాల మధ్య వాతావరణం చల్లారిందనే సూచనలు కనిపిస్తున్నాయి. 40 మంది ప్రాణాలు తీసిన నాలుగేళ్ల నాటి ఘర్షణకు తర్వాత ఇది ఇరు దేశాల సంబంధంలో కీలక ముందుడుగేనని చెప్పాలి..భారత్ ? చైనా మధ్య వాస్తవాధీన రేఖ వెంబడి తూర్పు లడఖ్‌లో దాదాపు నాలుగేళ్లు సైనిక ప్రతిష్టంభనను ముగించడానికి ఇరు దేశాల మధ్య ఒప్పందం జరిగిన విషయం తెలిసిందే. ఈ ఒప్పందం ప్రకారం నియంత్రణ రేఖ వద్ద ఇరు దేశాల బలగాల ఉపసంహరణ ప్రక్రియ ప్రారంభమైంది. తూర్పు లద్దాఖ్ సెక్టార్ లోని కీలక ప్రాంతాలైన డెస్పాంగ్, డెమ్చోక్ నుంచి కొన్ని తాత్కాలిక సైనిక స్థావరాలను, తాత్కాలిక నిర్మాణాలను ఇరు దేశాలు తొలగిస్తున్నాయని రక్షణ వర్గాలు తెలిపాయి. బలగాల ఉపసంహరణ ప్రక్రియ అంతా పూర్తయిన తరువాత మరో నాలుగైదు రోజుల్లో ఈ రెండు ప్రాంతాల్లో పెట్రోలింగ్ ను పునరుద్దరించనున్నట్లు తెలుస్తోంది.తూర్పు లడఖ్‌లోని గల్వాన్ లోయలో 2020 జూన్ 15న భారత్ ? చైనా సైనికుల మధ్య తీవ్ర ఘర్షణ చోటు చేసుకున్న విషయం తెలిసిందే. ఈ ఘర్షణలో ఇరవై మందికిపైగా భారత సైనికులు వీరమరణం పొందారు. చైనా కూడా భారీగా సైనికులను కోల్పోయింది. అప్పటి నుంచి ఇరు దేశాల మధ్య సరిహద్దులో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. దీంతో ఎల్ఏసీ వెంబడి ఇరు దేశాలు భారీగా సైనిక బలగాలను మోహరించాయి. అక్కడ తాత్కాలిక నిర్మాణాలు, సైనిక స్థావరాలను ఏర్పాటు చేశాయి. ఎల్ఏసీ సరిహద్దుల్లో ఉద్రిక్తత వాతావరణాన్ని తగ్గించేందుకు ఇరు దేశాల సైనిక అధిపతుల మధ్య పలు దఫాలుగా చర్చలు జరిగినా సఫలం కాలేదు.ఇరుదేశాల మధ్య ఇటీవల ఒప్పందం కుదిరింది. రష్యాలో జరిగిన బ్రిక్స్ సదస్సులో ఈ ఒప్పందాన్ని భారత్ ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు జిన్ పింగ్ ధ్రువీకరించారు. దీంతో వాస్తవాధీన రేఖ వెంబడి 2020 గల్వాన్ ఘర్షణకు ముందు నాటి యథాస్థితి కొనసాగనుంది. ఇక నుంచి 2020లో గస్తీ నిర్వహించిన సైనికులు పెట్రోలింగ్ పాయింట్లకు స్వేచ్ఛగా వెళ్లొచ్చు. ఒకవైపు స్నేహ హస్తం చూపిస్తున్నట్లే చూపించి, మరో చేత్తో గన్ గురిపెట్టే బుద్ది చైనాది. అందుకే, ఇప్పుడు ఈ అనుమానాలు. 1962లో జరిగిన భారత్ చైనా యుద్ధం తర్వాత చైనా ఓవరాక్షన్ చాలా సార్లు హద్దు మీరింది. 1975 నుండీ సరిహద్దులో ఎన్నో సార్లు ఆక్రమణలకు పాల్పడింది. భారత్ సహనాన్ని అవకాశంగా తీసుకొని రెచ్చిపోయింది. అయితే, నాలుగేళ్ల క్రితం 40 మందిని బలితీసుకున్న గాల్వాన్ లోయ ఘర్షణలతో అది పీక్స్‌కెళ్లింది. కట్ చేస్తే.. ఇప్పుడు, రెండు దేశాలూ 'బోర్డర్ పెట్రోల్ ఒప్పందానికి' వచ్చాయి.అక్టోబర్ 22 నుండి 24 వరకూ రష్యాలో బ్రిక్స్ సదస్సులో భారత ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు జిన్ పింగ్‌లు మాట్లాడుకునే అవకాశం ఉందనే వార్తలు వస్తున్న నేపధ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. నాలుగేళ్లుగా తూర్పు లడఖ్‌లోని వాస్తవ నియంత్రణ రేఖ వెంబడి సైనిక ప్రతిష్టంభనను పరిష్కరించే ప్రయత్నాలలో ఈ ఒప్పందం కీలకమైన పురోగతిగా కనిపిస్తోంది. ఈ ఒప్పందంతో.. భారత్, చైనా మధ్య వాస్తవాధీన రేఖలో పెట్రోలింగ్ నిర్వహించే హక్కులను పునరుద్ధరించడానికి రెండు దేశాలూ అంగీకరించాయి. దీనితో, లడఖ్‌కు ఉత్తరాన ఉన్న డెప్సాంగ్ మైదానాలు, దక్షిణాన డెమ్‌చోక్ ఎల్ఏసి వెంబడి, పాత పెట్రోలింగ్ పాయింట్ల వరకు పెట్రోలింగ్ నిర్వహించుకోవచ్చు. అంటే డేప్సాంగ్ మైదానాల్లో, డెమ్‌చోక్‌లోని చార్డింగ్ నుల్లాలో పెట్రోలింగ్ పాయింట్ వరకు భారత సైనికులు పెట్రోలింగ్ చేయొచ్చు. ఇక, ఈ ఒప్పందంలో భాగంగానే, తూర్పు ప్రాంతంలో, ముఖ్యంగా అరుణాచల్ ప్రదేశ్‌లోని సున్నితమైన ప్రదేశాలకు సంబంధించి కొన్ని పరస్పర ఒప్పందాలు కూడా చేసుకున్నట్లు తెలుస్తోంది.నాలుగేళ్ల క్రితం, 2020లో ఘర్షణలు చోటుచేసుకున్న గాల్వాన్ వ్యాలీ, పాంగోంగ్ త్సో పాయింట్లను రెండు సంవత్సరాల క్రితం బఫర్ జోన్‌లు ఏర్పాటు చేసి, దళాలను విడదీశారు. గతంలో ఇక్కడ పెట్రోలింగ్ చేసే సైనికులు 13 నుండి 18 మంది ఉండగా.. ఘర్షణను నివారించడానికి కనీసం 14 నుండి 15 మంది సైనికులు గస్తీలో ఉంటారని నిర్ణయించారు. ఇక, ఇప్పుడు, ఇరుపక్షాల పెట్రోలింగ్ పరస్పరం మార్చుకోడానికి ఒప్పందం కుదిరింది. పెట్రోలింగ్ చేసే క్రమంలో రెండు వైపుల నుండీ సమన్వయం ఉంటుందనీ.. ఒకరికొకరు సమాచారం ఇచ్చిపుచ్చుకుంటాయని ఒప్పందంలో పొందుపరిచారు.

ఇందులో భాగంగా, నెలవారీ ప్రాతిపదికన, కేస్-టు-కేస్ ఆధారంగా కమాండర్, కో-కమాండర్ స్థాయి సమావేశాలు కూడా నిర్వహించాలని ఒప్పందంలో పేర్కొన్నారు. ఇప్పటివరకు కుదిరిన అవగాహన ప్రకారం, డెప్సాంగ్‌లోని కీలక ప్రాంతాల నుండి చైనా దళాలు ఉపసంహరించుకుంటాయి. అయితే, ఇది లడఖ్‌లో రాబోయే తీవ్రమైన శీతాకాల ప్రణాళికలో భాగమేనని కొన్ని వర్గాలు చెబుతున్నాయి.2020లో గల్వాన్ లోయలో చోటుచేసుకున్న ఘర్షణ తర్వాత భారత్-చైనా దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ క్రమంలోనే సరిహద్దుల వెంబడి ఇరువైపులా భారీగా బలగాలను మోహరించాయి. దాదాపు 68 వేల మంది సైన్యాన్ని భారత్ సరిహద్దుకు పంపించింది. సరిహద్దుల్లో డ్రాగన్ సైన్యం ఏదైనా కవ్వింపులకు పాల్పడితే.. దానికి దీటుగా స్పందించేందుకు ఇండియన్ ఆర్మీ అన్నివిధాలా సిద్ధమైంది. అయితే, ఈ సమస్యకు పరిష్కారం కోసం ఆర్మీ కమాండర్ స్థాయిలో గత నాలుగేళ్లుగా చర్చలు జరుగుతూనే ఉండగా.. తాజాగా కీలక పురోగతి కనిపించింది. దీనితో, అంతర్జాతీయ ఫోరమ్‌లలో రెండు దేశాల మధ్య ఉన్నత-స్థాయి దౌత్య చర్చలు సులభతరం అవుతాయి. అలాగే, ద్వైపాక్షిక సంబంధాలు మెరుగుపడతాయి. దీనితో పాటు, సరిహద్దులో భారత్ చేస్తున్న మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఆటంకం కలగకుండా ఉంటుంది. ఇక, చైనా విషయానికొస్తే, ఇతర ప్రపంచ ఉద్రిక్తతల మధ్య భారతదేశంతో సరిహద్దు వివాదాలను తగ్గించడం దానికి వ్యూహాత్మక లాభమనే చెప్పాలి.

# రూ. 664 కోట్లకు పెరిగిన సత్య నాదెళ్ల శాలరీ



న్యూఢిల్లీ, అక్టోబరు 26, (న్యూస్ పల్స్) సత్యనాదెళ్ల.. ప్రముఖ టెక్ సంస్థ మైక్రోసాఫ్ట్ సీఈవో. దాదాపు ఐదేళ్లుగా ఆయన ఈ హోదాలో కొనసాగుతున్నారు. కంపెనీ సీఈవో కావడానికి ఎంత శ్రమించారో.. సీఈవోగా ఇప్పుడు కంపెనీ వృద్ధికి అంతకన్నా రెంట్టింపుస్థాయిలో పనిచేస్తున్నారు. అయితే ఇటీవల తెచ్చిన చాట్‌జీపీటీతో కాస్త ఇబ్బంది పడినా.. బోర్డు సత్యనాదెళ్లపై పూర్తి విశ్వాసం వ్యక్తం చేసింది. దీంతో ప్రస్తుతం సీఈవోగా ఆయనే కొనసాగుతున్నారు. తాజాగా సత్యనాదెళ్ల జీతం పెరిగింది. 2024 ఆర్థిక సంవత్సరంలో ఆయన 79.1 మిలియన్ డాలర్ల వేతనం అందుకోనున్నారు. అంటే మన భారతీయ కరెన్సీలో రూ.664 కోట్లు అన్నమాట ఈ విషయాన్ని కంపెనీ తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో పేర్కొంది.2023 ఆర్థిక సంవత్సరంలో సత్యనాదెళ్ల వేతనం 48.5 మిలియన్ డాలర్లు. భారత కరెన్సీలో రూ.407 కోట్లు. ఈ ఏడాది సత్య నాదెళ్ల వేతనం 63 శాతం పెరిగింది. దీతో ఆయన 79.1 మిలియన్ డాలర్లు.. భారత కరెన్సీలో రూ.667 కోట్లు అందుకోనున్నారు. గత జూన్‌తో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో మైక్రోసాఫ్ట్ గణనీయమైన వృద్ధి సాధించింది. దీంతో కంపెనీ షేర్లు 31. 2 శాతం లాభపడ్డాయి. అలాగే మైక్రోసాఫ్ట్ మార్కెట్ విలువ 3 ట్రియల్ డాలర్లు దాటింది. దీంతో సత్య నాదెళ్ల స్టాక్ అవార్డులు 38 మిలియన్ డాలర్ల నుంచి 71 మిలియన్ డాలర్లకు పెరిగాయి. కృత్రిమే మేధ(ఏఐ) రేసులో రాణించేందుకు కంపునీ ప్రయత్నాలు ముమ్మరం చేసింది. అందులో భాగంగానే చాట్ జీపీటీ మాతృ సంస్థ అయిన ఓపెన్ ఏఐలో పెట్టుబడులు పెట్టింది.ఇదిలా ఉంటే.. మైక్రోసాఫ్ట్‌కు అందించిన సేవలకు సత్య నాదెళ్లకు 5.2 మిలియన్ డాలర్లు (రూ.43 కోట్లు) నగదు ప్రోత్సాహకం కూడా అందనుంది. ఈమేరు కంపెనీ ఫైలింగ్‌లో తెలిపింది. అయితే ఆయనకు రావాల్సిన 10.7 మిలియన్ డాలర్లకంఏ ఇది తక్కువ. ఈ ఆర్థిక సంవత్సరంలో అనేక సైబర్ సెక్యూరిటీ ఉల్లంఘనల కారణంగా ప్రోత్సాహకం తగ్గినట్లు తెలుస్తోంది.ఇక సీఈవోల వేతనాల విషయానికి వస్తే యాపిల్ సీఈవో టిమ్ కుక్ 2023లో 63.2 మిలియన్ డారల్లు(రూ.532 కోట్లు) జీతం పొందారు. చిప్ తయారీ కంపెనీ ఎన్విడియా సీఈవో జెన్సన్ హువాంగ్ 2024లో 34.2 మిలియన్ డాలర్లు(రూ.282 కోట్లు) వేతనంగా అందుకుంటున్నారు. మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల 79.1 మిలియన్ డాలర్లు(రూ.667 కోట్లు) వేతనంగా అందుకోబోతున్నారు. టెక్ కంపెనీల్లో సత్య నాదెళ్లదే అధిక వేతనం.

# ఆరు కేన్సర్ చికిత్సా కేంద్రాల ఏర్పాటు

## మంత్రి దామోదర రాజనర్సింహ

హైదరాబాద్ కేన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులను ఎదుర్కోవడానికి  వాకింగ్ లాంటి కార్యక్రమాలు ఉపయోగపడుతాయి. నాన్ కమ్యునికేబుల్ డిసీజ్లు అన్నింటిలోకెల్లా కేన్సర్ అత్యంత ప్రమాదకరమని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. శనివారం నాడు అయన ఎంఎన్ జే ఆసుపత్రిని సందర్శించారు. క్రమశిక్షణ లేని జీవన విధానం సహా అనేక కారణాలు ఈ వ్యాధి ప్రబలడానికి కారణమవుతున్నాయి. ఇండియాలో ఏటా 14 నుంచి 15 లక్షల కేసులు నమోదవుతుంటే, తెలంగాణలో 50 నుంచి 60 వేల కేసులు నమోదవుతున్నయి. కేన్సర్ గురించి అవగాహన లేకపోవడం వల్ల ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రజలకు అవగాహన కల్పించి, ప్రాణ నష్టాన్ని నివారించాల్సిన బాధ్యత మనందరిదని అన్నారు.

మహిళల్లో ఎక్కువగా బ్రెస్ట్ కేన్సర్ కేసులు నమోదవుతున్నాయి. మొత్తం వుమెన్ కేన్సర్ బర్డెన్లో 14 శాతం బ్రెస్ట్ కేన్సర్ సంబంధిత కేసులే ఉంటున్నాయని డాక్టర్లు చెబుతున్నారు. దీనిపై అవగాహన కల్పించి, స్క్రీనింగ్ చేస్తే ఎర్లీ స్టేజ్లో రోగ నిర్ధారణ చేయొచ్చు.  తద్వారా కేన్సర్ను పూర్తిగా నయం అయ్యేలా ట్రీట్మెంట్ అందించొచ్చు.ప్రతి మహిళా స్క్రీనింగ్ చేయించుకోవడానికి ముందుకు రావాలి.ప్రభుత్వం ఉచితంగా స్క్రీనింగ్, ట్రీట్మెంట్ అందిస్తోంది.ప్రతి గ్రామంలో మొబైల్ ల్యాబ్స్ ద్వారా ఉచితంగా స్క్రీనింగ్ చేయిస్తాం.6 కేన్సర్ రీజినల్ సెంటర్స్ ఏర్పాటు చేయబోతున్నామని అన్నారు.

ఈ సెంటర్లలో డాక్టర్లు, పూర్తి స్థాయిలో ఎక్విప్మెంట్ తీసుకొస్తాం. ఈ సెంటర్లు అన్నింటికీ ఎంఎన్జే హాస్పిటల్ హబ్గా ఉంటుంది. కేన్సర్ ట్రీట్మెంట్ ఒక్కరోజులోనో, ఒక్క వారంలోనో అయ్యేది కాదు, నెలలు, సంవత్సరాల తరబడి సాగుతుంది. పేషెంట్లకు ఫిజికల్, మెంటల్, ఫైనాన్షియల్ సపోర్ట్ చాలా అవసరం.. దానికోసమే పాలియేటివ్ రిహాబిలిటేషన్ సెంటర్లను ఏర్పాటు చేయబోతున్నాం. డయాబెటీస్ క్లినిక్స్ ఏర్పాటు చేయబోతున్నామని అన్నారు.

# డాలర్ డ్రీమ్స్ లో మిడిల్ క్లాసులు

హైదరాబాద్, అక్టోబరు 26,ఒకప్పుడు అమెరికాలో చదువు అనేది కేవలం సంపన్నులకే సాధ్యమయ్యేది. కానీ ఇప్పుడు మధ్య తరగతికి కూడా అందుబాటులోకి వచ్చింది. ప్రతిభ ఉండి.. విదేశాల్లో చదువుకోవాలనుకునే విద్యార్థులకు ప్రభుత్వాలతోపాటు, బ్యాంకులు ప్రోత్సాహం అందిస్తున్నాయి. విరివిగా రుణాలు ఇస్తున్నాయి. అమెరికాలో ఉన్నత చదువులు చదవాలని ఇప్పుడు సగటు మధ్య తరగతి విద్యార్థితోపాటు తల్లిదండ్రులు కూడా కోరుకుంటున్నారు. విదేశీ విద్యతో తమ పిల్లలు జీవితంలో స్థిరపడతారని భావిస్తున్నారు. దీంతో కష్టమైనా.. ఇష్టంగా తమ పిల్లలను విదేశాలకు పంపించేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇక ప్రభుత్వాలు కూడా విదేశీ విద్య కోసం వెళ్లే వారికి ఆర్థిక సహకారం అందిస్తున్నాయి. వివిధ పథకాల ద్వారా ప్రోత్సహిస్తున్నాయి. ఇక బ్యాంకులు కూడా విదేశాలకు వెళ్లే విద్యార్థులకు విరివిగా రుణాలు ఇస్తున్నాయి. ముఖ్యంగా ఐఐటీలు, ఐఐఎంలలో గీపవేశించని వారు విదేశాలలో ఈ ఆకాంక్షను కొనసాగించడానికి గణనీయమైన రుణాలు తీసుకుంటున్నారు. ఇది మంచి అవకాశాలకు మార్గంగా పరిగణించబడుతుంది. అయితే రుణం తీసుకోవడం శీఘ్ర పరిష్కారంలా అనిపించవచ్చు, కానీ ఇది చాలా పెద్ద బాధ్యత. గ్రాడ్యుయేషన్ తర్వాత అమెరికాలో రి ?ంచి ఉద్యోగంలో చేరేందుకు బ్యాంకింగ్ చేస్తూ 30?40 లక్షలు (లేదా అంతకంటే ఎక్కువ) రుణం తీసుకుంటున్న మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వ్యక్తులను నేను సూచిస్తున్నాను. కానీ జాబ్ మార్కెట్ సహకరించకపోతే? మీరు మీ జీవన వ్యయాలకు సరిపోయే ఉద్యోగంతో ముగిస్తే ఆ మొత్తాన్ని తిరిగి చెల్లించడం వల్ల కలిగే ఒత్తిడికి గురవుతున్నారు.ప్రస్తుతం విదేశాల్లోనూ ఉద్యోగావకాశాలు తగ్గుతున్నాయి. ఒకప్పటిలా పరిస్థితులు లేవు. ఆర్థికమాంద్యం కారణంగా అవకాశాలు దొరకడం కష్టంగా మారింది. కచ్చితంగా, తాజా గ్రాడ్యుయేట్‌లను నియమించుకునే గూగుల్, అమెజాన్, ఫేస్‌బుక్ వంట్ది కంపెనీలు ఉన్నాయి. కానీ ప్రవేశించడం చాలా పోటీగా ఉంది. చాలా మంది విద్యార్థులు, గ్రాడ్యుయేషన్ తర్వాత, ఆ భారీ విద్యా రుణాలను క్లియర్ చేయడానికి తగినంత చెల్లించే ఉద్యోగం కోసం కష్టపడతారు. పని గురించి మర్చిపోవద్దు, కానీ హెచ్1బీ వీసా ల్యాండింగ్ లాటరీ. మీరు దానిని పొందకపోతే, మీరు నిస్సందేహంగా ఉంటారు.ఇదిలా ఉంటే హెచ్1బీ వీసా కోసం కూడా కొందరు అడ్డదారి తొక్కుతున్నారు. దీంతో అమెరికా వెళ్లిన తర్వాత ఇబ్బంది పడుతున్నారు. రిజెక్ట్ అయి తిరిగి వస్తున్నారు. దీంతో లక్షల రూపాయలు వృథా అవుతున్నాయి. మీరు ఆర్థికంగా మీకు మద్దతునిచ్చే కుటుంబం నుండి వచ్చినట్లయితే, ప్రమాదం తక్కువగా ఉండవచ్చు. కానీ మీరు భారీ రుణం తీసుకుంటే తర్వాత ఇబ్బంది పడాల్సి ఉంటుంది. యుఎస్‌లో భవిష్యత్తును భద్రపరచడం గురించి కానీ విషయాలు అనుకున్నట్లుగా జరగకపోతే ఆ కల ఒక పీడకలగా మారుతుంది. మంచి ఉద్యోగాలను పొందని లేదా వీసా అడ్డంకులను ఎదుర్కొనే విద్యార్థులు తరచుగా తమను తాము కఠినమైన ప్రదేశంలో కనుగొంటారు. రుణ చెల్లింపులు వారిపై దూసుకుపోతున్నాయి. అదనంగా, గ్రీన్ కార్డ్ పొందడానికి ఒక జీవితకాలం కంటే ఎక్కువ సమయం పడుతుంది. కెరీర్ పరంగా మొత్తం జీవితం మీ నియంత్రణలో లేని అనేక వేరియబుల్స్‌పై ఆధారపడి ఉంటుంది

# నాలుగు చెరువులతో హైడ్రా పనులు మొదలు

హైదరాబాద్, అక్టోబరు 26, రేవంత్ సర్కార్ తీసుకొచ్చిన హైడ్రా, తన పని తాను చేసుకుపోతోంది. రాబోయే ఆరునెలల్లో చేయబోయే టార్గెట్‌ను ఫిక్స్ చేసుకున్నట్లు తెలుస్తోంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నాలుగు చెరువులను సుందరీకరణ చేయనుంది. ప్రస్తుతం ఆయా పనుల్లో బిజీ ఉంది.హైదరాబాద్ డిజాస్టర్ రెన్సాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్ ఏజెన్సీ-హైడ్రా దృష్టి పెట్టింది. ఓ వైపు ప్రభుత్వ భూములను కాపాడుతూనే మరోవైపు చెరువులను సుందరీకరణ చేయాలని నిర్ణయించుకుంది. తనను తానే టార్గెట్ ఫిక్స్ చేసింది.హైదరాబాద్ సిటీలో చెరువుల పూర్వభవానికి పైలెట్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. తొలివిడతగా నాలుగు చెరువుల సుందరీకరణను ఆరు నెలల్లో పూర్తి చేసేలా ప్లాన్ చేసింది. వాటిలో బాచుపల్లి- ఎర్రగుంట చెరువు, మాదాపూర్- సున్నం చెరువు, కూకట్‌పల్లి-నల్లచెరువు, రాజేంద్రనగర్- అప్పచెరువును ఎంపిక చేసింది.ఈస్ట్, వెస్ట్, నార్త్, సౌత్‌లో ఒక్కో చెరువును ఎంపిక చేసుకుంది. తొలుత ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో మార్కింగ్ పూర్తి చేయనుంది. దీని కోసం నెలరోజులు కేటాయించనుంది. తర్వాత చెరువుల చుట్టూ ఫెన్సింగ్, ఆ తర్వాత సుందరీకరణ ఇలా దశల వారీగా వాటి పనులు చేయనుంది.దాదాపు 200 కోట్లతో చెరువుల బ్యూటిఫికేషన్‌కు చర్యలు చేపట్టనుంది. నాన్ రియల్ ఎస్టేట్ సంస్థలకు సీఎస్ఆర్ కింద వాటిని అప్పగించాలని ఆలోచన చేస్తోంది. ఆక్రమణల నుంచి కాపాడిన చెరువుల వద్ద ఇప్పటికే సీసీ కెమెరాలతోపాటు సెక్యూరిటీ ఏర్పాటు చేయనుంది. వచ్చే ఏడాదిలోపు మిగిలిన చెరువులను సుందరికరణ చేసేలా ప్రణాళికలు రచిస్తోంది.

## బీఆర్ఎస్ పేరు మార్చే యోచన

కరీంనగర్, అక్టోబరు 26, బీఆర్ఎస్ పార్టీ నుంచి ఈ మధ్య రకరకాల ఫీలర్లు వస్తున్నాయి. మొన్నటికి మొన్న పార్టీ జెండాలో కేసీఆర్ ఫోటోకు బదులు కేటీఆర్ కనిపించారు. ఎవరో అభిమానంతో చేసిందని చాలామంది భావించారు. కానీ, అంచనా ప్రకారమే పెట్టారట. దీనిపై పబ్లిక్ నుంచి రియాక్షన్ పెద్దగా లేకపోవడంతో.. దాన్ని అంచెలంచెలుగా అమలు చేయాలన్నది ఆ పార్టీ నుంచి ఇప్పుడు వినిపిస్తున్నమాట.జెండాలో ఫోటోయే కాదు.. ఇప్పుడు పార్టీ పేరు సైతం మార్చాలనే ఆలోచనలో ఉన్నట్లు కనిపిస్తోంది. గురువారం ఆదిలాబాద్‌లో చేపట్టిన రైతు పోరు సభలో కేటీఆర్ దీనికి సంబంధించి కీలక వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ అంటే రాష్ట్ర సమితి కాదని.. భారత రైతు సమితి వచ్చే విధంగా మాట్లాడారు. దీంతో పార్టీలో మార్పులు మొదలవుతున్నాయనే సంకేతాలు క్రమంగా బలపడుతున్నాయి.గతంలో ఉన్న గుర్తు, పేరు కేసీఆర్‌కు కలిసొచ్చింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పదేళ్లు పాలించారు. ముఖ్యమంత్రి కావాలన్న కేసీఆర్ కోరిక సైతం నెరవేరింది. కాకపోతే కేసీఆర్ పెట్టిన పార్టీ జెండా గుర్తులు, పేరు కేటీఆర్‌కు కలిసిరాలేదన్నది పార్టీలో మరో వర్గం నుంచి బలంగా వినిపిస్తున్నమాట.ఇంతవరకూ ఓకే.. నేతల మాటేంటన్నది అసలు చర్చ. మిగతా పార్టీల నుంచి వచ్చినవారు కాకుండా, ప్రత్యేకంగా నేతలను తయారు చేసే పనిలో పడ్డారట కేటీఆర్. ముఖ్యంగా యువకులను పార్టీలోకి తీసుకొచ్చే ఆలోచన చేస్తున్నారట. దీని సంబంధించి తెర వెనుక గ్రౌండ్ ప్రిపేర్ అవుతోంది.ఉద్యమం నాటి నేతలు, వలస వచ్చిన నేతలను త్వరలో పక్కన పెట్టే ఛాన్స్ ఉందంటూ మరో ఫీలర్ బయటకు వచ్చింది. అందుకే నేతలు పార్టీ నుంచి వెళ్లిపోతున్నా, సైలెంట్‌గా ఉండటానికి కారణం అదేనని అంటున్నారు. మొత్తానికి రానున్న రోజుల్లో బీఆర్ఎస్‌లో భారీ మార్పులు తప్పవనే సంకేతాలు బలపడుతున్నాయి.

# 100 రోజులు... 310 అక్రమ నిర్మాణాలు కూల్చివేత

## 144 ఎకరాల చెరువులకు విముక్తి...

హైదరాబాద్, అక్టోబరు 36,హైడ్రా.. హండ్రెడ్ డేస్.. హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్ ఏజెన్సీ ..హైడ్రా, ఏర్పడి వంద రోజులు. విపత్తుల నివారణ, ఆస్తులు పరిరక్షణ కోసం తెలంగాణ ప్రభుత్వం గత జూలై 29న హైడ్రాను ఏర్పాటు చేస్తూ జీవో 99ను విడుదల చేసింది. హైడ్రా కమిషనర్‌గా ఐపీఎస్ రంగనాథ్‌ను నియమించింది. రేవంత్ సర్కార్ సంకల్పం మేరకు మహానగరంలో చెరువులు, కుంటల్లో భూఆక్రమణాల తొలగింపుపై హైడ్రా ఉక్కుపాదం మోపింది. వంద రోజుల్లో 310 అక్రమ నిర్మాణాల




కూల్చివేసింది. కబ్జాకు గురైన 144 ఎకరాల చెరువులు కుంటల భూముల్ని పరిరక్షించింది. రెండో వైపు చూస్తే ఎన్నెన్నో విమర్శలు. వివాదాలను ఫేస్ చేసింది హైడ్రా. వస్తూ వస్తూనే మాదాపూర్ తమ్మిడి కుంట చెరువులో ఎన్ కన్వేషన్ కూల్చివేతతో హైడ్రా సంచలనం రేపింది. పేద,పెద్దా అనే తేడాలేకుండా చెరువులు, నాలాలు, కుంటాల్లోవెలిసిన అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేస్తూ.. అక్రమార్కుల గుండెల్లో వణుకు రేపింది. హైడ్రా దూకుడు దేశవ్యాప్తంగా చర్చగా మారింది. జిల్లాల్లోనూ హైడ్రా తరహా వ్యవస్థను పెట్టాలనే డిమాండ్లు ఊపందుకున్నాయి. మరోవైపు వివాదాలు, విమర్శలు, ఫిర్యాదులు వెల్లువెత్తాయి.రాజకీయ విమర్శలు ఎలా వున్నా ఆక్రమణల తొలగింపే లక్ష్యంగా హైడ్రా దూకుడు ప్రదర్శించింది. అధికార పార్టీకి చెందిన పళ్లంరాజు అక్రమ నిర్మాణాలపై చర్యలు చేపట్టంది. సీఎం రేవంత్ సోదరుడు తిరుపతిరెడ్డి ఇల్లు దుర్గంచెరువు బఫర్‌జోన్‌లో వున్నట్టు గుర్తించి నోటీసులు ఇవ్వడం సహా మార్కింగ్ చేసింది. ఖైరతాబాద్‌లో పార్క్ స్థలాన్ని ఆక్రమించిన షెడ్లను తొలగించి కాంపౌండ్ వాల్ నిర్మించింది. ఆ కాంపౌండ్ వాల్‌ను కూల్చిన వేసిన ఘటనలో ఎమ్మెల్యే దానం నాగేందర్ సహా పలువురిపై కేసులు పెట్టింది హైడ్రా. అటు శివరాంపల్లిలోని కూల్చివేతలను అడ్డుకునేందుకు యత్నించిన ఎంఐఎం ఎమ్మెల్యే ముబిన్తోపాటు ఇద్దరు కార్పొరేటర్లపై కేసులు ఫైలయ్యాయి. పాతబస్తీలో ఓవైసీ బ్రదర్స్ అక్రమ నిర్మాణాలను హైడ్రా గుర్తించటం అప్పట్లో ఓ సంచలనంగా మారింది. కానీ ఇప్పటి వరకు ఓవైసీ బ్రదర్స్ కు చెందిన అక్రమ నిర్మాణం ఒక్క ఇటుక కూడా కదలకపోవటం హైడ్రా పనితీరు ఆరోపణలు, విమర్శలు వెల్లువెత్తాయి. కూకట్ పల్లి సున్నం చెరువు భూముల్లో వెలిసిన గుడిసెల్ని తొలగించింది. ముందస్తు సమాచారం ఇవ్వకుండా కూల్చివేశారనే ఆందోళనలు భగ్గుమన్నాయి. హైడ్రాను రద్దు చేయాలనే ఫిర్యాదులు వెల్లువెత్తాయి.సంగారెడ్డి జిల్లాలో భవనాల కూల్చివేతపై విచారణ చేపట్టిన హైకోర్టు హైడ్రా దూకుడును ప్రశ్నించింది. తాము కూల్చలేదని కేవలం పరికరాలు సమకూర్చామన్న హైడ్రా సమాధానంపై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. చార్మినార్ తహశీల్దార్ అడిగాడని కోర్టు భవనాలను కూల్చడానికి పరికరాలు సమకూరాస్తారా? అని ఘాటుగా ప్రశ్నించింది.మరోవైపు మూసీ మిషన్ హైడ్రాపై విమర్శలకు,వివాదాలకు మరింత ఆజ్యం పోసింది. మూసీ పరివాహక ప్రాంతంలో మార్కింగ్‌కు హైడ్రాకు సంబంధం లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో హైడ్రా దూకుడుకు కాస్త బ్రేక్ పడింది. అనుమతులు వున్న నిర్మాణాలను కూల్చమన్న హైడ్రా? దురాక్రమణలను మాత్రం వదలమని స్పష్టం చేసింది ఇప్పుడు చెరువుల పునరుజ్జీవం పై దృష్టిసారించింది హైడ్రా .. వ్యర్థాల తొలగింపును ముమ్మరం చేస్తోంది.హైడ్రా చర్యలను సవాలు చేస్తూ దాఖలైన వేర్వేరు పిటిషన్లపై విచారణ చేపట్టిన హైకోర్టు ..హైడ్రాను ఏర్పాటు చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని ఇటీవల స్పష్టం చేసింది. ఐతే వంద రోజుల వేళ హైడ్రాపైకి మరో యార్కర్ దూసుకు వచ్చింది. హైడ్రా ఆర్డినెన్స్ చట్ట విరుద్ధమని తెలంగాణ హైకోర్టులో మరో పిల్ దాఖలైంది. హైడ్రాకు విస్తృత అధికారులు ఇవ్వడం చట్టవిరుద్ధమని మాజీ కార్పొరేటర్ మంచిరెడ్డి ప్రశాంత్ రెడ్డి వేసిన పిల్‌పై కోర్టు విచారణ చేపట్టింది. 3 వారాల్లో కౌంటర్ వేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. తెలంగాణ సీఎస్ సహా ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది హైకోర్టు.

# గులాబీ నేతలకు ఉచ్చు బిగుస్తోందా...

## ఫస్ట్ అరెస్ట్ ..ఆ మంత్రులేనా

హైదరాబాద్, అక్టోబరు 26, తెలంగాణలో అసలేం జరుగుతోంది..పొంగులేటి మాటలు.. తెలంగాణ రాజకీయాలను షేక్ చేస్తున్నాయ్. కొత్త చర్చకు దారి తీస్తున్నాయ్. బీఆర్ఎస్ సర్కార్ హయాంలో.. వివిధ శాఖల్లో జరిగిన అవకతవకలపై జరుగుతోన్న విచారణ తుది దశకు వచ్చిందని? బీఆర్ఎస్ పాలనలో జరిగిన అనేక కుంభకోణాల్లో ఏదో ఒకటి దీపావళిలోపే టపాసులా పేలుతుందన్నది పొంగులేటి మాట. కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్, ధరణి లాంటి.. 8 నుంచి 10 శాఖల్లో కుంభకోణాలు జరిగాయని.. అవినీతికి, కుంభకోణాలకు పాల్పడ్డ వారిపై చర్యలకు రంగం సిద్దమైందని.. అందులో ముఖ్యమైన నాయకులు ఉన్నారని అన్నారు.వారిని అరెస్ట్ చేయాలా.. జీవిత కాలం జైల్లో పెట్టాలా అనేది చట్టం చూసుకుంటుందని.. వారి ఆస్తుల రికవరీ కూడా చట్టమే చూసుకుంటుందని పొంగులేటి ఘాటు వ్యాఖ్యలు చేశారు. దీపావళి లోపు పేలుతుందని అన్నా.. ఆయన మాటలే థౌజండ్ వాలా రేంజ్ రీసౌండ్ ఇస్తున్నాయ్. దీంతో తెలంగాణలో అసలేం జరిగింది.. ఏం జరగబోతుందన్న ఆసక్తి ప్రతీ ఒక్కరిలో కనిపిస్తోంది.బీఆర్ఎస్ సర్కార్ హయాంలో జరిగిన అవకతవకలేంటి.. అందులో ఎవరెవరికి భాగం ఉంది.. ఏ శాఖలో ఎంతమేర అక్రమాలు జరిగాయ్.. పొంగులేటి వ్యాఖ్యల తర్వాత జరుగుతున్న చర్చ ఇదే. కాళేశ్వరం ప్రాజెక్టులో భారీ ఎత్తున అవివీతి జరిగిందని అధికారంలోకి రాకముందు నుంచి ఆరోపిస్తూ వస్తున్న కాంగ్రెస్.. పవర్‌లోకి రాగానే దానిపై రిటైర్డ్ న్యాయమూర్తితో విచారణకు ఆదేశించింది. కాళేశ్వరంపై విచారణ జరిపిన జస్టిస్ పీసీ ఘోష్.. తుది నివేదికను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. మొదటి దఫా బీఆర్ఎస్ సర్కార్‌లో.. హరీశ్ రావు ఇరిగేషన్ శాఖ మంత్రిగా పనిచేయగా, రెండోసారి దఫా ప్రభుత్వంలో ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్ స్వయంగా పర్యవేక్షించారు.పీసీ ఘోష్ విచారణలో సంచలన విషయాలు బయటకు వచ్చినట్లు తెలుస్తోంది. తమకేం తెలియదని.. సీఎంగా ఉన్న కేసీఆర్ ఆదేశాలను పాటించామని ఇంజనీర్లు, అధికారులు చెప్పినట్లుగా తెలుస్తోంది. దీంతో కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతి, అవకతవకలపై.. హరీశ్ రావుతో పాటు.. కేసీఆర్‌పై కూడా కేసులు నమోదు చేసే అవకాశం లేకపోలేదన్న గుసగుసలు వినిపిస్తున్నాయ్.అటు విద్యుత్ కొనుగోళ్లలోనూ బీఆర్ఎస్ హయాంలో భారీగా అవినీతి జరిగిందని భావించిన కాంగ్రెస్ సర్కార్.. దీనిపైన కూడా విచారణ జరిపించింది. జస్టిస్ నర్సింహా రెడ్డి.. ఆ తర్వాత సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ మదన్ బీ లోకూర్‌ను విచారణ కమిషన్ చైర్మన్‌గా నియమించింది. ఛత్తీస్‌గఢ్ నుంచి జరిపిన విద్యుత్ కొనుగోళ్లలో పెద్దఎత్తున అవకతవకలు జరిగాయని కాంగ్రెస్ ఆరోపిస్తూ వస్తోంది. ఐతే విచారణలో భారీ అక్రమాలు బయటపడ్డాయని ప్రభుత్వ వర్గాల్లో అంతర్గతంగా చర్చ జరుగుతున్నట్లు తెలుస్తోంది. విద్యుత్ కొనుగోళ్ల వ్యవహారంపై తుది నివేదిక వస్తే.. తర్వాత అడుగులు పడే చాన్స్ ఉంది. అప్పుడు సీఎంగా ఉన్న కేసీఆరే విద్యుత్ శాఖను పర్యవేక్షించారు. దీంతో ఆయనపై చర్యలు తప్పవా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయ్.ఇక ధరణి పోర్టల్‌ను తీసుకొచ్చిన బీఆర్ఎస్ సర్కార్.. రాష్ట్రంలో భూములను పెద్దఎత్తున అన్యాక్రాంతం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయ్. అసైన్డ్, దేవాలయ భూములు, భూదాన్ భూములతో పాటు.. ప్రభుత్వ భూములను వేల ఎకరాలను బీఆర్ఎస్ ప్రభుత్వంలోని పెద్దలు అన్యాక్రాంతం చేశారని? దానికి సంబంధించిన ఆధారాలు ఉన్నాయని కాంగ్రెస్ పెద్దలు చెప్తున్నారు. మొదటిసారి బీఆర్ఎస్ ప్రభుత్వంలో మహమూద్ అలీ రెవెన్యూ శాఖకు మంత్రిగా ఉండగా.. రెండవ దఫా సర్కార్‌లో సీఎం కేసీఆరే రెవెన్యూ శాఖకు మంత్రిగా ఉన్నారు. దీంతో ధరణి అక్రమాల్లో మహమూద్ అలీ, కేసీఆర్‌పై కేసులు నమోదు చేస్తారన్న ప్రచారం జరుగుతోంది.గొర్రెల పంపిణీలోనూ పెద్ద ఎత్తున అక్రమాలు.. కేసీఆర్‌తో పాటు కేటీఆర్, హరీశ్ పై కేసులు?ఇక బీఆర్ఎస్ సర్కార్ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన గొర్రెల పంపిణీలోనూ పెద్దఎత్తున అక్రమాలు జరిగాయని.. ఇప్పటికే విచారణలో తేలింది. అప్పుడు పశు సంవర్ధక శాఖ మంత్రిగా పనిచేసిన తలసాని శ్రీనివాస్ యాదవ్ హయాంలోనే గొర్రెల పంపిణీలో అవినీతి జరిగిందని తేలింది. దీంతో ఆయనపై కేసులు నమోదయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది.ఇక ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం పెద్ద ఎత్తున సంచలనం రేపింది. చట్టాలను ఉల్లంఘించి, నిబంధనలకు విరుద్ధంగా.. అప్పటి ప్రతిపక్ష పార్టీ నేతలు.. సినీ, వ్యాపార, రియల్ ఎస్టేట్ ప్రముఖుల ఫోన్లు ట్యాపింగ్ చేశారన్న అంశంపై విచారణ ఫైనల్ స్టేజీకి వచ్చింది. ఫోన్ ట్యాపింగ్‌తో బ్లాక్ మెయిల్ చేసి? వేల కోట్ల రూపాయలు కొల్లగొట్టారని కాంగ్రెస్ సర్కార్ ఆరోపిస్తోంది. దీనికి సంబందించిన విచారణ కూడా తుదిదశకు చేరుకుంది. ఈ వ్యవహారంలో మాజీ సీఎం కేసీఆర్‌తో పాటు.. మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావుకు సంబంధం ఉందన్న ప్రచారం జరుగుతోంది. దీంతో కాంగ్రెస్ సర్కార్ నిర్ణయం ఎలా ఉండబోతుందన్నది ఆసక్తి రేపుతోంది.ఇక హైదరాబాద్‌లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఫార్ములా కారు రేసులోనూ భారీ ఎత్తున అక్రమాలు జరిగాయని తెలుస్తోంది. ఇప్పటికే దీనిపై విచారణ జరిపిన తెలంగాణ ప్రభుత్వం.. ఈ అవినీతిలో మాజీ మంత్రి కేటీఆర్ ప్రమేయం ఉందని భావిస్తోందట. ఫార్ములా కారు రేసు కుంభకోణంపై అవసరమైతే ఈడీ విచారణకు కూడా ఆదేశించే యోచనలో రేవంత్ సర్కార్ ఉన్నట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంలో అక్రమాలు నిరూపితం అయితే.. కేటీఆర్‌కు చిక్కులు తప్పవన్న చర్చ జరుగుతోంది. ఇవే కాకుండా దళితబంధులో అక్రమాలు, సచివాలయ నిర్మాణంలో అవినీతి.. సచివాలయానికి కొనుగోలు చేసిన కంప్యూటర్లలో అక్రమాలు లాంటి మరికొన్ని అంశాల్లోనూ తెలంగాణ సర్కార్ విచారణ ముమ్మరం చేస్తోంది.ఇలా ఒక్కొక్కటిగా విచారణ పూర్తి చేసి.. అందుకు బాధ్యులైన బీఆర్ఎస్ ముఖ్య నేతలపై కేసులు నమోదు చేసి.. వరుసగా అరెస్ట్ చేస్తారన్న ప్రచారం ఊపందుకుంది. ఐతే అటు పొంగులేటి వ్యాఖ్యలపై కేటీఆర్ స్ట్రాంగ్‌గా కౌంటర్ ఇచ్చారు. ఎలాంటి బాంబులకు భయపడేది లేదని.. పొంగులేటి బాంబులు తుస్సే అంటూ సెటైర్లు వేశారు. మరి ఏది నిజం.. ఏం జరగబోతోంది.. విచారణలో తేలిందేంటి.. కాంగ్రెస్ సర్కార్ సర్కార్ ఏం చేయబోతోంది. అరెస్టుల పర్వం మొదలైతే.. ముందుగా జైలుకు వెళ్లేది ఎవరు.. ఏయే కుంభకోణంలో ఎవరెవరు ఇరుక్కుంటారన్న చర్చ.. ఇటు పొలిటికల్ సర్కిల్స్‌తో పాటు.. సామాన్య జనాల్లోనూ ఆసక్తి రేపుతోంది.

# ఉమ్మడి నల్గొండలో ఫ్లోరైడ్ ప్రమాద ఘంటికలు

నల్గొండ, అక్టోబరు 26,ఉమ్మడి నల్గొండ జిల్లా పేరు గిన్నిస్ వరల్డ్ రికార్డుల్లోకి ఎపుడో ఎక్కింది. ఈ రికార్డు ఏడు దశాబ్దాల కిందటే నమోదయ్యింది. అయితే, అది ఓ సానుకూల అంశంలో కాదు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) నిర్దేశించిన ప్రమాణాల కంటే ఎక్కువగా నీటిలో ఫ్లోరైడ్ శాతం ఉండడంతో ఈ రికార్డ్ నల్గొండ పేరున రికార్డయ్యిందిమునుగోడు నియోజకవర్గం నాంపల్లి మండల పరిధిలోని బట్లపల్లి అనే గ్రామంలో భూగర్భ జలాల్లో 10 పిపిఎం (పార్ట్ పర్ మిలియన్ ) ఎక్కువే ఫ్లోరైడ్ ఉన్నట్లు గుర్తించి ఆ గ్రామం మొత్తాన్ని అక్కడి నుంచి వేరే ప్రాంతానికి తరలించారు. ఆ తర్వాత వివిధ అంతర్జాతీయ, జాతీయ సంస్థలు జిల్లాలోని ఫ్లోరైడ్ సమస్యపై పనిచేశాయి. ఫ్లోరైడ్ పీడనకు ఉపరితల జలాలే శరణ్యమన్న నిర్ణయానికి వచ్చిన ప్రభుత్వాలు ఆ దిశలో పనిచేశాయి.తెలంగాణ ఆవిర్భావం తర్వాత నాటి టీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన మిషన్ భగీరథ కార్యక్రమం కింద ఇంటింటికి కృష్ణా తాగునీరు ఇవ్వడం, మిషన్ కాకతీయ ప్రాజెక్ట్ కింద చెరువులను పునరుద్దరించి నీటితో నింపడతో భూగర్భ జల మట్టాలు పెరిగి ఫ్లోరైడ్ తగ్గిపోయిందన్న అభిప్రాయానికి వచ్చారు.ఈ మేరకు భారత పార్లమెంటులో దేశవ్యాప్తంగా గుజరాత్, ఉత్తరాఖండ్, తెలంగాణలను ' ఫ్లోరైడ్ ఫ్రీ స్టేట్స్ ' గా 2020 సెప్టెంబరులో ప్రకటించారు. దీంతో నల్గొండ ఇక ఫ్లోరైడ్ పీడ నుంచి బయట పడినట్లే అని అంతా భావించారు. కానీ, తాజా అధ్యయనాలు మాత్రం ఫ్లోరిన్ రక్కసి ఇంకా పొంచి ఉందని స్పష్టం చేస్తున్నాయి.రాష్ట్రంలో గత ఏడాది చివరలో ఏర్పాటైన కొత్త ప్రభుత్వం ఆధ్వర్యంలో సాగునీటి ప్రాజెక్టులు, ప్రధానంగా కొద్ది మొత్తం ఖర్చు పెడితే పూర్తయ్యి ఫలాలు అందించే అవకాశం ఉన్న ప్రాజెక్టులపై ఫోకస్ పెట్టింది. వీటిలో ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలోని దేవరకొండ నియోజకవర్గంలో ఉన్న శ్రీశైలం లెఫ్ట్ బ్రాంచ్ కెనాల్ (ఎస్.ఎల్.బి.సి) ప్రాజెక్టు ఒకటి.రెండు వారాల కిందట ఎస్సెఎల్బీసీ ప్రాజెక్టు పురోగతిపై సాగునీటి శాఖా మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్ష జరిపారు. ఈ సమీక్షకు సాగునీటి శాఖ అధికారులు నివేదికలతో హాజరయ్యారు. వీరి నివేదికల ప్రకారం ఉమ్మడి నల్గొండ జిల్లా మరో మారు ఫ్లోరైడ్ గుప్పిట చిక్కే అవకాశం ఉందన్న ఆందోళనను కలిగించే విషయాలు వెల్లడయ్యాయి.నకిరేకల్ నియోజకవర్గంలోని నార్కెట్ పల్లి మండలం, ఎల్లారెడ్డిగూడెం గ్రామంలో భూగర్భ జలాల్లో 10 పిపిఎం కంటే ఎక్కువగానే ఫ్లోరైడ్ ఉన్నట్లు గుర్తించారు. ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలోని నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల పరిధిలో 73 మండలాలు ఉండగా 23 మండలాల్లో భూగర్భ జలాల్లో నిర్ణీత పరిమితి, పరిణామాల కంటే ఎక్కువ శాతం ఫ్లోరైడ్ ఉన్నట్లు గుర్తించారు. నార్కెట్ పల్లి, మునుగోడు మండలాల్లోని గ్రామాల్లో 5 పిపిఎం కంటే ఎక్కవ ఫ్లోరైడ్ ఉన్నట్లు నివేదికల్లో పేర్కొన్నారు.జిల్లాలో నవంబర్ 2022 నాటికి యాభై శాతానికి ఫ్లోరైడ్ నిల్వలు పడిపోయాయని ప్రకటించి నిండా రెండేళ్లు నిండక ముందే తిరిగి ఫ్లోరైడ్ సమస్య తిరగబెట్టడంపై ఆందోళన వ్యక్తం అవుతోంది. ఫ్లోరిన్ సమస్యతో సతమతమైన 967 గ్రామాల సంఖ్య సున్నాకు చేరిందని నాటి రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖకు మంత్రిగా పనిచేసిన కేటీర్ చేసిన ప్రకటన ఇపుడు ఉత్తిదిగానే భావించాల్సి వస్తోందన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది.జిల్లాలో మిషన్ కాకతీయ కింద 142 చెరువులను కూడా పునరుద్దరించారు. దీంతో భూగర్భ జల మట్టాలు భాగా పెరిగడంతో ఫ్లోరైడ్ తగ్గిందనుకున్నారు. ఇండియన్ నేచురల్ రిసోర్స్ ఎకానమిక్ అండ్ మేనేజ్ మెంట్ ( ఐఎన్ఆర్ఈఎమ్) జరిపిన సర్వేలోనూ ఫ్లోరైడ్ పెరిగినట్లు గుర్తించారు. ఈ సమస్య భారిన పడిన వారు జిల్లాలో 1108 గ్రామాల్లో 19 లక్షలుగా ప్రభుత్వ నివేదికలు తేటతెల్లం చేస్తున్నాయి. వీరికి అన్ని రకాలుగా మద్దతుగా నిలిచేందుకు దేశంలో ఎక్కడా లేని విధంగా నల్గొండ జిల్లాలో 2013 నవంబరులోనే డిస్ట్రిక్ట్ ఫ్లోరైడ్ మానిటరింగ్ సెల్ (డిఎఫ్ఎమ్.సి) ఏర్పాటయ్యిందివాస్తవానికి ఫ్లోరైడ్ సమస్య ఒక్క నల్గొండ జిల్లాకు సంబంధించింది మాత్రమే కాదు. దేశంలో 22 రాష్ట్రాల్లోని 125 జిల్లాలు ఫ్లోరైడ్ భూతం బారిన పడినవే. తాజా నివేదికల మేరకు.. ఉమ్మడి నల్గొండ జిల్లాలో 23 మండలాల్లోని భూగర్భ జలాల్లో ఫ్లోరైడ్ శాతాలు పెరిగాయి.అధికారిక నివేదికల ప్రకారం.. డిండి, దేవరకొండ, చింతపల్లి, నాంపల్లి, మర్రిగూడెం, చండూరు, మునుగోడు, నారాయణపూర్, కనగల్, గుర్రంపోడు, నల్గొండ, తిప్పర్తి, నార్కెట్ పల్లి, చిట్యాల కట్టంగూరు, చౌటుప్పల్, వలిగొండ, బీబీనగర్, తుర్కపల్లి, యాదగిరిగుట్ట, ఆలేరు తదితర మండలాల్లో భూగర్భ జలాల్లో 2 పిపిఎం నుంచి 5 పిపిఎం వరకు ఫ్లోరైడ్ శాతం ఉన్నట్లు నివేదికల సమాచారం. " జిల్లాలో ఫ్లోరైడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం ఉపరితల జలాలు మాత్రమే.మర్రిగూడెం మండలంలో తలపెట్టిన శివన్నగూడెం రిజర్వాయారు పూర్తయ్యి అందుబాటులోకి వస్తే ఫలితాలు మెరుగు పడవచ్చు.

ప్రధానంగా దేవరకొండ, మునుగోడు నియోజకవర్గంలో శాశ్వత పరిష్కారానికి ఎస్.ఎల్.బి.సి టన్నెల్ ప్రాజెక్ట్ పూర్తి కావాల్సిందే. భూగర్భ జలాలను తాగునీటికి వినియోగించినన్ని రోజులు ఈ తిప్పలు తప్పేలా లేవు..' ఫ్లోరోసిస్ విముక్తి పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు కంచుకట్ల సుభాష్ 'హెచ్.టి తెలుగు' తో పేర్కొన్నారు.

అయితే, ఫ్లోరోసిస్ లక్షణాలతో ఇటీవల కాలంలో ఒక్క శిశువు కూడా పుట్టినట్లు ఒక్క కేసు కూడా రిపోర్ట్ కాకపోవడం ఒక్కటే సంతోషించదగిన విషయమని అభిప్రాయపడుతున్నారు

# వీక్లీ పరేడ్ వల్ల సిబ్బందికి ఫిజికల్ ఫిట్నెస్



సిద్దిపేట ఆరోగ్య పరిరక్షణ గురించి వీక్లీ పెరేడ్‌విధినిర్వహణ ఎంత ముఖ్యమో ఆరోగ్య పరిరక్షణ కూడా అంతే ముఖ్యం.ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్‌సిద్దిపేట పెద్ద కోడూర్ గ్రామ శివారులో ఉన్న సిఏఆర్ హెడ్ క్వార్టర్ లో జిల్లాలోని సివిల్, ఆర్మ్డ్ రిజర్వ్ పోలీస్, సిబ్బందికి వీక్లీ పరేడ్ పోలీస్ కమిషనర్ ఆదేశానుసారం నిర్వహించడం జరిగింది. ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్, సిబ్బంది ప్రదర్శించిన ఆర్మ్స్ డ్రిల్, స్క్వాడ్ డ్రిల్ ప్రదర్శనని పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ వీక్లీ పరేడ్ వల్ల సిబ్బందికి, ఫిజికల్ ఫిట్నెస్ తో పాటు, ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి బాగా ఉపయోగపడుతుందని, సమయం దొరికినప్పుడు సిబ్బంది అధికారులు వ్యాయామం చేయడం అనేది చాలా ముఖ్యం అని, మంచి శక్తి సామర్థ్యాలతో ఎలాంటి అనారోగ్యానికి గురికాకుండా విదులు నిర్వహించడానికి మంచి అవకాశం ఉంటుంది. ఫిట్నెస్ ను అనునిత్యం కాపాడుకోవాలన్నారు. ఇతర సమస్యలు ఏమన్నా ఉంటే పై ఆఫీసర్లకు చెప్పుకునే వీలుంటుందని. చెడు అలవాట్లకు లోనుకాకూడదు అన్నారు. పోలీసులు మంచి జీవన విధానాన్ని అవలంబించాలన్నారు. క్రమశిక్షణతో డ్యూటీలను నిర్వర్తించాలని జిల్లాకు, తెలంగాణ పోలీస్ శాఖకి మంచిపేరు తీసుకురావాలన్నారు. సిబ్బందికి చేయవలసిన విధులు, చేయకూడని పనుల గురించి పలు సూచనలు చేయడం జరిగింది. ఏదైనా వ్యక్తి గత సమస్యలు ఉన్న, డ్యూటీల వద్ద సమస్య ఉన్న, ఆరోగ్య సమస్య ఉన్న ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావలన్నారు. చెడు వ్యసనాలకు, చెడు స్నేహాలకు అలవాటు పడి, విధులలో నిర్లక్ష్యం వహించినట్లైతే, పోలీస్ శాఖ ప్రతిష్టకి భంగం కలిగించే విధంగా ప్రవర్తించరాదని హెచ్చరించారు. మరియు రెగ్యులర్ గా హెల్త్ చెక్ అప్స్ చేయించుకోవాలన్నారు.వ్యాయామాన్ని నిత్య జీవితంలోనూ భాగం చేసుకోవాలన్నారు.మరియు సమయం దొరికినప్పుడు భార్యా పిల్లలతో ఉల్లాసంగా గడపాలని సూచించారు. మరియు క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని తెలిపారు. సర్వేసుకు సంబంధించిన మరియు వ్యక్తిగతంగా సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

ఈ కార్యక్రమంలో రిజర్వ్ ఇన్స్పెక్టర్లు ప్రసాద్, ధరణి కుమార్, రాజేష్, విష్ణుప్రసాద్, ఇన్స్పెక్టర్లు వాసుదేవరావు, విద్యాసాగర్, ఉపేందర్ మరియు ఎస్ఐలు ఆర్ఎస్ఐలు పోలీస్ సిబ్బంది ఏఆర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తాగు నీటి సరఫరాలో సమస్యను రానీయకూడదు మంత్రి సీతక్క

హైదరాబాద్ పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క శనివారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎక్కడా తాగు నీటి సరఫరాలో సమస్య రానీయ కూడదు. శుద్ధి చేసిన నీరే సరఫరా అయ్యేలా చూడాలి. రిజర్వాయర్లలో సరిపోయినంత నీటి నిలువలు ఉన్నాయి. వాటిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. లోకల్ సోర్సు ల మీద దృష్టి పెట్టాలి. ప్రతి ఐదు, ఆరు నియోజకవర్గాలను ఒక యూనిట్ గా ప్రణాళికలు రూపొందించాలి. చాలా గ్రామాల్లో మిషన్ భగీరథ నీల్లు వస్తున్నా ప్రజలు బోర్లు వేయించాలని, ఆర్ఓ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారని అన్నారు. వేల కోట్లు ఖర్చుపెట్టిన తర్వాత బోర్ల మీద, ఆర్వో ప్లాంట్ల మీద ప్రజలు డిపెండ్ అవుతున్నారు. ఆ విధానం పోయేలా మిషన్ భగీరథ సిబ్బంది పని చేయాలి. మిషన్ భగీరథ నీళ్లపై ప్రజలకు నమ్మకం కలిగించాలి. ప్రతి గృహానికి నల్లా నీరు అందేలా చర్యలు చేపట్టాలి. మిషన్ భగీరథ ట్యాంకులను తరచు శుభ్ర పరచాలి. మిషన్ భాగీరథ పైప్ లైన్ల లీకేజీ ని అరికట్టాలి. తాగు నీటి సరఫరా పై అన్ని గ్రామాల నుంచి నెలవారీగా నివేదికలు తెప్పించండి. నేటి సరఫరా లో సమస్య తలెత్తుతున్న ఉట్నూర్ వంటి ప్రాంతాల్లో అదనపు సిబ్బందిని డిప్యూట్ చేయండని అన్నారు.

క్షేత్రస్థాయిలో ఏ చిన్న సమస్య తలెత్తినా పై అధికారులకు సమాచారం ఇవ్వాలి. ఏ నెలలో ఏ పని చేయాలో క్యాలెండర్ ను రూపొందించుకోవాలి. ప్రతి ఏఈ చేతిలో యాక్షన్ ప్లాన్ వుండాలి. ఆయా గ్రామాల్లో ఏదన్నా సమస్యతో మిషన్ భగీరథ నీళ్లు రాక పోతే ఆల్టర్నేట్ సోర్సు సిద్ధం చేసుకోవాలి. మోటు పట్లు సవరించుకొని పనితనాన్ని మెరుగుపరుచుకోవాలి. గాలి తర్వాత మనిషికి అత్యంత ముఖ్యమైనది మంచినీరే. కోట్ల మంది ప్రాణాలు మిషన్ భగీరథ సిబ్బంది చేతిలో ఉన్నాయి. అందుకే అంతా బాధ్యతతో పనిచేయాలి . విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు. గత సమ్మర్ లో నీటి ఎద్దడి వున్నా ఎలాంటి సమస్య లేకుండా తాగునీటిని అందించాం. 13456 మంచినీటి సహాయకులకు శిక్షణ ఇచ్చాము. ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నెంబర్ ను త్వరలో అందుబాటులోకి తెస్తామని అన్నారు.

# 4 రియల్ కంపెనీలకు అమోయ్ లబ్ధి...?



హైదరాబాద్, అక్టోబరు 26, అమోయ్ కుమార్ కు మరో షాక్ తగిలింది. మాజీ సీనియర్ కలెక్టర్‌పై మరో భూకుంభకోణం ఫిర్యాదు తెరపైకి వచ్చింది. సుమారు రూ.1000 కోట్ల విలువ చేసే ల్యాండ్‌ని అమోయ్ కుమార్ దోచేశారని బాధితులు ఫిర్యాదు చేశారు. రంగారెడ్డి జిల్లా తట్టి అన్నారం గ్రామంలోని మధురానగర్ ఫ్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మెంబర్స్ హైదరాబాద్‌లోని ఈడీ ఆఫీస్‌లో ఫిర్యాదు చేశారు.ఈ నేపథ్యంలో ఈడీ అధికారులు ఫోకస్ చేశారు. ఇక మరో వైపు రంగా రెడ్డి జిల్లా మహేశ్వరం మండలంలోని వట్టినాగుల వల్లి, కాజాగూడా లోని పలు ప్రభుత్వ భూములను ప్రైవేటు వ్యక్తులకు అన్యాయంగా అప్పగించారని ఐఏఎస్ అధికారి అమోయ్ కుమార్‌పై బాధితులు ఆరోపిస్తున్నారు.మొత్తం నాలుగు రియల్ ఎస్టేట్ కంపెనీలకు లబ్ధి చేకూరూలేగా అమోయ్ కుమార్ ల్యాండ్ కేటాయింపు జరిపాడని బాధితులు చెబుతున్నారు. ఈ ల్యాండ్ కబ్జాల వెనుక బీఆర్ఎస్ ప్రభుత్వ పెద్దల హస్తం ఏమైనా ఉందా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ల్యాండ్ కబ్జాల ద్వారా లబ్ధి పొందిన డబ్బంతా ఎక్కడికి వెళ్లిందన్న కోణంలో విచారణ జరుగుతుంది. మరోవైపు తమ భూములను ఎట్టిపరిస్థితుల్లోనూ వదులుకునే ప్రసక్తే లేదని రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్టు మండలం తట్టి అన్నారం గ్రామానికి చెందిన బాధితులు స్పష్టం చేశారు. 40 ఏళ్ల క్రితం డిక్రీ పేరుతో పెద్దలకు కట్టబెట్టాలని చూడటంపై బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల సహాయంతో పెద్దలు కూడా బడా పారిశ్రామిక నేతలు నిరుపేదల భూములను కబ్జా చేయడం సరికాదని బాధితులు ఆరోపిస్తున్నారు.ఈ తరుణంలో మధురానగర్ ఫ్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మెంబర్స్ శుక్రవారం రంగారెడ్డి జిల్లాలో ఏ ఓ కార్యాలయంలో బాధితులు ఫిర్యాదు చేశారు. అనంతరం కలక్టరేట్ కార్యాలయం వద్ద నిరసనలు తెలిపారు. ఈ తరుణంలో వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. తట్టి అన్నారం గ్రామంలోని సర్వే నెబర్లు 108, 109, 110, 111 లోని 70 ఎకరాల 39 గుంటలు భూమి పట్టాదారు మద్ది సత్యనారాయణ రెడ్డి 1982 లో సుమారు 840 భూములతో వెంచర్ చేసి ఫ్లాట్ లను అమ్మినట్లు ఆయన తెలిపారు. ఇలాంటి భూములను కొంతమంది రాజకీయ నాయకులతో కలిసి ఆక్రమించుకోవాలని చూస్తున్నారని ఆయన పేర్కొన్నారు. సంబంధిత అధికారులు దీనిపై తగిన చర్యలు తీసుకుని బాధితులకు వారి ఫ్లాట్ లను అప్పజెప్పాలని ఆయన కోరారు. వారికి న్యాయం జరగకపోతే బాధిత కుటుంబ సభ్యులతో కలిసి 3000 మందితో కలెక్టర్ కార్యాలయం చుట్టూ నిరసనలు తెలుపుతామని లక్ష్మారెడ్డి హెచ్చరించారు. ఐఏఎస్ అధికారి అమోయ్ కుమార్‌ను ఈడీ అధికారులు విచారించిన సంగతి తెలిసిందే.. నిన్న ఉదయం ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు అమోయ్ కుమార్‌ను ప్రశ్నించారు. మహేశ్వరం మండలం నాగారం పరిధిలోని 42 ఎకరాల భూదాన్ భూమి రికార్డులపై అమోయ్‌ను కశ్చన్ చేశారు. భూదాన్ భూములపై రియల్టర్లను పిలిపించి..ఆరా తీస్తున్నారు. భూముల రికాడ్స్‌తో ఈడీ ఎదుట రియల్టర్లు హాజరయ్యారు. అమోయ్ కుమార్, రియల్టర్లను ఒకే దగ్గర ఉంచి ఈడీ ప్రశ్నించిన సంగతి తెలిసింది

# ఇటు బెబ్బులి.. అటు గజరాజు

# వన్యమృగాలతో సంచారం

అదిలాబాద్, అక్టోబరు 26, అడవుల జిల్లా ఆదిలాబాద్ వన్య మృగాల సంచారంతో వణికిపోతోంది.

కవ్వాల్ అభయారణ్యంలో ఇప్పటికే పులి ఎంట్రీ ఇచ్చిందన్న సమాచారం కలకలం రేపుతోంది. మరోవైపు మహారాష్ట్ర తడోబా, తిప్పేశ్వరం అభయారణ్యాల నుండి పులుల వలస.. ప్రాణహిత దాటోచ్చేందుకు సిద్దంగా ఉన్న మదపుటేనుగుల గుంపుతో ఉమ్మడి ఆదిలాబాద్ అటవీ ప్రాంత వాసుల భయం అమాంత పెరిగిపోతోంది. ఇప్పటికే ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండల సమీప అటవీ ప్రాంతంలో పులి సంచారం టెన్షన్ పెడుతోంది. రెండు రోజులుగా బోథ్ మండలంలోని చింతల్ బోరి, చింతగూడ, నేరేడుపల్లె, రేండ్లపల్లిలో సంచరించిన పులి.. నేరేడుపల్లె సమీపంలో ఓ ఆవు పై దాడి చేసి హతమార్చింది.అక్కడి నుండి మాయమైన పులి వజ్జర్ అడవుల్లోకి వెళ్లే అవకాశం ఉందని, అక్కడి నుంచి మహారాష్ట్ర వైపు వెళ్లే అవకాశం ఉందని అటవీశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే ఇదే సమయంలో నిర్మల్ జిల్లా సారంగాపూర్ సెక్షన్ పరిధిలోని ఇప్పచెల్మ, పెండల్దరి అటవీ పరిదిలో పులి కనిపించందన్న సమాచారంతో అటవీ శాఖ అధికారులు అలర్ట్ అయ్యారు. అటవీ సమీప గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు ఫారెస్ట్ అధికారులు.మరోవైపు సారంగాపూర్ మండలం రవీంద్రనగర్‌లో మేకల మందపై పులి దాడి చేసిన సంఘటన చోటుచేసుకోవడంతో అడవి బిడ్డలు భయంతో వణికిపోతున్నారు. ఈ దాడిలో రెండు మేకల మృతి చెందగా ఒక మేకకు గాయాలయ్యాయి. మోహన్ నాయక్ అనే కాపలాదారుడు మేకల మందను మేతకు తీసుకెళ్లిన సమయంలో ఈ ఘటన చోటు చేసుకున్నట్లు అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు స్థానిక ప్రజలు.మరో వైపు కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా సరిహద్దులోని మహారాష్ట్ర లో ఏనుగు సంచారం కనిపించడంతో తూర్పు ప్రాంత ప్రజల్లో భయం రెట్టింపు అయ్యింది.

ఆరు నెలల క్రితం మహారాష్ట్ర నుండి ప్రాణహిత దాటి కొమురంభీమ్ జిల్లాలో అడుగు పెట్టి ఇద్దరు రైతులను హతమార్చి వెళ్లిన ఏనుగు తాజా గా మరొసారి జిల్లాలో అడుగు పెట్టే అవకాశం ఉందన్న సమాచారంతో జిల్లా అటవీ శాఖ అప్రమత్తమైంది. మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా అహేరీ అటవీ ప్రాంతంలో ఏనుగు కదిలికలను మహారాష్ట్ర అటవీ అధికారులు గుర్తించి కొమురం భీమ్ జిల్లా అధికారులకు సమాచారం ఇవ్వడంతో కాగజ్ నగర్ కారిడార్ అటవీ ప్రాంతంలోని ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు అధికారులు.గత ఏప్రిల్ నెలలో మహారాష్ట్ర గడ్చిరోలి జిల్లా అహేరీ మీదుగా ప్రాణహిత దాటి కొమురంభీమ్ జిల్లాలోకి ప్రవేశించిన ఏనుగు ఏప్రిల్ 3న చింతలమానేపల్లి మండలం బాబాపూర్ గ్రామంలో వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన రైతు అల్లూరి శంకర్ పై దాడిచేసి హతమార్చింది. 24 గంటల వ్యవధిలోనే ఏప్రిల్ 4న పెంచికలపేట మండలం కొండపల్లి గ్రామానికి చెందిన కారుపోశన్న అనే మరో రైతును వ్యవసాయ పనుల నిమిత్తం పొలానికి వెళ్తున్న క్రమంలో కాలుతో తొక్కి చంపేసింది. ఈ వరుస సంఘటనలతో ప్రజలతోపాటు అటవీ అధికారులకు కంటిమీద కునుకులేకుండా పోయింది.మదపుటేనుగును సరిహద్దులు కాగజ్ నగర్ కారిడార్ పరిదిలోని అటవీ అదికారులు మూడు రోజులు నానాతంటాలు పడక తప్పలేదు. డ్రోన్ కెమెరాలతో ఏనుగును గుర్తించిన అటవీశాఖ ప్రాణహిత దాటించేందుకు అష్టకష్టాలు పడ్డారు. కేవలం జిల్లా సరిహద్దుకు 35 కిలో మీటర్ల దూరంలో మాత్రమే సంచరిస్తున్న ఏనుగు మళ్లీ ప్రాణహిత దాటి జిల్లాలోకి ఎంట్రీ ఇచ్చే అవకాశాలు లేకపోలేదని మహారాష్ట్ర అటవీశాఖ తెలపడంతో జిల్లా వాసుల్లో భయం అమాంతం పెరిగింది.

## అక్రమ పశువుల రవాణా.. ముగ్గురిపై కేసు నమోదు

నల్గొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండలం రంగుండ్ల గ్రామం నుంచి శుక్రవారం అర్ధరాత్రి 12 గేదెలు, 22 ఎద్దులను కంటైనర్ లో అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని సాగర్ పోలీసులు పట్టుకున్నారు. గేదెలు,ఎద్దులను చండూరు బోరుగడ్డ గోశాలకు తరలించారు. దొంగతనంగా గేదేలు,ఎద్దులను తరలిస్తున్న ముగ్గురిపై కేసు నమోదు చేసారు. గేదెలు,ఎద్దులు విలువ సుమారు 40 లక్షల రూపాయల వరకు ఉంటుందని అంచనా వేస్తున్నారు.

# ముస్లీంల నిరసన ర్యాలీ

ఆళ్లగడ్డమహా ప్రవక్త మహమ్మద్ సల్లల్లాహు అలైహి వ సల్లం పై మతోన్మాది నరసింహ నందు చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసిస్తూ ఆళ్లగడ్డ పట్టణంలోని ఈద్గా మసీదు వద్ద నుండి నాలుగు రోడ్ల కూడలి వరకు ఆళ్లగడ్డ ముస్లిం జేఏసీ సభ్యులు మరియు ఉలమాల సంఘం నాయకులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెక్యులర్ దేశమైన మన భారత దేశంలో హిందూ ముస్లింలు అన్నదమ్ముల వలె జీవిస్తూ ఉండగా ఐకమత్యాన్ని బంగపరుస్తూ ముస్లింల మనోభావాలు దెబ్బతినేలా మహమ్మద్ ప్రవక్తపై చేసిన వ్యాఖ్యలు ఎంతోమందిని బాధించాయని మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వారు కేవలం ముస్లింలకే కాదు పూర్తి జగత్తుకు ఆయన ప్రవక్త అని పలువురు వ్యాఖ్యానించారు. పరుష పదజాలంతో ప్రవక్త గారిపై వ్యాఖ్యలకు పాల్పడి ఎంతోమంది ముస్లిం సోదరుల మనోభావాలను దెబ్బతీసిన నరసింహ నందు పై తక్షణమే చర్యలు తీసుకొని అతనిపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం డిఎస్పి కార్యాలయం చేరుకొని డిఎస్పీకి వినతి పత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ జేఏసీ సంఘం నాయకులు బీరువాల భాష బరుగొడ్ల హుస్సేన్ బాషా హసన్ ఉలమాల సంఘం నాయకులు మౌలానా మహమ్మద్ రఫీ, హాఫీజ్ లు సద్దాం హుస్సేన్, సాదిక్, ఆవాజ్ కమిటీ సభ్యులు, ఎస్ డి పి ఐ పార్టీ నాయకులు ,కార్యకర్తలు,జమాత్ కమిటీ నెంబర్లు పెద్ద ఎత్తున ముస్లిం మత పెద్దలు మత గురువులు, ముర్షద్ లు, పీర్లు మరియు వారి శిష్య బృందాలు విజ్ఞులు మేధావులు పెద్ద ఎత్తున ముస్లిం సోదరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో శ్రీశ్రీశ్రీ హజరత్ దస్తగిరి స్వామి ఉరుసు

చాగలమరి పట్టణంలోని ముత్యాలపాడు రోడ్డు గురు మినరల్ వాటర్ ఎదురుగా వెలసిన శ్రీ శ్రీ శ్రీ హజరత్ దస్తగిరి స్వాముల ఉరుసు కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించడం జరిగింది.శుక్రవారం రాత్రి ఒకటవ వార్డులోని చిత్రగంటి లాల్ బాషా కుటుంబం నుంచి మంగళ వాయిద్యాలతో పకీర్లచే గంధం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అలాగే 26వ తేదీ శనివారం అక్కడికి విచ్చేసిన భక్తాదులందరికీ ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజన కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. శనివారం రాత్రి 10 గంటలకు బ్రహ్మాండమైన లైటింగ్ డెకరేషన్తో అనేక గొప్ప సంగీత వాయిద్యాలతో శ్రీ శ్రీ హజరత్ దస్తగిరి స్వామి వారి జండాల ఉత్సవం వైభవంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో చిత్రగంటి లాల్ బాషా గారి కుమారులు చాంద్ భాష, మా భాష, వార్డు మెంబర్ షబ్బీర్ ఎంపీటీసీ ఫయాజుద్దీన్ మరియు కమిటీ సభ్యులు పాల్గొనడం జరిగింది.

# టార్గెట్... పదవులు..

హైదరాబాద్, అక్టోబరు 26, తెలంగాణ బీజేపీ నేతలకు టార్గెట్ ఫిక్స్ అయ్యిందా? మూడు ఎమ్మెల్సీ సీట్లు గెలవాల్సిందేనా? స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించడమే లక్ష్యంగా అడుగులు వేయనున్నారా? వీటిలో సక్సెస్ అయ్యినవారికే పదవులా? ప్రస్తుతం అవుననే సంకేతాలు బలంగా వినిపిస్తున్నాయి.బాహుబలి మూవీలో కాలకేయుడ్ని అంతం చేసిన వారికే.. మహిష్మతి సింహాసనం అప్పగించాలన్నది యువరాజులకు టార్గెట్ ఫిక్స్ చేశారు శివగామి. ఇదే పరిస్థితి తెలంగాణ బీజేపీ నేతల వంతైంది. తెలంగాణలో ప్రభుత్వ వైఫల్యాలని ఎండగట్టి.. వచ్చే ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు కాషాయపార్టీ అడుగులు వేస్తోందట. అందుకే.. టీ-బీజేపీ నేతలు దూకుడు పెంచారనే వార్తలు జోరుగా వినిపిస్తున్నాయి. స్థానిక సంస్థలు, ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని.. కాషాయ పార్టీ వ్యూహాత్మకంగా ముందుకు వెళ్తోందట. నేతల మధ్య ఉన్న విభేదాలు పక్కన పెట్టి.. పార్టీని బలోపేతం చేసేందుకు అధిష్ఠానం పావులు కదుపుతోందట. అందుకే.. బీజేపీ రాష్ట్ర సంస్థాగత ఇన్‌ఛార్జ్ సునీల్ బన్సల్ వేగంగా పావులు కదుపుతున్నారనే వార్తలు గుప్పుమంటున్నాయి. రేవంత్‌రెడ్డి సర్కారు అమలు చేస్తున్న రైతు రుణమాఫీ, రైతు భరోసా వంటి పథకాల్లో ఏవైనా తప్పిదాలు ఉంటాయని కాషాయనేతలు వెతుకుతున్నట్లు సమాచారం. ఇప్పటివరకూ అన్నదాతల సమస్యలపై పోరాటాలు చేస్తూ వస్తున్న రాష్ట్ర బీజేపీ.. తాజాగా మూసీ, హైడ్రాపై ఫోకస్ పెట్టినట్లు వార్తలు వినిపిస్తున్నాయి.ఇప్పటి వరకు ఆ పార్టీలో అధ్యక్ష, మిగతా విభాగాల పదవుల కోసం నేతల మధ్య విపరీతమైన పోటీ నెలకొంది. తెలంగాణ అధ్యక్ష రేసులో ఉండే నేతలకు ఎమ్మెల్సీ, స్థానిక సంస్థల ఎన్నికలు అగ్నిపరీక్షగా మారాయి.సార్వత్రిక ఎన్నికల తర్వాత తెలంగాణ బీజేపీ నేతలకు టార్గెట్ ఫిక్స్ చేసింది హైకమాండ్. త్వరలో జరగనున్న మూడు ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించాలని, దీని లక్ష్యంగా ఇప్పటి నుంచే అడుగులు వేయాలని నేతలకు సంకేతాలు వెళ్లాయి.బీజేపీ పార్టీ ఆఫీసులో ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్, అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి ముఖ్యనేతలు, వివిధ మోర్చాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల నేతలు హాజరయ్యారు.ఎమ్మెల్సీ ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికలపై బీజేపీ దృష్టి సారించింది. సభ్యత్వం నమోదు, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై ఆందోళన చేయాలని భావించింది. ఎమ్మెల్సీ ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికలు, ఆందోళన కార్యక్రమాలపై కమిటీ నేతలతో చర్చించారు.రెండు లేదా మూడు రోజుల్లో ఎమ్మెల్సీ అభ్యర్థులను ప్రకటిస్తామని వెల్లడించారు సునీల్ బన్సల్. ఎమ్మెల్సీ ఎన్నికల కమిటీలో ఎంపీ ధర్మపురి అరవింద్, ఎమ్మెల్యే పాల్వాయి హరీష్, ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రామచందర్‌రావు, ప్రదీప్ కుమార్, కాసం వెంకటేశ్వర్లు ఉన్నారు.ఇదే సమయంలో అటు స్థానిక సంస్థల ఎన్నికలపై ఫోకస్ చేసింది. అనుసరించాల్సిన వ్యూహం సంబంధిత కమిటీలతో సమావేశమయ్యారు కిషన్ రెడ్డి, సునీల్ బన్సల్. ఉమ్మడి జిల్లాల ఇంఛార్జ్ లు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ముఖ్యనేతలు హాజరయ్యారు.ఎంపీలు ఈటెల రాజేందర్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యేలు కాటిపల్లి వెంకట రమణరెడ్డి, పైడి రాకేష్ రెడ్డి, చింతల రామచంద్రారెడ్డి, బూర నర్సయ్యగౌడ్, ఆరూరి రమేష్, వినోద్ రావు, బంగారు శృతి ఈ కమిటీలో కీలక నేతలు.ఈ రెండు ఎన్నికల్లో పార్టీని సక్సెస్‌గా నడిపిన నేతలకు పదవులు ఇవ్వడం ఖాయమనే చర్చ కమలనాథుల్లో జరుగుతోంది. పార్టీని బలోపేతం చేయడమేకాదు, తెలంగాణ బీజేపీ అధ్యక్షులు ఎవరనేది కూడా తేలిపోనుంది. లోక్‌సభ ఎన్నికల తర్వాత తెలంగాణ కాషాయ దళంలో కొంత స్తబ్ధత కనిపించింది. సభ్యత్వ నమోదుపై పార్టీ దృష్టి పెట్టడంతో.. మిగతా కార్యక్రమాలపై పెద్దగా ఫోకస్ చేయలేకపోయారట. నేతల మధ్య సమన్వయ లోపంతో క్యాడర్‌లో గందరగోళ పరిస్థితులు నెలకున్నాయనే వార్తలు వినిపించాయి. ఈ నేపథ్యంలో జాతీయ అధినాయకత్వం.. తెలంగాణ బీజేపీలో నెలకొన్న అయోమయ పరిస్థితులకు ఫుల్ స్టాఫ్ పెట్టాలని నిర్ణయం తీసుకుందట. బీజేపీ రాష్ట్ర సంస్థాగత ఇన్‌ఛార్జ్ సునీల్ బన్సల్.. రెండురోజుల పాటు తెలంగాణలో పర్యటించారు. పార్టీలో జరుగుతున్న పరిణామాలు, నేతల మధ్య సమన్వయంపై విడివిడిగా నేతలతో భేటీ అయ్యారు. ప్రజా ప్రతినిధులు, పార్టీ నేతలకు మధ్య గ్యాప్ ఎందుకొచ్చిందనే అంశాలపై బన్సల్ ఆరా తీసినట్లు సమాచారం.తమ నియోజకవర్గాల్లో పార్టీ నేతల తీరుతో ఎదురవుతున్న ఇబ్బందులను సునీల్ బన్సల్‌కు పార్టీ నేతలు, శ్రేణులు చెప్పుకున్నారట. వారంతా సమస్యలను బన్సల్ దృష్టికి తీసుకెళ్లారనే వార్తలు గుప్పుమంటున్నాయి. పార్టీ సిద్ధాంతం తెలిసిన వారిమని.. సీనియర్ అనే భావంతో కొందరు. కొత్తవారిని పార్టీలో తక్కువ చేసి చూస్తున్నారంటూ బన్సల్‌కు ఫిర్యాదు చేసినట్లు టాక్ నడుస్తోంది. సభ్యత్వ నమోదు జరుగుతున్న తీరుపైనా ప్రజాప్రతినిధులను.. పార్టీ రాష్ట్ర ఇంఛార్జ్ అడిగి తెలుసుకున్నారట. పార్టీ అంతర్గత వ్యవహారాలను మీడియా ముందు ఎవరూ ప్రస్తావించవద్దని.. సునీల్ బన్సల్ తెలంగాణ నేతలకు కఠినంగానే చెప్పినట్లు సమాచారం.మొత్తానికి తెలంగాణ బీజేపీ నేతలకు హైకమాండ్ బిగ్ టాస్క్ ఇచ్చినట్టేనని అంటున్నారు.

# రోడెక్కిన పోలీస్ కుటుంబాలు



కరీంనగర్, అక్టోబరు 26, రాజన్న సిరిసిల్ల జిల్లాలో పోలీస్ కానిస్టేబుల్ కుటుంబ సభ్యులు రోడ్డెక్కారు. పోలీస్ అధికారుల తీరు, ప్రభుత్వ విధానంపై మండిపడుతు ఆందోళనకు దిగారు. పోలీస్ డ్యూటీ పేరుతో వెట్టిచాకిరి చేయించుకుంటున్నారని ఆరోపించారు. ఇంటికి రాకుండా పని చేయడం ఇదేం పోలీస్ డ్యూటీలని ఆవేదన వ్యక్తం చేశారు. కానిస్టేబుల్ కుటుంబ సభ్యులు ఆందోళన కలకలం సృష్టించడంతో పోలీసులు ఆందోళనకు దిగినవారిని అదుపులోకి తీసుకుని వదిలేశారు.రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి పది కిలోమీటర్ల దూరంలో తెలంగాణ స్పెషల్ పోలీస్ 17వ బెటాలియన్ ఉంది. అందులో పని చేసే కానిస్టేబుళ్ళ భార్యలు, కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. 40 మంది కానిస్టేబుళ్ళ కుటుంబ సభ్యులు ఆకస్మాత్తుగా సిరిసిల్ల లోని అంబేద్కర్ చౌరస్తాకు చేరుకుని రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. డ్యూటీ పేరిట కూలీ పనులు, చెత్త ఏరడం, మట్టి పనులు చెపిస్తున్నారని ఆరోపించారు. పోలీస్ డ్యూటీకి మా భర్తలు చేస్తున్న పనికి సంబంధం లేదన్నారు. డ్యూటీ పేరుతో ఇంటికి రాకపోవడంతో కుటుంబాలు ఇబ్బందుల పాలవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పోలీసు ఉద్యోగం అంటే పెళ్ళి చేసుకున్నామని తీరా చూస్తే కూలీల కంటే అద్వానంగా పనిచేస్తున్నారని ఆవేధన చెందారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో ఒకే పోలీస్ విధానాన్ని అమలు చేస్తున్నారని ఆ విధానం ఇక్కడ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఒకే పోలీసు విధానం ఉండాలని కోరారు. న్యాయం జరిగే వరకు కదలబోమని భీష్మించారు.కానిస్టేబుళ్ళ కుటుంబ సభ్యుల ఆందోళనతో పోలీస్ అధికారులు ఆగమాగం అయ్యారు. వెంటనే ఆందోళనకారుల వద్దకు చేరుకుని సముదాయించే ప్రయత్నం చేశారు. అధికారులు ఎంత నచ్చజెప్పే ప్రయత్నం చేసిన వినలేదు. భార్యా పిల్లలను వదిలి కానిస్టేబుళ్ళ మాదిరిగానే అధికారులు పని చేస్తున్నారా? అని ప్రశ్నించారు. సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలి?. కానీ ఇలా రోడ్డెక్కి ఆందోళన చేయడం సరైన పద్ధతి కాదని అధికారులు సూచించినప్పటికీ కానిస్టేబుల్ భార్యలు కుటుంబ సభ్యులు ససేమిరా అంటు ఆందోళన చేశారు. చివరకు చేసేది ఏమీ లేక పోలీసులు ఆందోళనకు దిగిన కానిస్టేబుళ్ల భార్యలు కుటుంబ సభ్యులను అదుపులోకి తీసుకుని బెటాలియన్ కు తరలించారు. కౌన్సిలింగ్ ఇచ్చి పంపించేశారు.ఆందోళనకు దిగిన కానిస్టేబుల్ భార్య లు తీవ్ర ఆగ్రహం, ఆవేశంతో మాట్లాడారు. పోలీస్ ఉద్యోగం అంటే పెళ్ళి చేసుకున్నామని తెలిపారు. డ్యూటీ పేరుతో కూలీ పని చేస్తారని అనుకోలేదన్నారు. నిత్యం డ్యూటీ పేరుతో బెటాలియన్ లోనే ఉండడంతో ఇంట్లో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటికి రాకుండా పని చేయడంతో కుటుంబ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని తెలిపారు. అందరి సమస్యలు పరిష్కరించే పోలీసులు, పోలీస్ కుటుంబాల సమస్యలు పట్టవా? అని ప్రశ్నించారు. ఇప్పటికైనా వెట్టి చాకిరి చేయించడం మాని, ఒకే పోలీస్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిచో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.క్రమశిక్షణకు మారు పేరుగా నిలిచే పోలీసుల కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగడం కలకలం సృష్టించింది. కానిస్టేబుళ్ళ కుటుంబ సభ్యుల ఆందోళనతో పోలీస్ అధికారులు హైరానా కు గురయ్యారు. కుటుంబ సభ్యుల ఆరోపించిన వెట్టిచాకిరిపై ఉన్నతాధికారులు ఆరా తీశారు. అంతర్గతంగా జరిగే పనులు విషయం బహిర్గతం కావడంపై కానిస్టేబుళ్ళను సుతిమెత్తగా మందలించి ఇంకోసారి ఆందోళన దిగితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించినట్లు సమాచారం.

## రోడ్డు ప్రమాదంలో కుమారుడు మృతి, తండ్రికి గాయాలు

కడప వేంపల్లి సమీపంలోని మాలంక బ్రిడ్జి సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగింది. బుల్లెట్ వాహనంలో వెళుతున్న వెంకట రమణారెడ్డి, బాలగంగాధర్ రెడ్డి అనే తండ్రి కొడుకును ఇసుక ట్రాక్టర్ ఢీకొట్టింది. ఘటనలో కుమారుడు బాలగంగాధర్ రెడ్డి మృతి చెందాడు. వీరపు నాయుని పల్లి మండలం మొయిలచెరువు గ్రామానికి చెందిన వారిగా గుర్తించారు. గాయపడ్డ వెంకటరమణారెడ్డిని 108 లో వేంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# సినిమా





## సూర్య చెప్పిన 'బ్యాంకు లోన్' కథ



తమిళంలో టాప్ స్టార్లలో ఒకడు సూర్య. తెలుగులో కూడా ఆయనకు మంచి ఫాలోయింగ్, మార్కెట్ ఉన్నాయి. సూర్య తండ్రి శివకుమార్ కూడా నటుడే అయినా ఆయనది చిన్న స్థాయే.ఇలాంటి బ్యాగ్రౌండ్ నుంచి వచ్చి చాలా పెద్ద రేంజికి వెళ్లాడు సూర్య. అన్న బాటలో నటనలోకి అడుగు పెట్టిన కార్తి సైతం స్టార్‌గా ఎదిగాడు. ఐతే సూర్య సినిమాల్లోకి అడుగు పెట్టే సమయానికి ఆయన కుటుంబానిది సాధారణ జీవనమే. సూర్య వల్లే ఆర్థికంగానే కాక అన్ని రకాలుగా ఆ కుటుంబం స్థాయి పెరిగింది.ఐతే తాను నటుడిగా స్థిరపడిపోవాలని, హీరోగా ఎదిగిపోవాలని సినిమాల్లోకి రాలేదని అంటున్నాడు సూర్య. తన తల్లి తండ్రికి తెలియకుండా తీసుకున్న బ్యాంక్ లోన్ తీర్చాలన్న లక్ష్యంతోనే తాను సినిమాల్లోకి వచ్చినట్లు సూర్య తాజాగా ఆసక్తికర విషయం వెల్లడించాడు. "నేను చదువు ముగించిన వెంటనే ఓ గార్మెంట్స్ కంపెనీలో ఉద్యోగంలో చేరాను. మొదట 15 రోజులకు 750 రూపాయలు జీతంగా ఇచ్చారు. మూడేళ్ల తర్వాత నా జీతం 8 వేలకు పెరిగింది. ఒక రోజు నేను సొంతంగా కంపెనీ పెట్టాలని అనుకున్నా. కానీ నాన్న బాటలో ఇండస్ట్రీలోకి రావాలని మాత్రం అనుకోలేదు. ఐతే ఆ సమయంలో నాన్నకు తెలియకుండా అమ్మ 25 వేల రూపాయల బ్యాంక్ లోన్ తీసుకున్నట్లు నాకు చెప్పింది. ఆ లోన్ ఎలా తీర్చాలా అనుకుంటున్నపుడు ఓ సినిమాలో అవకాశం వచ్చింది. నేను ఇండస్ట్రీలోకి రావాలని, నటుడిగా ఎదగాలని కలలో కూడా అనుకోలేదు. మా అమ్మకు ఆ 25 వేలు ఇచ్చి, నీ లోన్ తీరిపోయింది అని చెప్పడానికి అదే మార్గం అనుకున్నాను. అలా నా కెరీర్ మొదలైంది.

## ఆ విషయంలో ఒత్తిడి లేదు..



హీరోయిన్‌గా అలరిస్తూనే నిర్మాతగానూ విజయం సాధించారు నటి కృతి సనన్. 'దో పత్తి' అనే చిత్రాన్ని నిర్మించి నిర్మాతగా తొలి హిట్‌ను అందుకున్నారు. తాజాగా ఆమె ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. హీరోయిన్స్ కాస్మోటిక్ సర్జరీలు చేయించుకోవడంపై తన అభిప్రాయాన్ని తెలియజేశారు. 'మహిళలు ఎప్పుడూ అందంగా కనిపించాలని వారిపై ఒత్తిడి తీసుకురాకూడదు. అందంగా కనిపించడం కోసం శరీరభాగాలకు సర్జరీలు చేయించుకొనే వారి విషయంలో నేను తీర్పు ఇవ్వలేను. అది పూర్తిగా వారి సొంత నిర్ణయం. శరీరంలో ఒక భాగంలో మార్పు వచ్చినంతమాత్రాన అందంగా కనిపిస్తామన్న నమ్మకం మీకు ఉంటే ఏమైనా చేయించుకోవచ్చు. మీరు తీసుకున్న నిర్ణయం వల్ల వచ్చే సమస్యలను కూడా మీరే ఎదుర్కోవాల్సి ఉంటుంది. మీ జీవితం, మీ ముఖం, నేను అలాంటి విషయాల్లో సలహాలు ఇవ్వను. నేను అందం విషయంలో ఎప్పుడూ ఒత్తిడికి గురికాలేదు. మానసికంగా ఆనందంగా ఉంటే అదే మన ముఖంలో కనిపిస్తుంది. అందుకే ఎప్పుడూ ప్రశాంతంగా ఉండడానికి ప్రయత్నిస్తా. నేను తీసుకునే ఫొటోలకు కూడా ఫిల్టర్లు ఉపయోగించను' అని చెప్పారు. కృతి సనన్ ప్రధాన పాత్రలో నటించి నిర్మించిన 'దో పత్తి' తాజాగా నెట్‌ఫ్లిక్స్ వేదికగా విడుదలై మంచి ప్రేక్షకాదరణను సొంతం చేసుకుంది. మిస్టరీ థ్రిల్లర్ నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రంలో కృతి ద్విపాత్రాభినయంలో కనిపించారు. శశాంక చతుర్వేది దర్శకత్వం వహించారు. కవలలైన అక్కా చెల్లెళ్ల గురించిన రహస్యాలను వెలికితీసే పోలీసు అధికారి పాత్రలో కాజోల్ నటించారు. 'బ్లూ బటర్ ఫ్లై ఫిల్మ్స్' పతాకంపై కృతి నిర్మించిన తొలి చిత్రమిది. షహీర్‌షేక్, తన్వీ అజ్మీ, బ్రిజేంద్ర కాలా కీలకపాత్రలు పోషించారు.

## భూల్ భులయ్యా వేసుకోండి..
## పుష్ప కటవుట్ అందుకోండి



పోటీ విపరీతంగా ఉన్నప్పుడు అపోజిషన్ ని తట్టుకోవడానికి రకరకాల ఎత్తుగడలు వేయాల్సి ఉంటుంది. అందులోనూ బాలీవుడ్ రిలీజ్ కోసం టాలీవుడ్ సినిమా సహాయం అవసరం పడిందంటే అంతకన్నా కిక్ ఏముంటుంది.వివరాల్లోకి వెళ్తే అంతగా ఏముందో అర్థమవుతుంది. నవంబర్ 1 సింగం అగైన్, భూల్ భులయ్యా 3 ఒకే రోజు విడుదలవుతున్న సంగతి తెలిసిందే. వీటికి థియేటర్ల పంపకం పెద్ద తలనెప్పిగా మారింది. అంచనాలు, హైప్ రెండింటికి ఒకే స్థాయిలో ఉండటంతో ఒకటి తక్కువ ఒకటి ఎక్కువ అని చెప్పడానికి లేకుండా పోయింది. అందుకే డిస్ట్రిబ్యూటర్ ఒక తెలివైన ఆలోచన చేశాడు. భూల్ భులయ్యా 3 హక్కులను ఏఏ ఫిలిమ్స్ తరఫున అనిల్ తదాని తీసుకున్నారు. తమ సినిమాకు సింగల్ స్క్రీన్లు ఇస్తే కనక డిసెంబర్ 5 విడుదల కాబోయే పుష్ప 2 ది రూల్ కటవుట్ ని ఉచితంగా ఇస్తానని ఆఫర్ చేస్తున్నారట. అలాని ఏదో ఆషామాషీగా కాదండోయ్. ఏకంగా 30 అడుగులు పొడవున్న అల్లు అర్జున్ బొమ్మ. దీంతో పలువురు ఎగ్జిబిటర్లు ఈ ఆఫర్ పట్ల ఆసక్తి చూపిస్తున్నారట. పుష్ప కున్న క్రేజ్ ని దృష్టిలో పెట్టుకుని కటవుట్ ఫ్రీగా వస్తుందంటే పబ్లిసిటీకి ఉపయోగపడటంతో పాటు థియేటర్ కు పెద్ద ఆకర్షణ తోడవుతుంది. పుష్ప 2 హిందీ హక్కులు సొంతం చేసుకున్న అనిల్ తదాని వేసిన మాస్టర్ ప్లాన్ ఇది. ఇదేదో బాగుంది కదూ. దీన్ని బట్టే పుష్ప మేనియా ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలతో సమానంగా ఉత్తరాదిలోనూ విపరీతమైన హైప్ తెచ్చుకున్న బన్నీ సినిమాకు కెజిఎఫ్, కాంతార, ఆర్ఆర్ఆర్ స్థాయిలో ఓపెనింగ్స్, వసూళ్లు వస్తాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

## మృణాల్ ఠాకూర్ లక్కు బాగుంది



తెలుగు ఎంట్రీని సీతారామం రూపంలో ఘనంగా జరుపుకున్న హీరోయిన్ మృణాల్ ఠాకూర్ కి ఆ తర్వాత హాయ్ నాన్న కూడా విజయం సాధించడం ఉత్సాహాన్ని రెట్టింపు చేసింది.ఇంకేం టాప్ లీగ్ లోకి వెళ్లిపోతుందనుకున్న టైంలో ది ఫ్యామిలీ స్టార్ ఇచ్చిన షాక్ మాములుగా కొట్టలేదు. దాని వల్లే కెరీర్ డౌన్ కాకపోయినా అవకాశాలు, మార్కెట్ మీద విజయ్ దేవరకొండ మూవీ ప్రభావం చూపించింది. నిజానికి కంగువలో సూర్య సరసన ముందు మృణాల్ నే అనుకున్నారట. అయితే డేట్ల విషయంలో వచ్చిన ఇబ్బంది వల్ల వదులుకోవాల్సి వస్తే ఆ ఛాన్స్ కాస్తా దిశా పటానిని వరించింది. తీరా చూస్తే కంగువలో తనుండేది చివరి ఇరవై నిముషాలు మాత్రమే అని తేలడంలో ఒకరకంగా మృణాల్ ఠాకూర్ నష్టపోయింది పెద్దగా లేదనే చెప్పాలి. అలాని సూర్యకు జోడి అయ్యే అవకాశం మిస్ కాలేదు. ఆర్జె బాలాజీ దర్శకత్వంలో సూర్య చేయబోయే ఫాంటసీ థ్రిల్లర్ లో మృణాల్ నే ఎంపిక చేసినట్టు లేటెస్ట్ అప్డేట్. ఇంకా అధికారిక ప్రకటన ఇవ్వలేదు కానీ త్వరలోనే అనౌన్స్ చేయొచ్చు. ప్రస్తుతం కంగువ ప్రమోషన్లలో బిజీగా ఉన్న సూర్య దీని థియేటర్ రన్ అయ్యాక కొత్త సినిమాల అప్డేట్స్ ఇవ్వాలని నిర్ణయించుకోవడంతో అభిమానులు ఇంకో నెల రోజులు ఆగాల్సి ఉంటుంది. ఇక తెలుగులో చూస్తే మృణాల్ కొత్తగా సైన్ చేసిన ప్రాజెక్టులు లేవు. హిందీలో మాత్రం చెప్పుకోదగ్గ బిజీగానే ఉంది. పూజా మేరీ జాన్, హై జవానీతో ఇష్క్ హోనా హై, సన్ అఫ్ సర్దార్ 2, తుమ్ ఓ హెూ వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయి.

## సాయిపల్లవి 'పీఆర్' వ్యాఖ్యలు వైరల్




బాలీవుడ్ హీరోయిన్ల పీఆర్ గిమ్మిక్స్ గురించి అప్పుడప్పుడూ వార్తలు బయటికి వస్తుంటాయి. వాళ్లు ఎయిర్ పోర్ట్‌లో అడుగు పెడితే చాలు సోషల్ మీడియాలో ఫొటోలు, వీడియోలు వైరల్ అయిపోతుంటాయి.తమకు తెలియకుండా ఇవి జరుగుతున్నట్లు కలరింగ్ ఇస్తుంటారు. కానీ ఇదంతా పీఆర్ టీమ్స్ మహిమ అని సౌత్ హీరోయిన్ ప్రియమణి గతంలో వెల్లడించింది. ఇందుకోసం ప్రత్యేకంగా ఫొటోగ్రాఫర్లను నియమించుకుని సదరు ఫొటోలు, వీడియోలు వైరల్ అయ్యేలా చూసుకుంటారని.. తనకు కూడా ఇలాంటి ఆఫర్లు ఇచ్చారని, కానీ అంగీకరించలేదని ప్రియమణి వెల్లడించింది. ఇప్పుడు సాయిపల్లవి కూడా ఇలాంటి కామెంట్స్ చేసి వార్తల్లో నిలిచింది. బాలీవుడ్ హీరోయిన్లు నిత్యం వార్తల్లో ఉండేందుకు పీఆర్ టీమ్స్ ద్వారా ఎలా ప్రయత్నిస్తారో ఆమె వెల్లడించింది. తన కొత్త చిత్రం 'అమరన్' ప్రమోషన్లలో భాగంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో సాయిపల్లవి మాట్లాడుతూ.. "బాలీవుడ్‌కు చెందిన ఓ వ్యక్తి ఇటీవల నాకు ఫోన్ చేశారు. నన్ను నేను ప్రమోట్ చేసుకోవడానికి, వార్తల్లో నిలవడానికి పీఆర్ టీంను నియమించుకుంటారా అని అడిగాడు. అలా చేస్తే నేను లైమ్ లైట్లో ఉండగలను. ప్రేక్షకులు తరచూ నా గురించి మాట్లాడుకుంటారు. కానీ దాని వల్ల నాకు ఎలాంటి ఉపయోగం లేదు అనిపించింది. ఎందుకంటే తరచూ నా గురించి మాట్లాడాలన్నా ప్రేక్షకుల విసుగు వస్తుంది. అందుకే నాకు అలాంటిదేమీ అవసరం లేదని చెప్పేశా" అని చెప్పింది.

## కొత్త ప్రపంచాన్ని చూపించే క..

హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న భారీ పీరియాడిక్ థ్రిల్లర్ నయన్ సారిక, తన్వీ రామ్ కథానాయికలు. చింతా వరలక్ష్మి సమర్పణలో శ్రీచక్రాస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్ పై చింతా గోపాలకృష్ణ రెడ్డి నిర్మిస్తున్నారు. దర్శక ద్వయం సుజీత్, సందీప్ దర్శకత్వం వహించిన ఈ సినిమా ఈ నెల 31న దీపావళి పండుగ సందర్భంగా తెలుగుతో పాటు తమిళ, మలయాళ, కన్నడలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. తాజాగా ఈ చిత్ర ట్రైలర్ రిలీజ్ ఈవెంట్‌ను ఘనంగా నిర్వహించారు. నిర్మాత చింతా గోపాలకృష్ణ రెడ్డి మాట్లాడుతూ, 'ట్రైలర్ మీకు నచ్చిందని నమ్ముతున్నాం. ట్రైలర్ ఎంత బాగుందో సినిమా అంతకంటే చాలా బాగుంటుంది' అని తెలిపారు. దర్శకుడు సుజీత్ మాట్లాడుతూ,'సినిమా ట్రైలర్‌కి నాలుగు రెట్లు పవర్ ఫుల్‌గా ఉంటుంది. కిరణ్‌ని ఇప్పటిదాకా చూడని విధంగా సరికొత్తగా చూపించబోతున్నాం' అని అన్నారు. హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ, 'చాలా కొత్త కంటెంట్‌తో సినిమా చేశాను.

## గేమ్ ఆడబోతున్న బాలయ్య-చరణ్



గత మూడు సీజన్లలో అన్ స్టాపబుల్ షో కోసం రామ్ చరణ్ వస్తాడేమోనని ఫ్యాన్స్ తెగ ఎదురు చూశారు కానీ జరగలేదు. ప్రభాస్ ఎపిసోడ్ లో ఫోన్ లో ఆప్యాయంగా మాట్లాడుకోవడం చూసి మురిసిపోయిన ప్రేక్షకులు సైతం ఈ కాంబోని కోరుకున్నారు.ఎన్టీఆర్ శతజయంతి వేడుకలో, బయట ప్రైవేట్ ఈవెంట్స్ లో బాలయ్య, చరణ్ ఎదురుపడినప్పుడు ఇద్దరి మధ్య జరిగే కెమిస్ట్రీ వీడియోల రూపంలో తెగ వైరల్ అయ్యింది. సో సహజంగానే ర్యాపో ఎక్కువ ఉందనేది అర్థమవుతుంది. ఆ క్షణం రానే వచ్చింది. బాక్సాఫీస్ బొనాంజా, మెగా పవర్ స్టార్ కలిసి పంచుకునే కబుర్ల కోసం రంగం సిద్ధమవుతోందని సమాచారం.షూటింగ్ ఎప్పుడనేది చెప్పలేదు కానీ త్వరలోనే శ్రీకారం చుట్టబోతున్నారు. జనవరి 10 గేమ్ చేంజర్ విడుదల కానున్న నేపథ్యంలో దాని ప్రమోషన్లకూ ఇది ఉపయోగపడుతుందనే ఉద్దేశంతో సరైన టైంలో ప్లాన్ చేసుకుంటున్నారు. అయితే సినిమా గురించి పక్కనపెడితే చరణ్ నుంచి బాలయ్య ఎలాంటి ప్రశ్నలకు సమాధానాలు రాబడతారోననేది ఆసక్తికరంగా మారింది. ఏపీ డిప్యూటీ సీఎం కం బాబాయ్ పవన్ కళ్యాణ్ గురించి, నాన్న చిరంజీవితో బాలకృష్ణకు ఉన్న అనుబంధం, రెండు కుటుంబాల మధ్య స్నేహం, కొత్త సినిమా కబుర్లు లాంటి బోలెడు విషయాలు ఈ ఇంటర్వ్యూలో ప్రస్తావనకు రాబోతున్నాయి. నవంబర్ లో వచ్చే అవకాశాలున్న ఈ స్పెషల్ ఎపిసోడ్ కు భారీ వ్యూస్ వస్తాయని చెప్పడంలో సందేహం అక్కర్లేదు. మాములుగానే తక్కువ మాట్లాడే చరణ్ అంత సీనియర్ బాలయ్య ముందు ఏ మేరకు ఓపెనవుతాడో చూడాలి.



# క్రీడలు



## సెమీస్‌లో భారత్-ఎకు షాక్



ఎమర్జింగ్ ఆసియా కప్ సెమీస్‌లో భారత్-ఎ జట్టు ఓటమిపాలైంది. ఆఫ్ఘనిస్తాన్-ఎతో శుక్రవారం జరిగిన సెమీస్‌లో భారత్-ఎ 20 పరుగుల తేడాతో పరాజయాన్ని చవిచూసింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ఆఫ్ఘనిస్తాన్ నిర్ణీత 20 ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 206పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేసింది. ఛేదనలో యువ భారత్ జట్టు నిర్ణీత 20 ఓవర్లు ముగిసేసరికి 7వికెట్లు కోల్పోయి 186పరుగులే చేయగల్గింది. ఆఫ్ఘనిస్తాన్ ఓపెనర్లు తొలి వికెట్‌కు 137పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పి టీమిండియాను కష్టాల్లో పడేశారు. భారత బౌలర్లలో అందరూ ధారాళంగా పరుగులు సమర్పించుకోగా.. రసిక్ సలామ్ ఒక్కడే 3 వికెట్లతో రాణించాడు. ఛేదనలో ఇండియా-ఎ బ్యాటర్లు నిరాశపరిచినా.. బడోనీ(31), రమణ్‌దీప్ సింగ్(64), నిషాంత్(23) ధాటిగా ఆడినా ప్రయోజనం లేకపోయింది. ఆఫ్ఘనిస్తాన్ బౌలర్లలో ఘజన్‌ఫర్, అబ్దుల్‌కు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ సెదికుల్లాహ్ అటల్‌కు దక్కింది. మరో సెమీస్‌లో శ్రీలంక జట్టు 7వికెట్ల తేడాతో పాకిస్తాన్-ఎపై ఘన విజయం సాధించింది. తొలుత పాకిస్తాన్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 135పరుగులు చేయగా.. శ్రీలంక జట్టు 16.3ఓవర్లలో 3వికెట్ల నష్టానికి 137పరుగులు చేసి గెలిచింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ దుషాన్ హేమంతకు దక్కింది. ఆదివారం జరిగే ఫైనల్లో ఆఫ్ఘనిస్తాన్-శ్రీలంక జట్లు టైటిల్‌కై తలపడనున్నాయి. ఆఫ్ఘన్ ఓపెనర్లు సెదికుల్లాహ్ అటల్(83), జుబైద్ అక్బరీ(64) అర్ధసెంచరీ లతో కదం తొక్కారు. తొలి ఓవర్ నుంచే భారత బౌలర్లపై ఎదురుదాడికి దిగిన వీరు తొలి వికెట్‌కు 14.1ఓవర్లలో 137పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. జుబైద్ 41బంతుల్లో 5ఫోర్లు, 4సిక్సర్ల సాయంతో 64పరుగులు చేయగా.. సెదికుల్లాహ్(83బీ 52బంతుల్లో 7ఫోర్లు, 4సిక్సర్లు) ఆకాశమే హద్దుగా చెలరేగి ఆడాడు. ఈ టోర్నమెంట్‌లో ఒక వికెట్‌కు ఇదే అత్యుత్తమ భాగసామ్యం. భారత కెప్టెన్ తిలక్ వర్మ ఎన్ని ప్రయత్నాలు చేసినా ఈ ఇద్దరూ బౌండరీలు, సిక్సర్లతో విరుచుకుపడ్డారు.

## టీమిండియా టార్గెట్ 359..



పూణెలో జరుగుతున్న రెండో టెస్టు మ్యాచ్‌లో మూడో రోజు న్యూజిలాండ్ ఆలౌట్ అయింది. దీంతో న్యూజిలాండ్ జట్టును భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 255 పరుగులకే పరిమితం చేసింది. ఈ క్రమంలో 359 పరుగుల టార్గెట్‌తో టీమిండియా బరిలోకి దిగింది. భారత్ తరపున తొలి ఇన్నింగ్స్‌లో ఏడు వికెట్లు తీసిన వాషింగ్టన్ సుందర్ రెండో ఇన్నింగ్స్‌లో నాలుగు వికెట్లు పడగొట్టాడు. సుందర్‌తో పాటు అశ్విన్ (2 వికెట్లు), జడేజా (3 వికెట్లు) కూడా అద్భుతమైన బౌలింగ్‌ను ప్రదర్శించారు. పూణె మూడో టెస్టు మ్యాచ్‌లో న్యూజిలాండ్ 5 వికెట్ల నష్టానికి 198 పరుగులు చేసింది. ముందుగా మూడో రోజు టామ్ బ్లండెల్ (41 పరుగులు)ను క్లీన్ బౌల్డ్ చేసి వికెట్లు తీసే ప్రక్రియను జడేజా ప్రారంభించాడు. ఆ తర్వాత అశ్విన్, జడేజా, సుందర్‌ల స్పిన్ త్రయం మిగతా బ్యాట్స్‌మెన్‌లను నిలదొక్కుకోనివ్వలేదు. దీంతో న్యూజిలాండ్ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 69.4 ఓవర్లలో 255 పరుగులు మాత్రమే చేయగలిగింది. కాగా, భారత్ తరపున వాషింగ్టన్ సుందర్ రెండో ఇన్నింగ్స్‌లో అత్యధికంగా నాలుగు వికెట్లు పడగొట్టాడు. అంతకుముందు మ్యాచ్‌లో వాషింగ్టన్ సుందర్ ఏడు వికెట్లు పడగొట్టినప్పటికీ న్యూజిలాండ్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 259 పరుగులు చేసింది. ఆ తర్వాత, న్యూజిలాండ్‌కు చెందిన మిచెల్ సాంట్నర్ స్పిన్ మాయాజాలంతో ఏడు వికెట్లు పడగొట్టాడు. దీంతో టీమిండియా తొలి ఇన్నింగ్స్‌లో 156 పరుగులకు ఆలౌటైంది. భారత్ తరపున తొలి ఇన్నింగ్స్‌లో రవీంద్ర జడేజా మాత్రమే అత్యధికంగా 38 పరుగులు చేయగలిగాడు. దీంతో టీమిండియా 103 పరుగులకే వెనుదిరిగింది. ఇప్పుడు భారత్ విజయాన్ని నమోదు చేయాలంటే పుణె టర్నింగ్ ట్రాక్‌లో 359 పరుగుల లక్ష్యాన్ని సాధించాల్సి ఉంటుంది.

## ఇప్పటికైనా పూజారను జట్టులోకి తీసుకోండి..



ఇప్పటికే బెంగళూరు టెస్ట్ ను ఎనిమిది వికెట్ల తేడాతో భారత్ ఓడిపోయింది. దీంతో పూణే వేదికగా జరుగుతున్న రెండో టెస్టులో ఎలాగైనా గెలవాల్సిన పరిస్థితి భారత జట్టు ది. ఈ టెస్ట్ లో గెలిస్తేనే సిరీస్ పై ఆశలుంటాయి. లేకుంటే టీమిండియా ఇబ్బంది పడాల్సి ఉంటుంది. పైగా వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్ ముందు టీమిండియాకు రెండవ టెస్టులో గెలుపు అత్యంత అవసరం. అయితే ఆ దిశగా టీమిండియా ఆట తీరును ప్రదర్శించడం లేదు. పైగా పూణే టెస్టులోనూ బెంగళూరు లో మాదిరిగానే ఆడుతోంది. దీంతో రోహితసేనపై అభిమానులు మండిపడుతున్నారు.. ఈ క్రమంలో సోషల్ మీడియా వేదికగా సరికొత్త డిమాండ్ ను తెరపైకి తీసుకొస్తున్నారు.. టాప్ ఆర్డర్ విఫలమవుతున్న నేపథ్యంలో టీమిండియా ఒకప్పటి డిపెండబుల్ ఆటగాడు చటేశ్వర్ పూజారను జట్టులోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ పూణే టెస్టులో అత్యంత దారుణమైన ఆట తీరు ప్రదర్శించారు. దీంతో వారిపై అభిమానులు మండిపడుతున్నారు. రంజీల్లో పూజార అదరగొడుతున్నాడని.. అతడిని జట్టులోకి తీసుకురావాలని సెలెక్టర్లకు సోషల్ మీడియా వేదికగా విన్నవిస్తున్నారు. మాకు పూజార కచ్చితంగా కావాలి. ఆస్ట్రేలియా మైదానాలపై వైట్ బాల్ ఆడేవారు అంతగా రాణించలేరు. సీమ్ కు ఉపకరించే మైదానాలపై రోహిత్ శర్మ పెద్దగా బ్యాటింగ్ చేయలేడు. సీనియర్ ఆటగాళ్లను దేశీయ క్రికెట్ ఆడేలా చేయాలి.. అప్పుడే జట్టు బాగుపడుతుంది.. ఇటీవలి రంజి క్రికెట్ లో కోహ్లీ, రోహిత్, బుమ్రా కు విశ్రాంతి ఇచ్చారు. కానీ వారేమో బంగ్లాదేశ్, న్యూజిలాండ్ జట్లపై తేలిపోయారు. మిగతావారు ఆటడం వల్లే బంగ్లాదేశ్ పై భారత్ గెలిచింది.. అవసరమైన సమయంలో వారు ఆడక పోవడం వల్ల న్యూజిలాండ్ పై ఓటమిపాలైంది. పూణే టెస్టులో భారత్ ఇప్పటికే కష్టాల్లో ఉంది. రోహిత్, విరాట్ రెండవ ఇన్నింగ్స్ లో సత్తా చాటాల్సి ఉంది. లేకపోతే ఇక్కడ కూడా ఓటమి తప్పదని" అభిమానులు వ్యాఖ్యానిస్తున్నారు.." ఒక మ్యాచ్ లో పేస్ బౌలింగ్ కు దాసోహమయ్యారు. మరో మ్యాచ్ లో స్పిన్ బౌలింగ్ కు చేతులెత్తేశారు. దీనిపై ఎలాంటి సాకులు చెప్పినా అతకవు.. సరిగ్గా ఏడు సంవత్సరాల క్రితం తోనే వేదికగా ఆస్ట్రేలియా జట్టుతో జరిగిన మ్యాచ్లో భారత్ పై స్టీవ్ ఒకిఫ్ ఆరు వికెట్లు సాధించాడు. మళ్లీ ఏడు సంవత్సరాల తర్వాత న్యూజిలాండ్ బౌలర్ సాంట్నర్ 7 వికెట్లు తీశాడు. భారత మైదానంపై విదేశీ ఆటగాళ్లు రాణిస్తుంటే మనవాళ్లు పెవిలియన్ వెళ్లడానికి పోటీ పడుతున్నారని" అభిమానులు సామాజిక మాధ్యమాలలో మండిపడుతున్నారు.

## 3 ఏళ్ల తర్వాత తొలి సిరీస్ గెలిచిన పాక్




ముల్తాన్‌లో జరిగిన తొలి టెస్టు మ్యాచ్‌లో ఓడిపోయిన పాకిస్థాన్, ఇంగ్లండ్‌తో టెస్టు జట్టులో పెద్ద మార్పు చేసింది. తొలి టెస్టులో ఓడిపోయిన పాకిస్థాన్ జట్టు మేనేజ్‌మెంట్ సాజిద్ ఖాన్ (10 వికెట్లు), నోమన్ అలీ (9 వికెట్లు) రూపంలో ఇద్దరు స్పిన్నర్లను జట్టులో చేర్చుకుంది. ఈ ఇద్దరు స్పిన్నర్లు కలిసి ఇంగ్లీష్ బేస్‌బాల్‌ను నాశనం చేశారు. రావల్పిండి టెస్టు మ్యాచ్ మూడో రోజు సాజిద్ ఖాన్, నోమన్ అలీ కలిసి ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌ను 112 పరుగులకు కుదించారు. దీంతో 36 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన పాకిస్థాన్ 9 వికెట్ల తేడాతో సులువుగా గెలిచింది. దీంతో మూడు టెస్టుల సిరీస్‌ని 2-1 తేడాతో కైవసం చేసుకున్న పాకిస్థాన్ 2005-06 తర్వాత స్వదేశంలో ఇంగ్లండ్‌ను ఓడించడం ఇదే తొలిసారి. మూడో టెస్టులో సాజిద్ 10 వికెట్లు, నోమన్ అలీ 9 వికెట్లు తీశారు. నిజానికి ఇంగ్లండ్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 77 పరుగుల వెనుకంజలో ఉంది. దీంతో రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఇంగ్లండ్ 24 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయింది. ఆ తర్వాత మూడో రోజు కూడా ఇంగ్లండ్ వికెట్ల పతనం ఆగలేదు, సాజిద్, నోమన్ కలిసి తమ రెండో ఇన్నింగ్స్‌ను కేవలం 112 పరుగులకే కుదించారు. దీంతో పాకిస్థాన్‌కు కేవలం 36 పరుగుల విజయలక్ష్యం లభించింది. 36 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన పాక్ ఓపెనర్ సామ్ అయూబ్ (5) తొందరగానే నిష్క్రమించాడు. దీంతో పాటు పాక్ కెప్టెన్ షాన్ మసూద్ కేవలం ఆరు బంతుల్లో 23 పరుగులు చేసి 3.1 ఓవర్లలో 9 వికెట్ల తేడాతో జట్టును గెలిపించాడు. తద్వారా మూడేళ్ల తర్వాత పాకిస్థాన్ తొలి టెస్టు సిరీస్‌ను కైవసం చేసుకుంది. 18 ఏళ్ల తర్వాత స్వదేశంలో ఇంగ్లండ్ జట్టు ఓటమి పాలైంది. ఇంగ్లండ్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 267 పరుగులు మాత్రమే చేయగలిగింది. పాకిస్థాన్ తరపున సౌద్ షకీల్ 223 బంతుల్లో 5 ఫోర్లతో 134 పరుగులు చేశాడు. షకీల్ ఇన్నింగ్స్‌తో పాకిస్థాన్ తొలి ఇన్నింగ్స్‌లో 344 పరుగులు చేసి 77 పరుగుల ఆధిక్యం సాధించి ఇంగ్లండ్‌ను వెనక్కు నెట్టింది.

## బోర్డర్- గవాస్కర్ ట్రోఫీలో ఆస్ట్రేలియాతో తలపడే భారత జట్టు



తెలుగు కుర్రాడు నితీష్ కుమార్ రెడ్డికి బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో ఆడే అవకాశం లభించింది. టెస్ట్ క్రికెట్లో అతనికి చోటు లభించడం ఇదే ప్రథమం. ఇటీవల బంగ్లాదేశ్ తో భారత్ టి20 సిరీస్ ఆడింది. ఇందులో నితీష్ కుమార్ రెడ్డి ఆడాడు. అద్భుతమైన ప్రదర్శన చేసి అలరించాడు. అతడు స్థిరంగా ఆడుతుండడంతో టెస్ట్ జట్టులోకి అవకాశాన్ని అందుకున్నాడు. నితీష్ కుమార్ రెడ్డి ప్రస్తుతం ఆస్ట్రేలియాకు వెళ్లిపోయాడు. భారత్- ఏ జట్టుతో కలిసి అతడు కంగారు దేశంలో ఆడ ఎందుకు వెళ్లిపోయాడు. ఇక రంజి క్రికెట్లో స్థిరమైన ప్రదర్శన చేస్తున్న అభిమన్యు ఈశ్వరన్ కు కూడా జట్టులో చోటు లభించింది. యువ ఆటగాళ్లు ప్రసిద్ధ్ కృష్ణ, హర్షిత్ రాణా కు తొలిసారి టెస్ట్ జట్టులో అవకాశం లభించింది. న్యూజిలాండ్ జట్టుతో ప్రస్తుతం టెస్ట్ సీరీసాడుతున్న కులదీప్ యాదవ్, అక్షర్ పటేల్ కు ఆస్ట్రేలియా సిరీస్ లో అవకాశం లభించలేదు. గాయం నుంచి కోలుకున్నప్పటికీ మహమ్మద్ సిరాజ్ కు అవకాశం దక్కలేదు.. అంతేకాదు న్యూజిలాండ్ జట్టుపై సంచలన ప్రదర్శన చేస్తున్న వాషింగ్టన్ సుందర్ ఆస్ట్రేలియా సిరీస్ కు ఎంపిక అయ్యాడు. అయితే కులదీప్ యాదవ్ గజ్జల్లో గాయంతో బాధపడుతున్న నేపథ్యంలో అతడికి అవకాశం ఇవ్వలేదని బిసిసిఐ పేర్కొంది. ముఖేష్ కుమార్, నవదీప్ షైనీ, ఖలీల్ అహ్మద్ రిజర్వ్ ప్లేయర్ లుగా ఎంపికయ్యారు. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ నంబర్ 22 నుంచి వచ్చే ఏడాది జనవరి 3 వరకు జరుగుతుంది. టీమిండియా – ఆస్ట్రేలియా ఐదు టెస్టులు ఆడుతుంది. రోహిత్ శర్మ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, బుమ్రా, అభిమన్యు ఈశ్వరన్, గిల్, కేఎల్ రాహుల్, విరాట్ కోహ్లీ, సర్ఫరాజ్ ఖాన్, ధృవ్ జురెల్, రిషబ్ పంత్, రవీంద్ర జడేజా, మహమ్మద్ సిరాజ్, రవిచంద్రన్ అశ్విన్, ప్రసిద్ కృష్ణ, ఆకాశ్ దీప్, హర్షిత్ రాణా, నితీష్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ తో పాటు అంతకుముందు సౌత్ ఆఫ్రికాలో జరిగే టి20 సిరీస్ కు కూడా బీసీసీఐ భారత జట్టును ప్రకటించింది. సూర్య కుమార్ యాదవ్ నాయకత్వంలో టీ20 జట్టును బీసీసీఐ ఎంపిక చేసింది. ఈ జట్టులో యువ ఆటగాడు తిలక్ వర్మకు చోటు దక్కింది. సంజు శాంసన్, అభిషేక్ శర్మ, జితేష్ శర్మ, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్ కు జట్టులో స్థానం లభించింది. నవంబర్ 8 నుంచి 15 వరకు భారత్ దక్షిణాఫ్రికాలో పర్యటిస్తుంది.

# ఎస్.సి.ఎస్.సి ద్వారా సేవలందిస్తూన్న సభ్యులకు సన్మానం





**రాజేంద్ర నగర్ ప్రజా బలం ప్రతినిధి 26 అక్టోబరు 2024** సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ (ఎస్.సి.ఎస్.సి) 2006 లో లాభా పేక్షలేని, శాంతి భద్రతతో కూడిన రక్షణ ఆశ్రయ సంస్థగా స్థాపించడమైనదనీ ఇట్టి సంస్థ ద్వారా ప్రజలందరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించే విధముగా, ముఖ్య కూడలి లలో ట్రాఫిక్ నియంత్రణను కట్టుబడి చేస్తూ ప్రజా సేవలందిస్తూన్న సంస్థ సభ్యులు ట్రాఫిక్ పోలీసులకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తూ, ట్రాఫిక్ వారోత్సవాలలో తోడ్పడుతూ, పాఠశాల ఉపాధ్యాయుల అనుమతులతో పిల్లలకు ట్రాఫిక్ అవేర్నెస్ ప్రోగ్రామ్లు తీసుకోవడంలో తోడ్పడుతు మున్ ముందుకు సాగుతున్న నేపథ్యంలో ప్రజా ప్రయోజన కార్యక్రమ నిర్వహణ సేవలో భాగంగా ట్రాఫిక్ సేఫ్టీ రోడ్డు మేనేజ్మెంట్ చర్యల్లో ముందుంటున్న సంస్థ ట్రాఫిక్ వాలంటీర్లను సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో దాదాపు 160 మందినీ ఎంపిక చేసి వారిని సాదరంగా సగౌరవముగా ట్రాఫిక్ విభాగపు జాయింట్ కమిషనర్ జోయల్ డెవిస్, ట్రాఫిక్ ఫోరం ప్రధాన కార్యదర్శి రమేష్ ఖాజా, జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్, స్థానిక ఇన్చార్జి కేశవ్, నవీద్ ఖాన్, బాలరాజు, డాక్టర్ చిన్నాలు కలసి చిరు బహుమతులను అంద జేయడంతో పాటు సన్మానించడ మైనదనీ అందరితో పాటు ఫోరం సభ్యులుగా, సేవా దృక్పథంతో వీ ఆర్ 4 సహయోగ చారిటబుల్ ట్రస్టును కొనసాగిస్తున్న అందె లక్ష్మణ్ రావు, దిలీప్ కక్కడ్ తది తరులకు కూడా అభినందన పత్రాలు అందజేయడ మైనదనీ ట్రాఫిక్ ఫోరం సొసైటీలో కీలక వ్యక్తి జాయింట్ సెక్రటరీ సీ.ఆర్ శ్రీనివాస్ తెలియ పరచినారు.




# ది సిటీజెన్స్ కౌన్సిల్ ప్రజాభిప్రాయ సమస్యల సేకరణ










**రాజేంద్ర నగర్ ప్రజా బలం ప్రతినిధి 26 అక్టోబరు 2024** ది సిటీజెన్స్ కౌన్సిల్ ఆద్వర్యంలో మణికొండ కౌన్సిల్ అంతర్భాగమైన వేంకటేశ్వర కాలనీ మునిసిపల్ పార్క్ నందు ప్రజలు ఎదుర్కుంటున్న సమస్యల ప్రజాభిప్రాయ సేకరణతో పాటు నివారణ చర్యలు తీసుకోవడానికి అవలంభించల్సిన విధి విధానాలపై సంపూర్ణ అవగాహన సదస్సు నిర్వహించడ మైనదని అందులో స్థానిక కౌన్సిలర్ బిట్లు పద్మారావు, కౌన్సిల్ ఉపాధ్యక్షుడు అందె లక్ష్మణ్ రావు, ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఆరిఫ్ మొహమ్మద్, ఉప కార్యదర్శి ఉపేంద్రనాథ్ రెడ్డి, కమిటీ సభ్యులు రాంసుబ్బా రెడ్డి, శ్రీధర్, వివిధ కాలనీల నుండి విచ్చేసిన ప్రజలు ప్రత్యేకముగా శ్రీ వేంకటేశ్వర కాలనీ, పయనీర్ ఎస్టేట్, ఈవీవీ కాలనీ, ఫెయిర్ఫీల్డ్స్ కాలనీ, స్పెక్ట్రమ్ విల్లాస్, హ్యాపీ హెూమ్స్ కాలనీ, గోల్డాన్ వ్యూ కాలనీ, గోల్కొండ హిల్స్ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కాలనీ అసోసియేషన్ సభ్యులు, ప్రముఖ మైనారిటీ పెద్దలు, మస్జిద్-ఎ-హాలీమా మౌలానా మరియు కమిటీ సభ్యులు పాల్గొని చర్చల్లో భాగంగా వీధి దీపాలు,. దోమల, కుక్కల బెడద, స్పీడ్ బ్రేకర్లు, జంగిల్ కట్టింగ్, రహదారి ప్యాచ్ వర్క్, పార్కుల నిర్వహణ తది తర అవసరాలపై తీవ్రంగా చర్చ జరిగిందని, చర్చించిన విషయాలపై అందరి సహకారంతో వివిధ సర్కారు అధికారులను కలసి ముందుకు వెళ్ళి సమస్యల పరిష్కార దిశగా నివారణ చేయడానికి పునుకొంటామని ది సిటీజెన్స్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు అందె లక్ష్మణ్ రావు తెలియ చేసినారు.

## ఈతల పోటీలలో మెడల్స్ సాధించిన మొహమ్మద్ యూనస్కు సన్మానం.







**రాజేంద్ర నగర్ ప్రజా బలం ప్రతినిధి 26 అక్టోబరు 2024** మణికొండ వేంకటేశ్వర కాలనీ పార్కో స్థానిక కౌన్సిలర్ బిట్లు పద్మారావు, ది సిటీజెన్స్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు అందె లక్ష్మణ్ రావు, కార్యదర్శి సయ్యద్ ఆరిఫ్ మొహమ్మద్, ఉప కార్యదర్శి ఉపేంద్రనాథ్ రెడ్డి, కమిటీ సభ్యులు రాంసుబ్బా రెడ్డి, శ్రీధర్ లు స్థానిక ప్రజా సమస్యలపై ప్రజాభిప్రాయ సేకరణ, నివారణ చర్యలపై అవలంభించల్సిన విధి విధానాల గురించి మీటింగ్ నిర్వహించడమైనదని విచ్చేసిన ప్రజలు రహదారి ప్యాచ్ వర్క్, పార్కుల నిర్వహణ, వీధి దీపాలు, దోమల, కుక్కల బెడద, స్పీడ్ బ్రేకర్లు, చెట్ల కట్టింగ్ ల పై చర్చనంతరం 9వ తెలంగాణ ఈతల పోటీలలో 100 మీటర్ల పోటీలో స్వర్ణ మెడల్, 400 మరియు 200 మీటర్ల పోటీలలో వెండి మెడల్లు, 100 మీటర్ల పోటీలో కాంస్య మెడల్ సాధించిన స్థానిక నివాసి మొహమ్మద్ యూనస్ ను గౌరవముగా అభినందించి ఇతోచిత సత్కారం చేయడమైనదని ది సిటీజెన్స్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు అందె లక్ష్మణ్ రావు తెలియ పరచినారు.

## ఈ నెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి మందమర్రి ప్రభుత్వ ఐ.టి.ఐ. కళాశాల ప్రిన్సిపల్ జి.దేవానంద్

ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి 26 : ఆగస్టు-2024 సెక్షన్ కొరకు ఎన్.సి.వి.టి. ప్యాట్రన్ క్రింద వివిధ ఇంజనీరింగ్,నాన్-ఇంజనీరింగ్ ట్రేడ్స్లో శిక్షణ పొందేందుకు అభ్యర్థులు ఈ నెల 30వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని మందమర్రి ప్రభుత్వ ఐ.టి.ఐ.కళాశాల ప్రిన్సిపల్ జి.దేవానంద్ ఒక ప్రకటనలో తెలిపారు. మందమర్రి ప్రభుత్వ ఐ.టి.ఐ.ఎ.టి.సి.లలో 7వ దఫా అడ్మిషన్లకు ఆన్లైన్లో దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని, అభ్యర్థులు %https://iti.telangana.gov.in% వెబ్సైట్ ద్వారా తమ నిజ ధృవపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని, ఆన్లైన్లో దరఖాస్తు చేసే సమయంలో పేరు, తండ్రి పేరు, తల్లి పేరు,పుట్టిన తేది ఇతర వివరాలను ఎస్.ఎస్.సి. మెమో ఆధారంగా నమోదు చేయాలని,ఒకసారి ఆన్లైన్ దరఖాస్తు చేసి సీటు పొందిన తరువాత ఎలాంటి మార్పులు,చేర్పులకు అవకాశం ఉండదని, మొబైల్ నంబర్, ఈ-మెయిల్ అడ్రస్లు సంబంధిత అభ్యర్థివి మాత్రమే నమోదు చేయాలని తెలిపారు. డ్రాఫ్ట్ మెన్ సివిల్ ట్రేడ్లో 13 ఖాళీలు, బేసిక్ డిసైనర్ అండ్ వర్చువల్ వెరిఫైయర్ (మెకానికల్-ఎ.టి.సి.) ట్రేడ్లో 14 ఖాళీలు ఉన్నాయని, ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# పెంటలో పోయే చేపల వ్యర్థాన్ని సేంద్రియ ఎరువుగా తయారు చేసి మత్స్య సహకార సంఘాలకు ఆర్థికంగా బలోపేతం

## తెలంగాణ ఫిషరీ సోసైటీ రాష్ట్ర అధ్యక్షుడు పిట్టలు రవీందర్



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి అక్టోబర్ 26 :** పెంటలో పోయే చేపల వ్యర్థాన్ని సేంద్రియ ఎరువుగా తయారు చేసి మత్స్య సహకార సంఘాలకు ఆర్థికంగా బలోపేతం చేయడానికి ఈ ప్రయోగాన్ని చేసామని తెలంగాణా ఫిషరీ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు పిట్టల రవీందర్ శనివారం అన్నారు.మహానగరం మంచిర్యాల పరిధిలోని ఇందారం గ్రామంలో గల మహిళా మత్స్య సహకార సంఘం ద్వారా ప్రకృతి పర్యావరణ సంస్థ ఆధ్వర్యంలో చేపల వ్యర్థ్యాలతో సేంద్రియ ఎరువుల తయారీ పై ప్రయోగాన్ని చేయడం జరిగినది.ఈ కార్యక్రమానికి అతిథిగా పిట్టల రవీందర్ పాల్గొని వారు మాట్లాడుతూ...దేశంలోనే మొట్ట మొదటి సారిగా ఈ సాహసాన్ని మంచిర్యాల జిల్లా లోని మత్స్య సహకార సంఘాలు చేసాయి అని అన్నారు,చేపల వ్యర్థాలు అంటేనే పనికి రాని దుర్వాసన కలిగినవి అని అభిప్రాయం ఉంటుందని, అలాంటి దూర్వాసన కలిగిన వ్యర్థాలను పంట పొలాలకు ఉపయోగించే సేంద్రియ ఎరువులుగా మార్చుకోవచ్చు అని ఆయన తెలిపారు, ఇందారం గ్రామం మహిళా మత్స్య సహకార సంఘం మొక్కవోని దీక్షతో 40 రోజుల పాటు చేపల వ్యర్థాలతో చేసిన ప్రయోగంలో వీరి పాత్ర గొప్పదని కొనియాడారు. ఈ ప్రయోగం ద్వారా భవిష్యత్ తరాల మత్స్యకారులు ఆర్థికంగా బలోపేతం అయ్యే అవకాశం ఉందని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రకృతి పర్యావరణ సంస్థ కో-ఆర్డినేటర్ తాళ్లపల్లి కిరణ్,బోయిని శివకుమార్, ఇందారం మహిళా మత్స్య సహకార సంఘం అధ్యక్షురాలు తోగరి లలిత,సభ్యులు పాల్గొన్నారు.

## ఉప ము ఖ్యమంత్రి మల్లు భట్టిని కలిసిన కెసి వేణుగోపాల్

హైదరాబాద్ అక్టోబర్ 26 ఏఐసిసి జనరల్ సెక్రటరీ (ఆర్గనైజేషన్) కెసి వేణుగోపాల్ను ఆయన నివాసంలో ఉప ము ఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ అసెం బ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాం గ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఇచ్చిన హా మీ మేరకు, కులగణనను తెలంగాణ నుం చే ప్రారంభిస్తామన్న హామీని అమల్లోకి తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కెసి వేణుగోపాల్కు వివరించారు.

## శ్రీశైలం జలాశయానికి వరద నీరు.. 2 గేట్లు ఎత్తివేత

శ్రీశైలం అక్టోబర్ 26 శ్రీశైలం జలాశయానికి వరద నీరు కొనసాగుతోంది. దీంతో అధికారులు, ప్రాజెక్టు 2 గేట్లు 10 అడుగులు మేర ఎత్తివేత నీటిని కిందకు వదులుతున్నారు. జలాశయానికి ఇన్ ఫ్లో 1,17,326 క్యూసెక్కులు ఉండగా.. ఔట్ ఫ్లో 1,22,874 క్యూసెక్కులుగా ఉంది. ఇక, ఈ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా.. ప్రస్తుత నీటిమట్టం 884 అడుగులకు చేరుకుంది. మరోవైపు, కుడి, ఎడమ జల విద్యుత్ కేంద్రాలలో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతున్నది.

## పెండింగ్ లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్ విడుదల చేయాలి

### గజ్జెల శ్రీకాంత్ ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి




జమ్మికుంట ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 26మ్మికుంట ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో తహసిల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. పెండింగ్ ఉన్న బకాయిలను విడుదల చేయాలని జమ్మికుంట తహసిల్దార్ గట్ల రమేష్ బాబు కు వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్లో స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ లు పెండింగ్ లో ఉన్నాయి అని తెలియజేశారు. వాటిపైన ఇంతవరకు కూడా నూతన ప్రభుత్వం చర్చ పెట్టిన దాఖలాలే లేవు గత కొన్ని రోజుల ముందు డిగ్రీ కళాశాల యజమాన్యాలు కళాశాలలకు బంద్ చేసి ధర్నా నిర్వహిస్తే కొంత విడుదల చేస్తానని హామీ ఇచ్చారు దానిని ఇంతవరకు అమలు చేయకపోగా కనీసం ఆ అంశంపై చర్చ కూడా పెట్టలేని పరిస్థితి ఉంది. విద్యార్థులు కళాశాల యజమాన్యాలు అనేక ఇబ్బందులు పడుతున్న కానీ కాంగ్రెస్ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు కావున తక్షణమే పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్, ఫీజు రిబర్స్మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల రానున్న రోజుల్లో మంత్రుల ఎమ్మెల్యేల కార్యాలయాలు ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు కలకోట అఖిల్ సందేశ్ సిద్దిక్, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థుల ఏకాగ్రతపై ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార ప్రభావం

- పాఠశాల తరగతులు నడుస్తున్న విద్యార్థులకు ఇబ్బందికరంగా ప్రచారం
- అభ్యర్థులకు వత్తాసు పలుకుతున్న పాఠశాల యాజమాన్యం

జమ్మికుంట ప్రజా బలం ప్రతినిధి అక్టోబర్ 26 కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో ఎమ్మెల్సీ బరిలో నిలిచే అభ్యర్థులు కాదేది ప్రచారానికి అనర్హం అనే విధంగా దూసుకుపోతున్నారు. గత కొన్ని రోజులుగా జమ్మికుంట పట్టణం లోని పలు ప్రైవేటు పాఠశాలలో తరగతుల నడుస్తున్న సమయంలో పాఠశాలలకు వచ్చి ఉపాధ్యాయులతో ఎమ్మెల్సీ ఓటు కొరకు జోరుగా ప్రచారాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఏకాగ్రత కోల్పోతున్నారు. ఇలాంటి ప్రచారాలను పాఠశాల పని దినాల్లో కాకుండా పాఠశాల సెలవు రోజుల్లో పెట్టాలని చెప్పాల్సింది పోయి వారికే మద్దతు పలుకుతున్నారు. పాఠశాల యాజమన్యాలు అభ్యర్థులకు వత్తాసు పలుకుతూ విద్యార్థులను ఉపాధ్యాయులను గందరగోళానికి గురిచేస్తున్నారు. నిబంధనలను తుంగలో తొక్కుతూ పాఠశాల బయట ఏర్పాటు చేసుకోవాల్సిన పరిచయ, ప్రచార కార్యక్రమాలు స్కూలు వర్కింగ్ అవర్స్ లో ఏర్పాటు చేసుకోవడం పట్ల పలు విమర్శలు వెలువెత్తుతున్నాయి. తమ గెలుపు కోసం పాఠశాల క్లాసులు నడిచే సమయంలో విద్యార్థుల ఏకాగ్రతకు భంగం కలిగిస్తూ, సమయాన్ని వృధా చేస్తున్నటువంటి అభ్యర్థులు రేపు గెలిచినాక విద్యార్థుల పరిస్థితి ఏమిటని తల్లిదండ్రులు చర్చించుకుంటున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ రాకముందే ఇంత హంగామా సృష్టిస్తున్న అభ్యర్థులు, కోడ్ వచ్చి ఎలక్షన్స్ సమీపిస్తే విద్యార్థులను అసలు చదువుకొనిస్తారా అనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది. వీటిపై విద్యాశాఖ ఉన్నతాధికారులు దృష్టి సారించవలసిందిగా విద్యార్థుల తల్లిదండ్రులు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు.

## రంగంపేట పాఠశాలను అకస్మాక తనిఖీ చేసిన ఎంఈఓ సత్యనారాయణ



ప్రజాబలం కొల్చారం.మండలం అక్టోబర్ 26 మెదక్ జిల్లా కొల్చారం మండలం నూతన విద్యాధికారి సత్యనారాయణ జి.ప.ఉ.పా రంగంపేట ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. SA 1 పరీక్షల నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎం ఈ ఓ గారిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపేందర్ రెడ్డి ఉపాధ్యాయ బృందం సన్మానించింది సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## ఉద్యోగ ఉపాధ్యాయులకు నగదు రహిత వైద్య సేవలను అందించేందుకు కృషి చేస్తా

### పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి










జమ్మికుంట ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 26 ప్రైవేటు ఉద్యోగ,ఉపాధ్యాయులకు అన్ని ఆసుపత్రులలో నగదు రహిత వైద్య సేవలు అందించే విధంగా శాయశక్తుల కృషి చేస్తానని రాజ్యాంగంలో కల్పించబడ్డ హక్కులను దరి చేర్చబడమే లక్ష్యంగా పనిచేస్తానని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ డాక్టర్ వి నరేందర్ రెడ్డి స్పష్టం చేశారు. శనివారం జమ్మికుంట పట్టణ కేంద్రంలో పలు పాఠశాలల్లో ప్రచారం నిర్వహించారు. జమ్మికుంట కు విచ్చేసిన నరేందర్ రెడ్డి కి స్థానిక యువత అయ్యప్ప టెంపుల్ నుండి గాంధీ విగ్రహం వరకు బైక్ ర్యాలీతో ఘన స్వాగతం పలికారు. మహాత్మా గాంధీ,డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు అనుమతులు ఇచ్చే సమయంలో కఠినతరమైన నిబంధనలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి ఫైర్ సేఫ్టీ,క్రీడా మైదానాలు, నీటి వసతుల తదితర అంశాలను ప్రభుత్వం పరంగా అందించేందుకు కృషి చేస్తారని అన్నారు. రాబోయే రోజుల్లో ప్రైవేటు పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు మినిమమ్ బేసిక్ శాలరీ అమలు జరిగే విధంగా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేటు డిగ్రీ పీజీ కళాశాల యజమాన్యాలకు పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను విడుదలకు సహకరిస్తానని హామీ ఇచ్చారు..రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలనికోరారు. ప్రతి ఒక్క పట్టభద్రుడు నవంబర్ 6 లోపు తమ యొక్క ఓటు నమోదును చేసుకోవాలని పిలుపునిచ్చారు. మిస్డ్ కాల్ క్యాంపెయిన్ ద్వారా ఓటరు నమోదు కార్యక్రమం చేపడుతున్నామని ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూత్ నాయకులు అర్జున్,చిరంజీవి,రత్నాకర్, సుమంత్ తదితరులు పాల్గొన్నారు

## అక్రమ నీటి తరలింపును ఆపాలని అధికారులకు వినతిపత్రం అందజేసిన రైతులు



మెదక్ తూప్రాన్ అక్టోబర్ 26 ప్రజాబలం న్యూస్ :- మెదక్ జిల్ల తూప్రాన్ మరియు కిష్టాపూర్ హల్దీ వాగు గద్దర్ లిఫ్ట్ ఇరిగేషన్ నుండి నీటి అక్రమ తరలింపును వెంటనే ఆపివేయాలని ఆర్డీవో, డిప్యూటీ ఎమ్మార్వో,ఇరిగేషన్ అధికారులకు నీటిపారుదల రైతులు శనివారం వినతిపత్రం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... తూప్రాన్, కిష్టాపూర్ మధ్యగల హల్దీవాగు తూప్రాన్, తల మాణిక్యమైన గద్దర్ లిఫ్ట్ ఇరిగేషన్ వద్ద నుండి కిష్టాపూర్ రోడ్డు మార్గమున యావాపూర్ శివారులో గల సర్వే నెం. 385, 383, 382, 386, 387 నెంబర్ లలో గల %ట్రా% ల్యాండ్ మరియు ఇతర సర్వే నెంబర్ లో గల భూమి సుమారుగా 85 నుండి 90 ఎకరాల భూమి ఉందన్నారు. వ్యక్తీ కొందరి సహకారముతో 40 %నూ% మోటార్ సహాయముతో నేటిని మలించుకు వెళ్తున్నారని ఆరోపించారు. దీంతో తామంతా రోడ్డున పడతామని, అధికారులు వెంటనే స్పందించి నేటి మళ్లింపును అడ్డుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో దాసరి ఆంజనేయులు,మామిండ్ల అనిల్,దాసరి స్వామి , దుర్గయ్య,పిట్ల పోచయ్య,చుక్క రవి,శ్యామ్ రెడ్డి,శ్రీశైలం గౌడ్,విజయ్, లింగం,కిష్టాపూర్ గ్రామస్తులురైతులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విప్పు ఆది శ్రీనివాస్ కు ఘన సన్మానం



జమ్మికుంట ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 26ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ను కాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. వేములవాడ ఎమ్మెల్యే,రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత జమ్మికుంటకు తొలిసారి ఓ ప్రైవేటు ఫంక్షన్ కు హాజరు కాగా మున్నూరు కాపు సంక్షేమ సంఘం నియోజకవర్గ ఇన్చార్జ్, రాష్ట్ర కార్యదర్శి పొనగంటి మల్లయ్య ఆధ్వర్యంలో శనివారం జమ్మికుంట మండల కేంద్రంలో శాలువా తో ఘనంగా సన్మానించారు. మున్నూరు కాపు సంఘం వర్ధిల్లాలలి ఆది శ్రీనివాస్ నాయకత్వం వర్ధిల్లాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి ఏబూషి శ్రీనివాస్, కౌన్సిలర్లు పొనగంటి రామ్మూర్తి, మేడిపల్లి రవీందర్, పొనగంటి సారంగం, ధర్మారం సింగిల్ విండో వైస్ చైర్మన్ మేడిపల్లి మొగిలి, నాయకులు ఆకుల నారాయణ,కామిశెట్టి మల్లయ్య, పొనగంటి రవీందర్, పొనగంటి విష్ణు, మధు, రమేష్ ,తిరుపతి, ఉపేందర్ ,సతీష్, సురేష్, కుమార్, ఏ బూసి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## అదిభట్ల పోలీసు స్టేషన్ ను సందర్శించిన రాచకొండ సీపీ

రంగారెడ్డి రాచకొండ కమిషనరేట్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా వివిధ పోలీసు స్టేషన్లలో అధికారులు మరియు సిబ్బంది పనితీరు, సామాన్య ప్రజలకు అందిస్తున్న సేవలను సమీక్షించడానికి కమిషనర్ సుధీర్ బాబు ఈ రోజు ఆదిభట్ల పోలీస్ స్టేషన్ ను సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలను పరిశీలించి రికార్డులను పరిశీలించడంతో పాటు రిసెప్షన్, పెట్రోలింగ్ స్టాఫ్ వంటి పలు విభాగాల పనితీరు, సీసీటీవీ ల నిర్వహణ వంటి అంశాలను సమీక్షించారు. సమస్యాత్మక ప్రాంతాల సిబ్బంది ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. మహిళా భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని వారికి సూచించారు.

## సరిహద్దు ఒప్పందం మేరకు భారత్ చైనా సైనిక ఉపసంహరణ

న్యూఢిల్లీ అక్టోబర్ 26 సరిహద్దు ఒప్పందం మేరకు భారత్ చైనా శుక్రవారం ను చి సైనిక ఉపసంహరణ ప్రక్రియకు దిగాయి. ముందుగా ఘర్షణలకు తావు ఉండే ప్రాంతాల నుంచి ఇరుపక్షాలు సైన్యం వాపసీ ఆరంభించాయని అధికార వర్గాలు తెలిపాయి. వాస్తవాధీన రేఖ (ఎల్ఎసి) వెం బడి సైనిక ఉపసంహరణ కార్యక్రమం సజావుగా మొదలైం ది. రెం డు ప్రధాన వివాదాస్పదక స్థావరాలు డెమోచోక్, దెప్సాంగ్ ప్లె యిన్స్ వద్ద సందడి నెలకొంది. ఈస్టర్న్ లద్దాఖ్లో ఇరుపక్షాల మధ్య తరచూ ఘర్షణలకు ఈ రెండు స్థావరాలు ప్రధాన కేంద్రాలు అవుతూ వస్తున్నాయి. ఇక్కడ పరస్పరం సైన్యం వెనకకు వెళ్లడం కీలక పరిణా మం అని సైనిక వర్గాలు తెలిపాయి. సైన్యం ఉపసంహరణ ప్రక్రియ రెండు రోజుల్లోనే అంటే దాదాపుగా ఈ నెల 29 వరకూ పూర్తి అవుతుందని అంచనావేస్తున్నారు.

# జర్నలిస్టుల అక్రెడిటేషన్ల జీవో 1395 ను సవరించాలి

**-మీడియా అకాడమీ ఛైర్మన్ ఏకపక్ష నిర్ణయాలను అడ్డుకోవాలి**
**-అక్రెడిటేషన్ల విధి విధానాల కమిటీలో జర్నలిస్టు సంఘాలకు ప్రాతినిధ్యం ఇవ్వాలి**
**-మంత్రి పొంగులేటికి టీడబ్ల్యూజేఎఫ్ విజ్ఞప్తి.**



హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి: జర్నలిస్టుల అక్రెడిటేషన్ కార్డులకు సంబంధించి నియమ నిబంధనల మార్పు కోసం ప్రభుత్వం జారీ చేసిన జీవో 1395 లోపభూయిష్టంగా,ఏకపక్షంగా ఉందని, ఈ జీవోను వెంటనే సవరించి ప్రభుత్వం వేసిన అన్ని జర్నలిస్టు సంఘాలకు, చిన్న పత్రికలకు, మహిళా జర్నలిస్టులకు అవకాశం కల్పించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య, ఉపాధ్యక్షులు పులిపలుపుల ఆనందం, బండి విజయ్ కుమార్,ఎల్గొయి ప్రభాకర్, తదితరులు శనివారం రాష్ట్ర సమాచార,పౌరసంబంధాలు, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఇటు ప్రభుత్వానికి,అటు ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ గురుతర బాధ్యతలను నిర్వర్తిస్తున్న జర్నలిస్టులు సమాజం బాగోగులే లక్ష్యంగా పనిచేస్తూ సర్కారుకు సహకరిస్తున్నారని, అలాంటి జర్నలిస్టులకు గుర్తింపు కోసం ప్రభుత్వం సమాచార శాఖ నుంచి అక్రెడిటేషన్ కార్డులను ఇస్తున్నదని అన్నారు. తెలంగాణలో 2015 లో అక్రెడిటేషన్ రూల్స్ తో పాటు జర్నలిస్టు సంఘాలకు ప్రాతినిధ్యం కల్పిస్తూ జీవో 239 ను అప్పటి ప్రభుత్వం విడుదల చేసిందని, రూల్స్ ఫ్రేమ్ చేయడానికి మాజీ సంపాదకులు రామచంద్ర మూర్తి నేతృత్వంలో అల్లం నారాయణ, కే. శ్రీనివాస్ రెడ్డి, క్రాంతికిరణ్, కే శ్రీనివాస్ ఇతర సీనియర్ ఎడిటర్లతో కలిపి కమిటీ వేసి అక్రెడిటేషన్ ల మార్గదర్శకాలు రూపొందించారని తెలిపారు. వాటిని జీవో 239 ద్వారా ఆమోదించి గత పదేండ్లుగా అమలు చేస్తున్నారని, అయితే తాజాగా అక్రెడిటేషన్ రూల్స్



మార్చేందుకు ప్రభుత్వం జీవో 1395 ను జారీ చేసిందని, అయితే ఈ జీవో అసంబద్ధంగా ఉందని పేర్కొన్నారు. ఈ జీవో కు సవరణ చేయాలని డిమాండ్ చేశారు. ఈ జీవో లో సీనియర్ ఎడిటర్ లు కాకుండా మీడియా అకాడమీ ముసుగులో ఉన్న ఒక జర్నలిస్టు యూనియన్ చెందిన వారికే ప్రాతినిధ్యం కల్పించారని ఆరోపించారు. గతంలో ఇచ్చిన జీవో 239 ప్రకారం మూడు జర్నలిస్టు సంఘాలకు అవకాశం ఇవ్వాలని, కానీ ఇవ్వలేదని, అలాగే చిన్న పత్రికలను, మహిళా జర్నలిస్టులను పట్టించుకోలేదని వారు మంత్రితో అన్నారు. మీడియా అకాడమీ కనుసన్నల్లో ప్రభుత్వం ఏకపక్షంగా జారీ చేసిన ఈ కొత్త జీవోను ఖచ్చితంగా సవరించిన తరువాతే అక్రెడిటేషన్ కార్డుల నిబంధనలపై నిర్ణయం తీసుకోవాలని కోరారు. గతంలో నిబంధనలు రూపొందించిన పెద్దమనుషులే మళ్లీ ఇప్పుడు కొత్త నిబంధనల జపం చేస్తున్నారని, మీడియా అకాడమీ ముసుగులో ఉన్న ఒక యూనియన్ గానీ, మీడియా అకాడమీ గానీ జర్నలిస్టుల అక్రెడిటేషన్ల విషయంలో వాస్తవాలు చెప్పడం లేదని విమర్శించారు. తన ప్రాబల్యాన్ని పెంచుకునేందుకు ఆ యూనియన్ తప్పుడు చర్యలకు పాల్పడుతుందని, దానికి మీడియా అకాడమీ ఛైర్మన్ మద్దతు ఇస్తూ ప్రభుత్వాన్ని జర్నలిస్టుల్లో పలుచన చేసే ప్రయత్నం జరుగుతుందని అన్నారు. ఏకపక్ష ధోరణి, తప్పుడు నిర్ణయాల వల్ల ప్రభుత్వం విమర్శలకు గురయ్యే అవకాశం ఉందని, ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా పునరాలోచించి తాజా జీవో 1395 ను సవరించాలని వారు కోరారు. జర్నలిస్టు సంఘాలతో పాటు చిన్నపత్రికలకు, మహిళా జర్నలిస్టులకు కమిటీలో అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం వారు సమాచార పౌరసంబంధాల శాఖ కమీషనర్ హనుమంతరావుకు ఇచ్చే వినతి పత్రాన్ని జాయింట్ డైరెక్టర్ జగన్ కు సమర్పించారు. మంత్రిని కలిసిన వారిలో ఫెడరేషన్ రాష్ట్ర క ా ం ్ య ద ్ ం ్ ు ్ ల ు సలీమా,చంద్రశేఖర్,రాజశేఖర్,నేషనల్ కౌన్సిల్ మెంబర్ రమాదేవి, హెచ్ యూజే కార్యనిర్వాహక కార్యదర్శి నాగవాణి, పి.విజయ తదితరులు ఉన్నారు.

# సమగ్ర ఇంటింటి కులసర్వేలో ప్రామాణిక పద్ధతులు అనివార్యం

**సర్వే ప్రశ్నావళిలో ఎలాంటి అంశాలు చేర్చారో వివరాలను అఖిలపక్షంతో చర్చించాలి**
**సమగ్ర కులసర్వేను స్వతంత్ర కులసర్వే కమిషన్‌ను నియమించి వివరాలను సేకరించాలి**
**సంచార, అర్ధసంచార, విముక్తజాతుల వివరాలను ప్రత్యేకంగా వారు నివాసాలు ఉండే ప్రాంతాలను గుర్తించి వివరాలను సేకరించాలి.**
**కులగణనపై పబ్లిక్ హియరింగ్‌లో అభిప్రాయాలు, సూచనలు వ్యక్తం చేసిన అఖిలపక్ష కులసంఘాల ప్రతినిధులు**



ఖైరతాబాద్ ప్రజాబలం ప్రతినిధి:రాష్ట్రప్రభుత్వం త్వరలో చేపట్టబోయే ఇంటింటి సమగ్ర కులసర్వేకు సంబంధించిన ప్రశ్నావళిలో ఉండే అంశాలను బహిర్గతం చేసి అఖిలపక్ష కులసంఘాలతో చర్చించి సమగ్ర వివరాల సేకరణకు ప్రభుత్వం ముందుకు రావాలని కులగణనపై జరిగిన పబ్లిక్ హియరింగ్‌లో కులసంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. శనివారం నాడు సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో పీపుల్స్ కమిటీ ఆన్ క్యాస్ట్ సెన్సెస్, తెలంగాణ బి.సి. ఉద్యోగుల ఫెడరేషన్‌లు సంయుక్తంగా కులగణనపై పబ్లిక్ హియరింగ్ కార్యక్రమాన్ని చేపట్టాయి. పబ్లిక్ హియరింగ్ జ్యూరీ ప్యానెల్‌గా జస్టిస్ వి.చంద్రకుమార్, బి.సి. కమిషన్ పూర్వ ఛైర్మన్ డా॥ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, ఉస్మానియా విశ్వవిద్యాలయం జర్నలిజం శాఖ పూర్వ ప్రొఫెసర్ బి.ఎల్. విశ్వేశ్వరరావులు వ్యవహరించారు. కార్యక్రమానికి ప్రధాన సమన్వయ కర్తలుగా ప్రొఫెసర్ మురళీమనోహర్, దేవుల సమ్మయ్యలు వ్యవహరించారు. ఈ సందర్భంగా జరిగిన పబ్లిక్ హియరింగ్‌లో పెద్దఎత్తున బి.సి., ఎస్.సి., ఎస్.టి. తదితర కులసంఘాలకు చెందిన ప్రతినిధులు పాల్గొని, తమ అభిప్రాయాలను వ్యక్తంచేశారు. పలు నిర్మాణాత్మక సూచనలను చేశారు.

రాష్ట్రంలో కులసర్వే నిర్వహించడానికన్నా ముందే సమగ్రంగా అన్ని పక్షాలతో రాష్ట్రప్రభుత్వం చర్చలు, సమావేశాలు నిర్వహించాలని సూచించడం జరిగింది. ప్రభుత్వం ఎలాంటి ప్రామాణిక పద్ధతులు అవలంబిస్తున్నదో ప్రజలకు వివరించాలని కోరారు. బీహార్‌లో అక్కడి ప్రభుత్వం రాత్రింబవళ్లు కష్టపడి సమగ్ర కులసర్వే నిర్వహించడం జరిగిందని అయితే పలు నిర్దిష్ట విధానాలను అవలంబించక పోవడం వలన పాట్నా హైకోర్టు అక్కడి రిజర్వేషన్‌ల పెంపు చట్టంను కొట్టివేసిందని పలువురు పబ్లిక్ హియరింగ్‌లో సాధికారికంగా వివరించారు. అలాంటి ఇబ్బందికరమైన పరిస్థితులు రాష్ట్రంలో తలెత్తకుండా ముందస్తుగానే అన్ని పద్ధతులను సమగ్రంగా ఆచరణలో పెట్టడం అవసరమని పలువురు సామాజికవేత్తలు, న్యాయ నిపుణులు సూచించారు. ఎన్యుమరేటర్స్‌గా ఎవరిని ఎంపిక చేస్తారో ఎన్యుమరేటర్స్‌కు శిక్షణ, వారు



పాటించాల్సిన గైడ్ రూపకల్పనలో అవలంబించాల్సిన పద్ధతుల మీద కూడా పబ్లిక్ హియరింగ్‌లో పలువురు సోదాహరణంగా అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

బీహార్‌లో అక్కడి రాష్ట్రప్రభుత్వ శాఖ అయిన జి.ఎ.డి. ద్వారా కులసర్వేను నిర్వహించడం వలన పలు విమర్శలు, న్యాయపరమైన ఇబ్బందులు, ఆ రాష్ట్రప్రభుత్వం ఎదుర్కొందని నేటి పబ్లిక్ హియరింగ్‌లో పలువురు న్యాయవాదులు ఆ వివరాలను సమావేశంలో చర్చించారు. ఈ నేపథ్యంలో రాష్ట్రప్రభుత్వం స్వతంత్ర ప్రతిపత్తి గలిగిన కులసర్వే కమిషన్‌ను నియమించాలని అందుకు అందుబాటులో ఉన్న కమిషన్ ఆఫ్ ఎంక్వైరీస్ చట్టం-1952 ద్వారా సాధ్యమవుతుందని అన్నారు. సేకరించబడే వివరాలను ఎప్పటికప్పుడు సమగ్రంగా అధ్యయనం చేసి విశ్లేషించడము, తులనాత్మకంగా పరిశీలించడము మున్నగు అంశాలపై కృషిచేయడానికి నిపుణుల కమిటీలను ఏర్పాటు చేయాలని పబ్లిక్ హియరింగ్‌లో అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.

బి.సి. కమిషన్ చట్టంలో సర్వే చేయడానికి వీలుగా పలు సవరణలను తీసుకొచ్చి, బి.సి. కమిషన్‌ను కూడా ఇలాంటి కార్యక్రమాలలో పూర్తిగా ఉపయోగించుకోవచ్చునని పలువురు అభిప్రాయాలను వ్యక్తంచేశారు. ప్రభుత్వం కులసర్వే విషయంలో ఎలాంటి ప్రామాణిక పద్ధతులను అవలంబించ బోతున్నది, ఎలాంటి అంశాలను ప్రశ్నావళిలో చేర్చింది, ఎలాంటి విధాన నిర్ణయాలతో ముందుకు పోతున్నది అనే అంశాలపై అనేక సంశయాలు పబ్లిక్ హియరింగ్‌లో వ్యక్తమయ్యాయి. అన్ని సంశయాలకు, అనుమానాలకు నివృత్తిని కలిగించడానికి అఖిలపక్ష కులసంఘాల, అఖిలపక్ష రాజకీయ పార్టీలతో, సామాజికవేత్తలు, విషయ నిపుణులు, నిపుణత గలిగిన వివిధ సంస్థల ప్రతినిధులతో ప్రభుత్వం ప్రత్యేక సమావేశాలను నిర్వహించడం అనివార్యమైందని అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. పబ్లిక్ హియరింగ్‌లో వ్యక్తమైన అన్ని అభిప్రాయాలను పబ్లిక్ జ్యూరీప్యానెల్ వెంటనే ఒక నివేదిక రూపకల్పన చేసి, ప్రభుత్వానికి అందజేయనున్నట్లు సభకు అధ్యక్షత వహించిన దేవళ్ల సమ్మయ్య, సమన్వయకర్త కె.మురళీమనోహర్‌లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ సుదర్శన్‌రావు, ప్రొఫెసర్ బాగయ్య, డాక్టర్ పృథ్వీరాజ్ యాదవ్, సతీష్ కొట్టె, వినోద్ కుర్వ, డా॥ వేణుయాదవ్, డా॥ తుల్జారాం సింగ్, డా॥ విజయ్‌కుమార్, కె.పి. మురళీకృష్ణ, విఠోబా, నరహరి, నిమ్మల వీరన్న, సి.హెచ్.ఉపేంద్ర, విజయేందర్‌సాగర్, పిల్లి రాజమౌళి, కొన్నె శంకర్‌గౌడ్, అనిల్‌కుమార్, తుమ్మనాపల్లి శ్రీనివాస్, చింతగింజ శ్రీహరిరావు, శివశంకర్ యాదవ్, డా॥ శోపరి శంకర్ ముదిరాజ్, పొన్నం దేవరాజ్‌గౌడ్, ఎం.సేనాపతి, తదితర సుమారు 150 కుల సంఘాల ప్రతినిధులు, వివిధ రంగాల విషయ నిపుణులు, సామాజికవేత్తలు పెద్దఎత్తున పబ్లిక్ హియరింగ్‌లో పాల్గొని తమ అభిప్రాయాలను వ్యక్తంచేశారు.

# న్యాయ వాదుల సమస్యల పరిష్కారానికి కృషి




న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ లీగల్ సెల్ పక్షాన కృషి చేస్తున్నామని లీగల్ సెల్ జిల్లా చైర్మన్ కల్లేపల్లి లక్ష్మయ్య తెలిపారు. శనివారం కరీంనగర్లోని ఇందిరా గార్డెన్లో జరిగిన లీగల్ సెల్ జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. న్యాయవాదులు దాడులకు గురవుతూ, అనేక రకాల సమస్యలు ఎందుర్కొంటున్నారన్నారు. న్యాయవాదులకు సంబంధించిన పలు సమస్యలపై ఈ సమావేశంలో తీర్మాణం చేసినట్లు తెలిపారు. ఈ తీర్మాణాలను లీగల్ సెల్ రాష్ట్ర చైర్మన్ పొన్నం అశోక్ గారికి విన్నవించి సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తామన్నారు.

1 న్యాయవాదులకు రక్షణ చట్టం కావాలి.
2. హెల్త్ ఇన్సూరెన్స్ ఐదు లక్షల నుంచి పది లక్షలకు పెంచాలి. 3 . ఎస్సీ, ఎస్టీ, బీసీ జూనియర్ న్యాయవాదులకు రూ . 10000 స్కాలర్షిప్ ఇవ్వాలి.
4. గత ప్రభుత్వ హయాంలో నియమించిన పీపీలను వీలైనంత తొందరగా తొలగించేందుకు జీవో తీసుకురావాలి.
5. కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి పనిచేసిన లీగల్ సెల్ న్యాయవాదులను పీపీలుగా నామినేట్ చేయాలి.
6. న్యాయవాదులకు సంవత్సరాల తర్వాత పెన్షన్ విధానాన్ని ప్రవేశ పెట్టాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో లీగల్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రూపిరెడ్డి దేవేందర్ రెడ్డి, జిల్లా కన్వీనర్లు కొత్తకొండా శంకర్, లింగంపెల్లి శ్రీకాంత్, యం డి నవాజ్, సీనియర్ న్యాయవాదులు పెంచాల లక్ష్మన్ రావు, రాచకొండ ప్రభాకర్, వి బాలకిషన్ రావు, బి మురళి మనోహర్, డి వి రమణ, మంచికట్ల రాజేశం, కొత్త ప్రకాశ్, గాదం స్వామి తేజ, జి మహేందర్, బి రాజ్, జి దిలీప్, యం సుజిత్ కుమార్ తదితులున్నారు.




**ఏఐసీసీ కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర ఇంచార్జి, మాజీ ఎంపీ పి.విశ్వనాథన్‌తో పాటు రాజేష్ అగర్వాల్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువ కప్పి సన్మానించిన శంబుల శ్రీకాంత్‌గౌడ్**

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com